www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 16-6-2024 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 61 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: దశమి తె. 4.44 తదుపరి ఏకాదశి; నక్షత్రం: హస్త ఉ. 11.13 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 8.05-9.51; దుర్ముహూర్తం: సా. 5.02-5.54; అమృతఘడియలు: శేషం ఉ. 6.16; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘విష’ రాజకీయం!


అనంతపురం జిల్లా తుంబిగనూరులోని వాటర్‌ప్లాంట్

తాగునీటి ప్లాంట్‌లో పురుగులమందు

వాసన పసిగట్టి అప్రమత్తమైన ప్రజలు

ఓట్లు వేయలేదనే కోపంతో వైసీపీ నేత చేయించారని గ్రామస్థుల ఆరోపణ

అనంతపురం జిల్లాలో ఘోరం

స్థానికుల ఫిర్యాదుతో పోలీసుల విచారణ

3

30 లక్షలకు నీట్ పేపర్!

ఒక్కొక్క అభ్యర్థి నుంచి వసూలు చేసిన బిహార్ ముఠా

వారందరినీ రహస్య ప్రదేశాల్లో ఉంచి జవాబుల బట్టీ

నిందితుల వెల్లడి.. 13 మందికి ముందే ప్రశ్నపత్రం

వారిలో నలుగురు అరెస్టు.. మరో 9 మందికి నోటీసులు

మళ్లీ పరీక్షకు ఆదేశించండి.. సుప్రీంలో విద్యార్థుల పిటిషన్

19, 20 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు ఏఐఎస్‌ఏ పిలుపు

2

గోవిందా.. గోవిందా!



తిరుమల పవిత్రతపై వైసీపీ దెబ్బ

వ్యాపారమయంగా మార్చిన జగన్

ధర్మారెడ్డి హయాంలో రాజకీయ రచ్చ

లెక్కకుమించి సలహాదారుల నియామకం

ఇంజనీరింగ్ పనుల పేరిట కమీషన్లు

భక్తులకు ఇచ్చే గదుల ధరలు రెట్టింపు

తిరుమల పాలన ప్రక్షాళన ఎలా?

సీఎం చంద్రబాబుపై భక్తులకు కోటి ఆశలు

12

గతం మరిచి గగ్గోలు..



చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగు రోజులు మాత్రమే అయింది. ఇంతలోనే రాష్ట్రంలో శాంతి భద్రతలు కుప్పకూలిపోయినట్టుగా శోకాలు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. కొత్త ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు అధికారంలో ఉన్న ఐదేళ్లలో తామేం చేశామో మరచిపోయారు.

2014 నుంచి 2019 వరకు శాసనసభ స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకోవడానికి జగన్ ప్రభుత్వ వేధింపులు కారణం కాదా? కరోనా సమయంలో మాస్కులు ఇవ్వడం లేదని ప్రశ్నించినందుకు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆయన చావుకు కారణం కాలేదా? పరువు ప్రతిష్ఠలతో బతికినవారిని, ఆత్మవిశ్వాసంతో ఎదురు నిలిచిన వారిని వేధించడమే పనిగా పెట్టుకోలేదా?

ధర్మో రక్షతి రక్షితః అంటారు. మనం ధర్మబద్ధంగా వ్యవహరిస్తే, ఇతరులు కూడా మన పట్ల ధర్మబద్ధంగా వ్యవహరించాలని కోరవచ్చు. అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వాళ్లు ఇప్పుడు అన్యాయం, అక్రమం అని శోకాలు పెట్టడమేమిటి?

కొంతమంది తన మంత్రులు, శాసనసభ్యులు ప్రతిపక్ష నేత చంద్రబాబు వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా బహిరంగంగా వాడూ వీడూ, చెత్త నా కొడుకు అని దూషించినప్పుడు ముఖ్యమంత్రిగా మౌనంగా ఉండిపోవడం ఏ నీతి? ఏ రీతి?

తనకు గిట్టని మీడియా సంస్థలను శాసనసభ కార్యక్రమాలు ప్రసారం చేయకుండా నిషేధించలేదా? ముఖ్యమంత్రి నివాసం పరిసరాలకు కూడా రానివ్వలేదే? ఆంధ్రజ్యోతి పత్రికకు, ఏబీఎన్ చానల్‌కు ఐదేళ్లపాటు న్యాయంగా ఇవ్వాల్సిన ప్రకటనల్లో ఒక్కటైనా ఇవ్వకపోవడం ఏ నీతి?

ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ మళ్లీ ఎన్నికల నాటికి ప్రజాభిమానం చూరగొనడానికి ప్రయత్నిస్తుంది. జగన్ అండ్ కోలో ఈ ఛాయలు కూడా కనిపించడంలేదు. తప్పంతా ప్రజలదే అన్నట్టుగా ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. నిజంగా మంచి పాలనే ఇస్తే ప్రజలెందుకు ఓడిస్తారు?

పూర్వం రాజుల ఆస్థానంలో పొగడ్తల కోసం కొంత మంది ఉండేవారు. జగన్ రెడ్డి ఆస్థానంలో కూడా ఇలాంటి వారు చేరారు. వారి మాటలను నిజంగానే నమ్మిన జగన్ రెడ్డి క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుసుకొనే ప్రయత్నం చేయలేదు. భజనపరుల మాటలు నమ్మి మునిగిపోయారు.

టీడీపీ-జనసేన పార్టీల మధ్య విభేదాలు సృష్టించడానికి జగన్ అండ్ కో సహజంగానే ప్రయత్నిస్తుంది. పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు అసాధారణ పరిణతి ప్రదర్శించారు. టీడీపీతో పొత్తు ఏర్పడకుండా చెడగొట్టడానికి ఎవరెంత ప్రయత్నించినా ఖాతరు చేయలేదు. మైత్రిని చెడగొట్టడానికి జరిగే ప్రయత్నాలు సఫలం కాకూడదంటే.. విభేదాలు ఏర్పడితే వాటి పరిష్కారానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి.

కొత్త పలుకు

ఆర్కే విశ్లేషణ 4లో..


5 కోట్లతో తాడేపల్లిలో జగన్ నివాసం వద్ద సకల హంగులతో నిర్మించిన రహదారి


తాడేపల్లిలో జగన్ నివాసం చుట్టూ ఇనుప ‘ప్రహరీ’

జగన్ ఇంటిగుట్టు!

తాడేపల్లి ప్యాలెస్‌కు జనం సొమ్ముతో సోకులు

ఇంటినే క్యాంప్ ఆఫీసుగా మార్చి హంగామా

ఆర్అండ్‌బీ ద్వారా గుట్టుగా కోట్ల ఖర్చు

జీఓలు, ఇతర ఆదేశాలన్నీ రహస్యం

హెలిప్యాడ్, ఆలయాల సెట్టింగ్‌లు

ఫర్నీచర్ ఇవ్వలేదని గతంలో కోడెలకు వేధింపులు

ఇప్పుడు పదవి పోయినా వదలని వైనం

ఇంకా సొంత ఆస్తిలా అనుభవిస్తున్న జగన్

ప్యాలెస్ గుట్టును కొత్త ప్రభుత్వం విప్పుతుందా?

కళ్లు చెదిరే ఫర్నీచర్, విలాసవంతమైన సదుపాయాలు.. అబ్బో చూడటానికి ఇంద్రభవనాన్నే తలపిస్తుంది. ఇందుకోసం చేసిన ఖర్చు రూ.45.54 కోట్లు. పేదల పక్షపాతినని చెప్పుకొన్న జగన్ తాడేపల్లి ప్యాలెస్ కోసం ఖజానా నుంచి చేసిన ఖర్చు ఇది.

రాజభోగాలకు ఐదేళ్లలో 45 కోట్లు



ఏసీల కోసం రూ.1.5 కోట్లు.. ఆలయాల సెట్టింగ్‌లకు రూ.1.45 కోట్లు

టేబుళ్లు, ఇతర ఫర్నీచర్‌కు 1.37 కోట్లు.. సోఫాలు, కుర్చీలు, ఇతరత్రా 4.5 కోట్లు

వీడియో, టెలీకాన్ఫరెన్స్‌లకు 3.45 కోట్లు.. కిటికీలు, తలుపులకు 73 లక్షలు

జగన్ ఇప్పుడు ముఖ్యమంత్రి కాదు. ఎన్నికల్లో ఆయన పార్టీ చిత్తుగా ఓడిపోవడంతో కనీసం ప్రతిపక్ష నేత హోదా కూడా రాదు. ఆయన ఇప్పుడు ఓ ఎమ్మెల్యే మాత్రమే. అయినా ఇంకా ఆ రాజభోగాలను అనుభవిస్తూనే ఉన్నారు. గతంలో మాజీ స్పీకర్ కోడెల సొంతానికి ఫర్నీచర్ వాడుకున్నారని ఆయన్ను వేధించారు. మరి ఇప్పుడు ప్రభుత్వ ఖర్చుతో జల్సా చేస్తున్న జగన్‌ను ఏం చేయాలి? అడ్డగోలుగా ఖర్చు చేసిన అధికారులను ఏం చేయాలి?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి హోదాలో జగన్ తాడేపల్లిలోని సొంత ఇంటినే క్యాంపు ఆఫీసుగా మార్చేసుకొని సకల రాజభోగాలు అనుభవించారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో సకల ఆడంబరాలు, వసతులు కల్పించుకున్నారు. సచివాలయానికి

మిగతా 11వ పేజీలో...

జగన్ అక్రమ కట్టడాల కూల్చివేత

హైదరాబాద్ లోటస్‌పాండ్ వద్ద ఫుట్‌పాత్‌పై నిర్మాణాలు

12

అవి నా మనసుకు నచ్చిన శాఖలు



ప్రజలకు నేరుగా సేవచేసే అవకాశం

పల్లెలకు రక్షిత మంచినీరు లక్ష్యం

ఉపాధి నిధుల సద్వినియోగం, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

అడవులను పరిరక్షిస్తాం

ఎర్రచందనం దొంగలపై ఉక్కుపాదం: పవన్ కల్యాణ్

11



చైనా.. తీరు మార్చుకో

ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు సాయం తగదు

తక్షణమే ఆపకుంటే మరిన్ని ఆంక్షలు తప్పవు

ఉమ్మడి ప్రకటనలో జి-7 కూటమి హెచ్చరిక

2

అలకనంద నదిలోకి దూసుకెళ్లిన టెంపో



14 మంది యాత్రికుల మృతి

2


గన్నవరం విమానాశ్రయంలో విజయవాడ - ముంబై ఎయిర్ ఇండియా విమానానికి వాటర్ సెల్యూట్‌తో స్వాగతం

బెజవాడ నుంచి ముంబైకి డైలీ ఫ్లైట్

ప్రారంభించిన ఎంపీలు బాలశౌరి, కేశినేని చిన్ని

12


మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

అహంకారానికి దూరంగా.. బాధ్యతతో

పనిచేద్దాం

ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడానికి కృషి చేద్దాం

టీడీపీలో కింది స్థాయి నేతలకు చంద్రబాబు పిలుపు

ఈ విజయం పార్టీ కార్యకర్తలకు అంకితమని వ్యాఖ్య

త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటన

రేపు పోలవరానికి సీఎం.. క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం

అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ‘అహంకారానికి దూరంగా బాధ్యతతో పని చేద్దాం. ఏ ఆశలు, ఆకాంక్షలతో మనల్ని గెలిపించారో వాటిని నెరవేర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేద్దాం. పాలన ఎలా ఉండకూడదో జగన్ చూపించారు. ఎలా ఉండాలో మనం

మిగతా 11వ పేజీలో...

ఐదేళ్లలో మూతపడిన బడులెన్ని?

పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లకు కారణాలేమిటి?

ఏడాదిలో మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేయాలి

ఇంటర్ విద్యార్థులకు నెలలోగా పాఠ్యపుస్తకాల పంపిణీ

ఇకపై పారదర్శకంగా ఉపాధ్యాయుల బదిలీలు

ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో నూతన ఐటీ పాలసీ

పాఠశాల విద్య, ఐటీ శాఖలపై మంత్రి లోకేశ్ సమీక్ష

మధ్యాహ్న భోజనం అమలు, నాణ్యతపై ఆరా

11


మంగళగిరిలో ప్రజల సమస్యలు వింటున్న లోకేశ్

18న పీఎం కిసాన్ నిధుల విడుదల

» 9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు నిధులు

న్యూఢిల్లీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రైతులకు అందించే పీఎం కిసాన్ నిధులను ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. 17వ విడత కింద రూ.20 వేల కోట్ల పీఎం కిసాన్ నిధులను వారాణసీలో నిర్వహించే ఒక కార్యక్రమంలో ప్రధాని మోదీ విడుదల చేస్తారని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం వెల్లడించారు. 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో ఈ నిధులు జమకానున్నట్లు మంత్రి తెలిపారు. అంతేకాకుండా శిక్షణ పొందిన 30 వేలకు పైగా స్వయం సహాయక సంఘాలకు కృషి సఖీ గుర్తింపు పత్రాలను మోదీ ప్రదానం చేస్తారని తెలిపారు ఇప్పటివరకు 11 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ కింద రూ.3 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసిట్లు పేర్కొన్నారు. 17వ విడత నిధులతో కలిపి లబ్ధిదారులకు అందించిన మొత్తం రూ.3.24 లక్షల కోట్లు దాటుతుందని తెలిపారు.

ఇందిర 'మదర్ ఆఫ్ ఇండియా': సురేశ్ గోపి



న్యూఢిల్లీ, జూన్ 15: కేంద్రమంత్రి సురేష్ గోపి మాజీ ప్రధాని ఇందిరా గాంధీని 'మదర్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించారు. అలాగే కేరళలో దివంగత కాంగ్రెస్ ముఖ్యమంత్రి కె. కరుణాకరన్(కాంగ్రెస్)ని ధైర్యంగల పరిపాలనాదక్షుడు అన్నారు. కరుణాకరన్, మార్క్సిస్ట్ వెటరన్ ఇకె. నయనార్‌లను తన రాజకీయ గురువులుగా పేర్కొన్నారు. కేరళలోని త్రిశ్శూర్‌లో కరుణాకరన్ స్మారక మురళి మందిరాన్ని శనివారం సందర్శించిన అనంతరం సురేష్ గోపి విలేకరులతో మాట్లాడుతూ... ఈ వ్యాఖ్యలు చేశారు. తాను కరుణాకరన్ స్మారక మందిరాన్ని సందర్శించడానికి ఎటువంటి రాజకీయ రంగు పులమవద్దని విలేకరులను సురేష్ గోపి కోరారు. తన గురువుకు నివాళులు అర్పించేందుకే తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. కరుణాకరన్‌ను కేరళలో కాంగ్రెస్ పార్టీకి తండ్రివంటివారని సురేశ్ గోపి పేర్కొన్నారు. 2019లోనే తాను మురళి మందిరాన్ని సందర్శించాలనుకొన్నా బీజేపీలో చేరిన కరుణాకరన్ కుమార్తె పద్మజా వేణుగోపాల్ రాజకీయ కారణాల వల్ల వద్దని చెప్పారని అన్నారు.

యూపీలో రూ.4,400 కోట్ల ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ, జూన్ 15: అక్రమ మైనింగ్ కేసులో పరారీలో ఉన్న ఉత్తరప్రదేశ్ బీఎస్పీ మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్‌పై ఈడీ కొరడా ఝుళిపించింది. ఇక్బాల్, ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన రూ.4,400 కోట్ల విలువైన ఆస్తులను శుక్రవారం జప్తు చేసింది. వీటిలో సహరాన్‌పూర్‌లోని గ్లోకల్ యూనివర్సిటీ భవనంతో పాటు 121 ఎకరాల భూములున్నాయి. ఈ ఆస్తులు అబ్దుల్ వహీద్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ పేరిట రిజిస్టరై ఉన్నాయని.. దీని బాధ్యతలు ఇక్బాల్, ఆయన కుటుంబీకులే చూసుకుంటున్నారని ఈడీ తెలిపింది. ఇక్బాల్ దుబాయ్‌కి పారిపోయినట్లు సమాచారం. ఆయన నలుగురు కుమారులు వివిధ కేసుల్లో జైల్లో ఉన్నారు.

కేజ్రీవాల్ విచారణ వీడియోలను తొలగించండి

» భార్య సునీతకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూన్ 15: ఎక్సయిజ్ విధానం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను కోర్టులో విచారించిన వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని శనివారం ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. కేజ్రీవాల్ సతీమణి సునీతతో పాటు యూట్యూబ్, మెటా సంస్థ, మొత్తం ఆరుగురికి ఈ ఆదేశాలు ఇచ్చింది. విచారణ నిమిత్తం మార్చి 28న కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రౌజ్ అవెన్యూలోని ట్రయల్ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కోర్టును ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగాన్ని ఓ 'ఎక్స్' వినియోగదారుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. దీన్ని సునీత కేజ్రీవాల్‌తో పాటు మరికొందరు రీపోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్‌గా మారింది. దాంతో తగిన అనుమతులు లేకుండా కోర్టు కార్యకలాపాలను చిత్రీకరించకూడదని, అంతేకాకుండా ఇది వీడియో కాన్ఫరెన్స్ నిబంధనలకు కూడా విరుద్ధమని పేర్కొంటూ న్యాయవాది వైభవ్ సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

'శిక్షణ'లో క్రిమినల్ చట్టాలను చేర్చండి: కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 15: శిక్షణ కార్యక్రమాల్లో నూతన క్రిమినల్ చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలను చేర్చాలని కేంద్ర ప్రభుత్వం అన్ని మంత్రిత్వశాఖలను ఆదేశించింది. ఈ మూడు చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి రానున్నట్టు తాజా సర్క్యులర్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగం పేర్కొంది. ఈ మూడు చట్టాలకు సంబంధించిన అంశాలను శిక్షణ కార్యక్రమాల్లో చేర్చాలని తమ పరిధిలోని అన్ని శిక్షణ సంస్థలకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని ఆ సర్క్యులర్‌లో అన్ని మంత్రిత్వశాఖలకు సూచించింది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఐపీసీ(ఇండియన్ పీనల్ కోడ్), భారతీయ సాక్ష్య చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చట్టాల స్థానంలో ఈ మూడు నూతన చట్టాలను కేంద్రం తీసుకొచ్చింది.

రికార్డుల్లో ఉన్న సమాచారమే ఇవ్వగలం : సీఐసీ

న్యూఢిల్లీ, జూన్ 15: ప్రభుత్వ విభాగాలు తమ రికార్డుల్లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని మాత్రమే ఇవ్వగలవంటూ కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) స్పష్టం చేసింది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) దరఖాస్తుకు రాష్ట్రపతి భవన్ ఇచ్చిన సమాధానాన్ని సమర్థించింది. కేంద్ర మంత్రిమండలి తీసుకున్న ఏ నిర్ణయాన్నీ పునఃపరిశీలించాలంటూ రాష్ట్రపతి తిప్పిపంపలేదని, లేదా తిప్పి పంపినట్టు సమాచారం ఏదీ తమ రికార్డుల్లో అందుబాటులో లేదని రాష్ట్రపతి భవన్ స్పెషల్ డ్యూటీ అధికారి.. ఆర్టీఐ కార్యకర్తకు ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. అయితే, తనకు సంతృప్తికరమైన సమాధానం రాలేదని, రాజ్యాంగపరంగా ఎన్నికైన రాష్ట్రపతి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆర్టీఐ కార్యకర్త సీఐసీకి రెండోసారి చేసిన అప్పీలులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఐసీ హీరాలాల్ సమారియా.. సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం ప్రభుత్వ రికార్డుల్లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని మాత్రమే ఇవ్వడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ ఉండొద్దని లక్ష్యం

న్యూఢిల్లీ, జూన్ 15: రైళ్లలో డిమాండుకు తగ్గట్టుగా సీట్లు, బెర్తులు లభ్యంకాక ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలపై రైల్వే శాఖ దృష్టి పెట్టింది. రానున్న ఎనిమిదేళ్లలో ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని నిర్ణయించింది. కొత్త రైళ్లను నడపడం ద్వారా 2032 నాటికి వెయిటింగ్ లిస్టులు అన్నవే లేకుండా చేసి అందరికీ రిజర్వుడు సీట్లు లభించేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకొంది. రైల్వే మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అశ్విని వైష్ణవ్ శుక్రవారం అధికారులతో సమావేశమయి రైళ్లలో భద్రత, సమయపాలన, స్టేషన్లలో సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ వేసవిలో రద్దీని తట్టుకోవడానికి గతేడాది కన్నా ఎక్కువగా రైళ్ల నడిపినట్టు, అదనంగా 4కోట్ల మంది ప్రయాణించినట్లు అధికారులు వివరించారు.

జైషే హెచ్చరికలు.. అయోధ్యలో హైఅలెర్ట్ !

న్యూఢిల్లీ, జూన్ 15: రామ మందిరాన్ని పేల్చేస్తామంటూ ఉగ్రవాద సంస్థ జైషే మమహ్మద్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అయోధ్యలో భద్రతను పెంచారు. జైషే హెచ్చరికలకు సంబంధించిన ఓ ఆడియో సందేశం వైరల్‌గా మారింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆలయానికి చేరుకునే మార్గాలు, పరిసరాల్లోని భారీ భవనాలు, మహర్షి వాల్మీకి విమానాశ్రయం తదితర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. భద్రతా సిబ్బందిని కూడా పెంచి నిరంతరాయంగా గస్తీ కాస్తున్నారు. 2005లో రామజన్మభూమి కాంప్లెక్స్‌పై దాడి చేసి వెలుగులోకి వచ్చిన జైషే సంస్థ అయోధ్య రామమందిరంపై నిత్యం విషం కక్కుతూనే ఉంది. శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ముందు కూడా దాడులు చేస్తామంటూ హెచ్చరికలు చేసింది.

డిజిటల్ ఇండియా బిల్లు.. ఈ సమావేశాల్లోనే?

న్యూఢిల్లీ, జూన్ 15: ఆన్‌లైన్ మాధ్యమాల్లో వదంతుల ప్రచారాన్ని అడ్డుకోవడం, డీప్ ఫేక్ వీడియోల కట్టడి, కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగాన్ని నివారించేందుకు ఉద్దేశించిన డిజిటల్ ఇండియా బిల్లును కేంద్రప్రభుత్వం ఈ నెల 24 నుంచి ప్రారంభం కాబోయే పార్లమెంటు సమావేశాల్లోనే ఉభయ సభల ఆమోదం కోసం ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతకుముందు అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయం తెలుసుకోనున్నట్లు వివరించాయి. యూట్యూబ్ సహా అన్ని రకాల ఆన్‌లైన్ మాధ్యమాల్లో వదంతుల ప్రచారాన్ని అరికట్టడంతో పాటు ఏఐని ఎలా సద్వినియోగం చేసుకోవాలన్నదానిపైనా ఈ బిల్లులో నిబంధలున్నాయని పేర్కొన్నాయి. ఈ డిజిటల్ ఇండియా బిల్లును లోక్‌సభ ఎన్నికలకు ముందే రూపొందించారు. కాగా, పార్లమెంటు సమావేశాలు ఈ నెల 24తో ప్రారంభమై జూలై 3తో ముగియనున్నాయి.

₹30 లక్షలకు నీట్ పేపర్!

ఒక్కొక్క అభ్యర్థి నుంచి వసూలు చేసిన బిహార్ ముఠా.. వారందరినీ రహస్య ప్రదేశాల్లో ఉంచి జవాబుల బట్టీ

» అక్కడి నుంచి నేరుగా పరీక్షా కేంద్రాలకు

» మే 4వ తేదీనే ముఠా చేతికి ప్రశ్నపత్రం

» నిందితుల నేరాంగీకార వాంగ్మూలాల్లో సంచలన విషయాలు

పట్నా, న్యూఢిల్లీ, జూన్ 15: నీట్ ప్రశ్నపత్రాన్ని లీక్ చేసినందుకు ఒక్కో అభ్యర్థి వద్దా రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షల దాకా వసూలు చేశారు. ఆ ప్రశ్నలకు జవాబులు బట్టీపట్టించేందుకు వారిని రహస్య ప్రదేశాలకు తరలించారు. పేపర్ లీకయిన విషయం బయటపడకుండా ఉండేందుకు వారిని పరీక్ష రోజు దాకా అక్కడే ఉంచి.. అక్కణ్నుంచీ నేరుగా పరీక్షా కేంద్రాలకు తరలించారు! నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి బిహార్‌లో జరుగుతున్న ప్రాథమిక దర్యాప్తులో తాజాగా వెల్లడైన వివరాలివి. ఈ కేసులో అక్కడ అరెస్టయిన 14 మంది నిందితులు.. ఈమేరకు బిహార్ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగానికి (ఈవోయూ) వాంగ్మూలం ఇచ్చారు. వారు వెల్లడించిన వివరాల ఆధారంగా 13 మంది అభ్యర్థులను గుర్తించిన ఈవోయూ అధికారులు నలుగురిని ఇప్పటికే అరెస్టు చేశారు. శనివారం మరో 9 మంది నీట్ అభ్యర్థులకు నోటీసులు జారీ చేశారు. నీట్ పేపర్ లీక్ చేసిన సాల్వర్ గ్యాంగులతో వారికి ఉన్న సంబంధాల గురించి ప్రశ్నించేందుకు.. పట్నాలోని తమ కార్యాలయానికి సోమ, మంగళవారాల్లో రావాల్సిందిగా ఆదేశించారు. అరెస్టయిన నిందితులు ఈవోయుకు ఇచ్చిన నేరాంగీకార వాంగ్మూలాలను సంపాదించిన 'ఇండియాటుడే' వార్తాసంస్థ ఆ వివరాలను బయటపెట్టింది. వారిలో సికిందర్ కుమార్ యాదవేందు (56) అనే ప్రభుత్వ ఉద్యోగి కూడా ఉన్నారు. నితీశ్, అమిత్ ఆనంద్ అనే ఇద్దరు వ్యక్తులు ఒక ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీని నడుపుతున్నారని.. మే 5న పరీక్ష జరగ్గా, మే 4వ తేదీనే పేపర్ వారి చేతికి వచ్చిందని సికిందర్ వెల్లడించారు. వెంటనే వారు.. ఆ పేపర్ కోసం డబ్బు చెల్లించిన అభ్యర్థులను పట్నాలోని రామకృష్ణానగర్‌లో ఒక రహస్య గృహానికి రప్పించి, వారిని అక్కడే ఉంచారని వివరించారు. సికిందర్ ఇచ్చిన వాంగ్మూలాన్ని నితీశ్, అమిత్ ఇద్దరూ ధ్రువీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడంలో తమ పాత్ర ఉందని ఒప్పుకొన్నారు. ఆ ప్రశ్నపత్రాలు ఇవ్వడానికి ఒక్కో అభ్యర్థి నుంచి రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షల దాకా వసూలు చేసినట్టు చెప్పారు.



నీట్‌పై పట్నాలో నిరసన తెలుపుతున్న విద్యార్థిని చెదరగొడుతున్న పోలీసు

ఏమిటీ సాల్వర్ గ్యాంగులు?

యూపీ, బిహార్, ఝార్ఖండ్ సహా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పోటీ పరీక్షల్లో విదార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ఈ సాల్వర్ గ్యాంగ్‌లు పనిచేస్తుంటాయి. వీరికి విస్తృతమైన నెట్‌వర్క్ ఉంటుంది. నీట్ పరీక్షనే ఉదాహరణగా తీసుకుంటే.. వీరు నీట్ పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లకు భారీగా డబ్బు ఆశచూపి వలలో వేసుకుంటారు. ఆయా సూపరింటెండెంట్లు.. ప్రశ్నపత్రాలు తమవద్దకు రాగానే వాటిని సాల్వర్ గ్యాంగ్‌లకు చేరవేస్తారు. ఆ గ్యాంగుల్లోని సబ్జెక్టు నిపుణులైన సభ్యులు వాటిని 15-20 నిమిషాల్లో పరిష్కరించి.. ఆ సమాధానాలను అభ్యర్థులతో బట్టీ కొట్టిస్తారు. తర్వాత వారు నేరుగా పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి పరీక్ష రాస్తారు. ఇంకొన్ని పరీక్షలకైతే.. సాల్వర్ గ్యాంగ్ సభ్యులే పరీక్ష రాసి ర్యాంకు వచ్చేలా చేస్తారు. 'బిహార్ టీచర్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్'లో ఇలాగే మోసం చేస్తూ దొరికిపోయిన నితీశ్‌కుమార్ అనే వ్యక్తిని పట్టుకుని పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నిస్తే.. నీట్ గుట్టు బయటపడడం గమనార్హం.


రద్దు చేయండి..

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ కొత్తగా పరీక్ష నిర్వహించాలంటూ ఎన్‌టీఏకి ఆదేశాలు ఇవ్వాలని, ఈ అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ 20 మంది విద్యార్థులు సుప్రీంకోర్టునే ఆశ్రయించారు. అంతేకాదు.. ఈ పరీక్షల్లో 620కి మించి స్కోరు సాధించిన వారి విద్యా నేపథ్యాన్ని పరిశీలించేందుకు కోర్టు అప్పాయింటెడ్ కమిటీ లేదా స్వతంత్ర సంస్థతో 'పోస్ట్ ఎగ్జామ్ ఎనాలిసిస్' జరిపించాలని వారు అందులో విజ్ఞప్తి చేశారు. కాగా.. నీట్ అక్రమాలకు నిరసనగా జూన్ 19, 20 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) పిలుపునిచ్చింది. నీట్ పరీక్షను రద్దు చేయాలని, రాష్ట్రాలు తమ తమ సొంత ప్రవేశపరీక్షలను నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ డిమాండ్ చేశారు.

మోదీ సర్కార్ ఏ క్షణమైనా కూలొచ్చు!

» ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు

» మీరు మూర్ఖుల స్వర్గంలో ఉన్నారు: బీజేపీ



న్యూఢిల్లీ, జూన్ 15: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీ నేతృత్వంలోని సంకీర్ణ సర్కారు ఏక్షణంలో అయినా కూలిపోవచ్చనని అన్నారు. కూటమి ప్రభుత్వం పొరపాటున ఏర్పడిందని, ప్రజలు బీజేపీకి పూర్తిమెజారిటీ కట్టబెట్టలేదని వ్యాఖ్యానించారు. "ఎన్డీయే ప్రభుత్వం పొరపాటున ఏర్పడింది. మోదీకి సొంత బలం లేదు. ఇది మైనారిటీ ప్రభుత్వం. ఇది ఏ క్షణంలో అయినా కూలిపోవచ్చు" అని ఖర్గే అన్నారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అయితే, ఎన్డీయే సర్కారు కూలిపోవాలని తాము కోరుకోవడం లేదని, దేశానికి మంచి చేయాలనే కోరుకుంటున్నామని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం కోసం తాము కూడా కలిసి పనిచేస్తామని చెప్పారు. కానీ, ప్రధాని మోదీకి మంచిని కొనసాగించే అలవాటు లేదని విమర్శించారు. అయితే.. తాము మాత్రం దేశాన్ని దృష్టిలో పెట్టుకుని సహకరిస్తామని చెప్పారు. కాగా, ఖర్గే వ్యాఖ్యలను ఇండియా కూటమి పార్టీ ఆర్జేడీ అధికార ప్రతినిధి ఇజాజ్ అహ్మద్ సమర్థించారు. "ఖర్గే చెప్పింది నిజమే. ప్రజా తీర్పు మోదీకి వ్యతిరేకంగా ఉంది. ప్రధానిగా మోదీని ఓటర్లు అంగీకరించలేదు. అందుకే బీజేపీ 240 సీట్లకే పరిమితం అయింది. అయినా కూడా మోదీ ప్రధాని పదవి చేపట్టారు" అని అహ్మద్ అన్నారు.

గతాన్ని మరిచారా?: ఎన్డీయే

ఖర్గే వ్యాఖ్యలపై ఎన్డీయే పక్షాల నేతలు నిప్పులు చెరిగారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కూడా సంకీర్ణ సర్కారునే నడిపిందని జేడీయూ నేత నీరజ్ కుమార్ వ్యాఖ్యానించారు. 1991లో కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు వచ్చాయో.. ఏ పరిస్థితిని ఎదుర్కొందో గుర్తు చేసుకోవాలన్నారు. అప్పట్లో పీవీ నరసింహారావు మైనారిటీ ప్రభుత్వాన్ని నడిపించలేదా? చిన్న పార్టీలలో చీలిక తెచ్చి.. తమకు అనుకూలంగా మార్చుకోలేదా? అని ప్రశ్నించారు. "ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లింది. దీనిని చూసిన తర్వాత కూడా ఎన్డీయే సర్కారు కూలిపోతుందని వ్యాఖ్యానించారంటే ఖర్గే మూర్ఖుల స్వర్గంలో జీవిస్తున్నారనే భావిస్తున్నా" అని తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై వ్యాఖ్యానించారు.

లోకం తీరు



14 ఏళ్ల తర్వాత కేసు పెట్టడమా?

» అరుంధతి రాయ్‌పై 'ఉపా'.. అణచివేతే

» ఫాసిస్టు ధోరణికి నిదర్శనం: విపక్షాలు

న్యూఢిల్లీ, జూన్ 15: ప్రఖ్యాత రచయిత్రి అరుంధతీ రాయ్‌పై కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద విచారణ జరిపేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇవ్వడాన్ని సీపీఎం ఖండించింది. "ఫాసిస్టు చర్య తప్పించి దీంట్లో ఎలాంటి హేతుబద్ధత లేదు. కోర్టులు, న్యాయవాదులు సెలవులో ఉన్నప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడం అనుమానాస్పదంగా ఉంది. సిగ్గుచేటు" అంటూ ట్వీట్ చేసింది. కాంగ్రెస్ నాయకుడు హరిప్రసాద్ బికె. ట్వీట్ చేస్తూ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీ ప్రతి రోజూ ఇలాంటి వివాదాలను సృష్టిస్తోందని విమర్శించారు. ఇలాంటి ఫాసిజం ఉండకూడదనే బీజేపీ వ్యతిరేకంగా దేశ ప్రజలు ఓటు వేశారని, కానీ వారు మళ్లీ అదే పనిచేస్తున్నారని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా విమర్శించారు. జమ్మూ-కశ్మీర్‌కు చెందిన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), పీడీపీ కూడా లెఫ్టినెంట్ గవర్నర్ చర్యను నిరసించాయి. భిన్న స్వరాలను తొక్కివేసి, భావ ప్రకటన స్వేచ్ఛను క్రిమినల్ నేరంగా పరిగణించేందుకే 'ఉపా' చట్టాన్ని ప్రయోగించారని ఎన్‌సీ విమర్శించింది. "ప్రసంగించిన 14 ఏళ్ల తరువాత ఉపా కింద కేసు పెట్టారు. ఆ ఉపన్యాసాన్ని అందరూ మరిచిపోయారు. ఎన్నికల్లో ఎదురు దెబ్బలుతిన్నప్పటికీ తమ కరుడుగట్టిన వైఖరి మారలేదని చెప్పుకోవడానికే బీజేపీ ఈ కేసు పెట్టింది" అని వ్యాఖ్యానించింది. కాగా, అరుంధతీ రాయ్‌తో పాటు కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ న్యాయ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌ను కూడా ఇదే చట్టం కింద విచారించేందుకు కూడా లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇచ్చారు.

లద్దాక్‌లో చైనా మోహరింపులు

న్యూఢిల్లీ, జూన్ 15: లద్దాక్‌లోని చైనా ఆక్రమిత జోన్‌లో మిలటరీ మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్టు ఇంటెలిజెన్స్ నివేదికలు వెల్లడించాయి. 2020 మేలో ఇరుదేశాల మధ్య ప్రతిష్టంభన ఏర్పడినప్పటి నుంచి భారత సైన్యం కూడా లద్దాక్‌లోని పర్వతప్రాంతంలో సైనిక పోస్టులు పెంచిందని, భారీగా సైన్యాన్ని మోహరించిందని అధికారవర్గాలు తెలిపాయి. తూర్పు లద్దాక్‌లోని డెప్సంగ్ మైదాన ప్రాంతంలో అనేక సమస్యాత్మక పాయింట్ల వద్ద చైనా సైనిక మోహరింపులను పెంచిందని కేంద్ర హోంశాఖలోని ఓ భద్రతాధికారి శుక్రవారం ఓ ఆంగ్ల దినపత్రికకు తెలిపారు. అది తమ భూభాగమని భారత్ వాదిస్తున్న ప్రదేశాల్లోనూ చైనా సైన్యం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మిస్తోందని, ఇతర వివాదాస్పద ప్రాంతాల్లోనూ సైనిక మోహరింపులను పెంచిందని ఇటీవలి నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. డెప్సంగ్‌లోని మైదాన ప్రాంతాల్లో అదనపు హైవేలు, రోడ్లను చైనా సైన్యం నిర్మిస్తోందని, పాంగాంగ్ సరస్సు ఉత్తర, దక్షిణ దిక్కుల్లో మిలటరీ మౌలిక సదుపాయాల నిర్మాణాలను వేగవంతం చేసిందన్నారు. గల్వాన్ లోయ, పాంగాంగ్ సరస్సు, హాట్ స్ప్రింగ్స్, గోగ్రా ప్రాంతాల్లో ఆక్రమిత ప్రాంతాల నుంచి పాక్షికంగా వైదొలిగేందుకు చైనా అంగీకరించినా డెప్సంగ్‌లోని ఆక్రమిత ప్రాంతం నుంచి వైదొలిగేందుకు నిరాకరిస్తూనే ఉంది. బఫర్‌జోన్ సృష్టి ద్వారా ఇరుసైన్యాలు వెనక్కి జరగాలని ఒప్పందం చేసుకున్నా చైనా సైన్యం భారత భూభాగంలోనే తిష్టవేసిందని, భారత సైన్యం వెనక్కి జరగడంతో మరింత భూభాగాన్ని చైనాకు అప్పగించినట్లైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టెంపో

అలకనంద నదిలోకి దూసుకెళ్లిన టెంపో

» 14 మంది యాత్రికుల మృతి

రుద్రప్రయాగ్, జూన్ 15: ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రిషికేశ్-బద్రీనాథ్ జాతీయ రహదారిపై యాత్రికులతో వెళ్తున్న టెంపో శనివారం ఉదయం అదుపుతప్పి దాదాపు 250 మీటర్ల లోతులో అలకనంద నదిలో పడింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మరణించగా, 12 మంది గాయపడ్డారు. టెంపోలో మొత్తం 26 మంది ఉన్నారని, వారిలో అత్యధికులు ఢిల్లీకి చెందిన వారేనని, పర్యాటక ప్రాంతమైన చోప్తాకు వెళ్తుండగా రైటోలి వద్ద ప్రమాదం జరిగిందని రుద్రప్రయాగ్ ఎస్పీ అశోక్ భదానే తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఏడుగురిని సీఎం పుష్కర్‌సింగ్ ధామి ఆదేశాలతో హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

చైనా.. తీరు మార్చుకో

» ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు సాయం తగదు


» తక్షణమే ఆపకుంటే.. మరిన్ని ఆంక్షలు తప్పవు

» ఉమ్మడి ప్రకటనలో జి-7 కూటమి హెచ్చరిక

బారి(ఇటలీ), జూన్ 15: ఇప్పటివరకు రష్యాను ఉమ్మడి సంప్రదాయ శత్రువుగా పరిగణిస్తూ వస్తున్న జి-7 కూటమి.. తాజాగా చైనాను కూడా దాని సరసన చేర్చింది. ఆయుధాలు, మందుగుండు సామగ్రి సరఫరా ద్వారా ఉక్రెయిన్‌పై మాస్కో సాగిస్తున్న యుద్ధాన్ని డ్రాగన్ ఎగదోస్తోందని, భద్రతాపరంగా అనేక సమస్యలకు కారణమవుతోందని మండిపడింది. దీనిని తక్షణమే ఆపకుంటే మరిన్ని ఆంక్షలను విధిస్తామని హెచ్చరించింది. ఇటలీలోని అపూలియాలో జరిగిన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, జపాన్, కెనడాలతో కూడిన జి-7 దేశాల శిఖరాగ్ర సమావేశం ముగింపు సందర్భంగా ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేసింది. కూటమి భేటీలోనూ బీజింగ్ విషయమై వాడివేడిగా చర్చ జరిగింది. రష్యా యుద్ధోన్మాదానికి సామగ్రి అందజేస్తున్న దేశంగా చైనాను జి-7 ప్రకటన పేర్కొంది. బీజింగ్‌తో పాటు ఇలాంటి సాయం అందిస్తున్న దేశాలు, సంస్థలపై చర్యలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలు నుంచి రష్యాకు చైనా క్షిపణు విడి భాగాలు, సెమీ కండక్టర్లు, మందుగుండు తయారీ ముడిపదార్థాలను సరఫరా చేస్తోంది. ఆంక్షల కారణంగా ఇతర ప్రాంతాల నుంచి రవాణా పడిపోవడంతో డ్రాగన్ తయారీ వినియోగ వస్తువులకు రష్యా కేంద్రంగానూ మారింది. ప్రతిగా చైనా తక్కువ ధరకు మాస్కో నుంచి ఇంధనాన్ని పొందుతోంది. ఈ నేపథ్యంలోనే బీజింగ్‌ను తీవ్రంగా తప్పుబడుతూ జి-7 కూటమి ప్రకటన వెలువరించింది. టిబెట్, జిన్జియాంగ్, హాంకాంగ్‌లో చైనా ప్రమేయం మితిమీరుతోందని ఆరోపించింది. గత ఏడాది వరకు పశ్చిమ దేశాలు.. ఉక్రెయిన్ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఒప్పించగల, నచ్చజెప్పగల శక్తిగా జిన్‌పింగ్‌ను చూశాయి. ఇప్పుడు వాటి ధోరణి పూర్తిగా మారిపోయి, ఏకంగా యుద్ధాన్ని ఎగదోస్తున్నట్లు చూస్తున్నాయి.

ఉత్పత్తి పెంచుదాం..

వస్తువుల విక్రయంలో చైనా అనుసరిస్తున్న విధానాలను నీతిమాలినవి అంటూ జి-7 నేతలు అభివర్ణించారు. విద్యుత్తు వాహనాలు, సౌర ఫలకాల వంటి పునరుత్పాదక ఉత్పత్తులను చౌకగా తయారు చేసి తమ మార్కెట్‌లోకి కుమ్మరిస్తోందని ధ్వజమెత్తారు. ఇది తమ దేశ సంస్థలు, ఉద్యోగాలను ప్రమాదంలోకి నెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రాగన్‌కు చెక్ పెట్టేలా దేశీయంగా వస్తు ఉత్పత్తిని పెంచుదామని, చైనా అనైతిక విధానాలను డబ్ల్యూటీవోలో ఉమ్మడిగా సవాల్ చేయాలని జి-7 కూటమి నేతలు నిర్ణయించారు.



మెలోడీ

"నమస్తే" అంటూ భారత ప్రధాని మోదీని జి-7 సదస్సుకు ఆహ్వానించిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ.. ఆయనతో సెల్ఫీ దిగారు. దీనిని "హాయ్ ఫ్రెండ్స్. ఫ్రమ్ మెలోడీ(మెలోనీ+మోడీ) శీర్షికతో ట్వీట్ చేశారు. ఇదిప్పుడు వైరల్‌గా మారింది. డిసెంబరులో యూఏఈలో జరిగిన 'కాప్28' సదస్సు సందర్భంగా మోదీతో దిగిన సెల్ఫీకి హ్యాష్‌ట్యాగ్‌ను జతచేసి మెలోడీ అంటూ మెలోనీ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. భారత్, ఇటలీ ప్రధానులు శుక్రవారం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతిపై సమీక్షించారు. కాగా, దౌత్యపరంగా విభేదాలు తలెత్తిన కెనడా ప్రధాని ట్రూడోతో మోదీ కొద్దిసేపు సంభాషించారు. బైడెన్‌తోనూ మోదీ సమావేశం అయ్యారు. కాగా, ఇటలీ నుంచి మోదీ శుక్రవారం భారత్‌కు తిరిగి చేరుకున్నారు.

అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్

» 8 మంది నక్సల్స్, ఒక జవాన్ మృతి

» ములుగులో మావోయిస్టుల కుట్ర భగ్నం

చర్ల, జూన్ 15: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్‌లో శనివారం భద్రత బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో 8 మంది నక్సలైట్లు, ఓ జవాన్ మృతిచెందారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ కథనం ప్రకారం నారాయణపూర్ జిల్లా కుతుల్, ఫర్సాబేడ, కోటమెడ గ్రామాల పరిధిలోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు ఉప్పందింది. దాంతో నారాయణపూర్, కొండేగావ్, కాంకేర్, దంతేవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్‌కు చెందిన సుమారు 1,200 మంది పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. అబూజ్‌మడ్ అడవుల వైపు వస్తున్న బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులకు దిగారు. కడపటి వార్తలందేసరికి ఇరువైపులా కాల్పులు కొనసాగుతున్నాయి. ప్రాథమిక సమాచారంమేరకు పోలీసులు 8మంది నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. నక్సల్స్‌కు చెందిన ఇన్సాస్ రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, మందుపాతరలు, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా కాంకేర్, బీజాపూర్, నారాయణపూర్, సుకుమా జిల్లాల్లో గత ఆర్నెల్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో 125మంది మావోయిస్టులు మృతి చెందారు. కాగా బీజాపూర్ జిల్లా గడమలి, కడేరు రోడ్‌పై భద్రత బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు మందుపాతరలు అమర్చారు. శనివారం రూట్‌వాచ్‌లో ఉన్న బాంబ్/డాగ్ స్క్వాడ్‌లు 10కిలోల మందుపాతరను గుర్తించి నిర్వీర్యం చేశాయి.


ములుగులో ఆరుగురి అరెస్టు

ములుగు, జూన్ 15: మావోయిస్టుల భారీ కుట్రను ములుగు జిల్లా పోలీసులు భగ్నం చేశారు. వెంకటాపురం(నూగూరు) మండలం తడపల గ్రామ సమీపంలో మందుపాతరలను అమరుస్తున్న ఆరుగురిని గురువారం అరెస్టు చేశారు. శనివారం ములుగు ఎస్పీ శబరీశ్ వివరాలు వెల్లడించారు. కర్రెగుట్టలపై మావోయిస్టులు గెరిల్లా బేస్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. అడవుల్లో ఆ సమయంలో ఆరుగురు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిలో వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ మావోయిస్టు డిప్యూటీ దళకమాండర్ కారం బుద్రి అలియాస్ రీతా, పామేడు ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి అలియాస్ మోతె, ఒకటో బెటాలియన్ సభ్యుడు సోడి విజయ్, ముగ్గురు మిలీషియా సభ్యులున్నారు.

ప్లేటు భోజనం రూ.19 వేలు!

ఈ-రిక్షాలు, పెట్రోల్ కార్లకూ డీజిల్ బిల్లులు

రాంచీ హాకీ టోర్నమెంట్‌లో భారీ కుంభకోణం?



రాంచీ, జూన్ 15: 'ప్లేటు భోజనానికి రూ.19 వేలు చొప్పున చెల్లించారు. బ్యాటరీతో నడిచే ఈ-రిక్షాకు, పెట్రోలు కార్లకు డీజిల్ కొట్టించినట్లుగా బిల్లులు ఇచ్చేశారు..'అంటూ ఝార్ఖండ్ క్రీడా శాఖపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతేడాది అక్టోబరు, నవంబరు మధ్య రాంచీలో నిర్వహించిన మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ- 2023 కి సంబంధించి పలు బిల్లుల చెల్లింపులు అనుమానాస్పదంగా ఉన్నాయంటూ స్థానిక వార్తా పత్రిక ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపింది. 'ఈ-రిక్షాలు, పెట్రోలు కార్లలో డీజిల్ నింపినట్లుగా పెట్టిన బిల్లులకు స్పోర్ట్స్ డైరెక్టరేట్ డబ్బులు చెల్లించింది. టోర్నమెంట్ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టేట్ డిన్నర్‌లో ప్లేటుకు రూ.19వేల చొప్పున భారీమొత్తం చెల్లించారు' అని పేర్కొంటున్న ఓ నివేదిక ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆసియా మహిళల హాకీ చాంపియన్‌షిప్ నిర్వహణలో జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడిందని బీజేపీ ఆరోపించింది. దీనిపై సీఎం చంపయిసోరెన్ వెంటనే సీబీఐ, ఈడీ విచారణకు సిఫారసు చేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను స్పోర్ట్స్ డైరెక్టరేట్ ఖండించింది.

ఆడుదాం ఆంధ్రా స్కాం రూ.100 కోట్లు

- ఐదేళ్లలో క్రీడాశాఖను నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం
- జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడు, ఆటియా-బాటియా రాష్ట్ర సీఈఓ ప్రసాద్
- సీఐడీ విచారణ జరిపి, బాధ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్


ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 15: ఉపయోగంలేని సర్టిఫికెట్లు, నాసిరకం కిట్లు, డ్రెస్సులతో ఎన్నికల స్టంట్‌గా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో రూ.100 కోట్ల స్కాం జరిగిందని జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడు, ఆటియా-బాటియా అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ రంబా ప్రసాద్ ఆరోపించారు. అనంతపురం జిల్లాకు శనివారం వచ్చిన ఆయన.. 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. క్రీడా శాఖను సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం.. సీఎం కప్, ఆడుదాం ఆంధ్రా అంటూ నిధులు స్వాహా చేసిందని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా మొత్తం ఒక డ్రామా అని, నిధులను కాజేసేందుకే నిర్వహించారని అన్నారు. తక్కువ ఖర్చు అయ్యే క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాంశాలను ఎంచుకున్నారని.. కనీసం మంచినీరు, నీడ వంటి వసతులు కల్పించలేదని అన్నారు. నాసిరకం క్రీడా కిట్లు, డ్రెస్సులను ఇచ్చారని, అవీ అరకొరగానే ఇచ్చి క్రీడాకారులను మోసం చేశారని అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు రూ.10 కోట్లు ఖర్చు అవుతుందని, కానీ రూ.100 కోట్లు ఖర్చు చేసినట్లు చూపించారని.. ఆ నిధులను స్వాహా చేసిన క్రీడాశాఖ మాజీ మంత్రి రోజా, శాప్ మాజీ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై ఆధారాలతో సీఐడీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. క్రీడా శాఖను నిర్వీర్యం చేయడంతో పాటు క్రీడాకారులను గత ఐదేళ్లు కించపరిచారని మండిపడ్డారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో అప్పటి మంత్రి, శాప్ ఛైర్మన్ అవినీతి, అక్రమాలలో డీఎస్‌డీఓల భాగస్వామ్యం ఉందని అన్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క స్టేడియం నిర్మించని వైసీపీ ప్రభుత్వం, టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన స్టేడియాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్టేడియాలు శిథిలావస్థకు చేరినా ఒక్క పైసా నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ను తన సామాజిక వర్గానికి చెందిన క్రీడారంగంలో అనుభవం లేని వ్యక్తులతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నింపారని విమర్శించారు. క్రీడాశాఖను బతికించేందుకు, ఆడుదాం ఆంధ్రా రూ.100 కోట్ల స్కాంను వెలికితీసేందుకు సీఐడీ వెంటనే విచారణ జరిపాలని, బాధ్యులను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. సీఐడీకి ఫిర్యాదు చేసిన తనకు వైసీపీ నుంచి తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపులు వస్తున్నాయని, కానీ తాను భయపడనని, రాజీపడే ప్రసక్తే లేదని తెలిపారు.

'విష' రాజకీయం!

- తాగునీటి ప్లాంట్‌లో పురుగులమందు
- వాసన పసిగట్టి అప్రమత్తమైన ప్రజలు
- ఓట్లు వేయలేదనే కోపంతో వైసీపీ నేత చేయించారని గ్రామస్థుల ఆరోపణ
- అనంతపురం జిల్లాలో ఘోరం
- స్థానికుల ఫిర్యాదుతో పోలీసుల విచారణ


తుంబిగనూరులో గ్రామస్థులను విచారిస్తున్న పోలీసులు

కణేకల్లు, జూన్ 15: అధికారంలోకి రావడానికి వైసీపీ నాయకులు ఎన్నో అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. అయినా చిత్తుచిత్తుగా ఓడిపోవడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. నాలుగు గ్రామాలకు చెందిన దాదాపు నాలుగువేల మంది ప్రజలు తాగునీరు వాడే ఫిల్టర్ వాటర్ కేంద్రంలో కొందరు విషం కలిపారు. వాసన పసిగట్టి జనం అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. వైసీపీకి ఓట్లు వేయలేదనే కోపంతో ఆ పార్టీ నాయకుడు ఒకరు ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అనంతపురం జిల్లా కణేకల్లు (రాయదుర్గం నియోజకవర్గం) మండలం తుంబిగనూరు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని ఫిల్టర్ వాటర్ కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పురుగుల మందు కలిపారు. వాచ్‌మన్ తిప్పయ్య గమనించి కేకలు వేయడంతో దుండగులు వెళ్లిపోయారని చెబుతున్నారు. శనివారం ఉదయం ప్రజలు నీటి కోసం వచ్చినపుడు మంచినీటిలో వాసన రావడంతో అప్రమత్తమయ్యారు. రాత్రి జరిగిన సంఘటన గురించి వాచ్‌మన్ ప్రజలకు చెప్పాడు. విషప్రయోగం జరిగినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తుంబిగనూరు గ్రామంలో టీడీపీకి 18 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీన్ని జీర్ణించుకోలేక స్థానిక వైసీపీ నాయకుడే విష ప్రయోగం చేసి ఉంటారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ సంఘటనపై కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సంఘటన హేయమని, బాధ్యులైన వారిని ఎట్టి పరిస్థితులలోనూ వదలబోమని డీఎస్పీ అన్నారు.

వైసీపీ నేత ఆధ్వర్యంలో ప్లాంట్

2019లో సుజలాన్ గాలిమరల కంపెనీ వారు స్వచ్ఛందంగా వాటర్ ప్లాంట్‌ను తుంబిగనూరులో ఏర్పాటుచేసి గ్రామస్థులకు అప్పగించారు. ప్రారంభంలో టీడీపీ ఎంపీటీసీ వన్నూరుస్వామి ఆధీనంలో వాటర్ ప్లాంట్ నిర్వహణ జరిగేది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకుడు ఫణీంద్ర వాటర్ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు వాటర్ ప్లాంట్‌ను ఆధీనంలోకి తీసుకుని నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో వాటర్ ప్లాంట్‌ను తమకు అప్పగించాలని ఆ పార్టీ నాయకులు... వైసీపీ నాయకుడు, సర్పంచ్ ఫణీంద్రను కోరారు. కానీ ఆయన అంగీకరించలేదు. దీంతో టీడీపీ నాయకులు ఎంపీడీఓకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ వివాదం నేపథ్యంలో మంచినీటిలో విషం కలిపారు.

విశాఖలో ఈదురుగాలుల బీభత్సం

విశాఖపట్నం/అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో శనివారం సాయంత్రం సుమారు గంటపాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గంటకు 55 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఒక్కసారిగా పెనుగాలులు వీయడంతో ఆరుబయట ఉన్న వారంతా సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఈదురుగాలులతో వర్షం కూడా కురిసింది. సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు విశాఖ పరిసరాల్లో రెండు వేలకుపైగా మెరుపులు సంభవించినట్లు భారత భూవిజ్ఞాన మంత్రిత్వశాఖకు చెందిన 'దామిని' యాప్‌లో నమోదైంది. ఉత్తరకోస్తాలో అనేకచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురిశాయి.

ముగిసిన ఎల్‌నినో

గత ఏడాది నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రచండమైన వేడి వాతావరణం, వడగాడ్పులకు కారణమైన ఎల్‌నినో కథ ముగిసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికంలో లానినా ఏర్పడనున్నది. పసిఫిక్ మహాసముద్రంలో మరికొన్ని రోజులు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని ఆస్ట్రేలియా వాతావరణ విభాగం ప్రకటించింది. గత ఏడాది ఏర్పడిన ఎల్‌నినో తీవ్రతకు మునుపెన్నడూ లేనంతగా ప్రతినెలా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేక దేశాల్లో తీవ్ర దుర్భిక్షం నెలకొనడంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూపర్ ఎల్‌నినోగా మారడంతో అత్యంత దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే మార్చి నెల తరువాత ఎల్‌నినో అనూహ్యంగా బలహీనపడడం ప్రారంభమైంది. మే నాటికి పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడేందుకు అనుకూలమైన వాతావరణం నెలకొంది. జూన్ నెల రెండో వారం వచ్చే సరికి ఎల్‌నినో ముగిసింది. ఈ ఏడాది వేసవిలో సాధారణం కంటే ఎక్కువగా వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ ముందుగానే వెల్లడించింది. అంచనా వేసినట్టుగానే మార్చి ఒకటో తేదీ నుంచి జూన్ తొమ్మిదో తేదీ వరకు దేశంలో రికార్డు స్థాయిలో వడగాడ్పులు వీచాయని వాతావరణ శాఖ తెలిపింది. గతంలో ఎన్నడూ లేనంతగా వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు కొనసాగడంతో దేశంలో చాలా ప్రాంతాల్లో ప్రజలు అల్లాడిపోయారు. ఒడిసాలో అత్యధికంగా 27 రోజులు, పశ్చిమ రాజస్థాన్‌లో 23 రోజులు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీచాయి. దేశంలో 36 వాతావరణ సబ్ డివిజన్లలో 14 సబ్ డివిజన్‌లలో 15 రోజులు, అంతకంటే ఎక్కువగా వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీయడం ఇదే తొలిసారని నిపుణులు వెల్లడించారు. వేసవి విడిది కేంద్రాలైన హిమాచల్‌ప్రదేశ్‌లో 12, జమ్మూకశ్మీర్‌లో 6 రోజుల పాటు వడగాడ్పులు వీచాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ లలో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాజస్థాన్, ఢిల్లీల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎల్‌నినో ముగిసినా, దాని ప్రభావంతో దేశంలో మరికొన్ని రోజులు వేడి వాతావరణం కొనసాగుతుందని వివరించారు.

రానున్న ఐదు రోజులు వర్షాలు

ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న ఐదు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అక్కడక్కడా పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం అల్లూరి, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. శనివారం ఉదయం నుంచి కోస్తాలో తీవ్రమైన ఎండ, ఉక్కపోత కొనసాగాయి. బాపట్ల, తునిలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణంగా జూన్ నెలలో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదుకావడం అరుదుగా జరుగుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

విద్యుత్‌శాఖకు మాజీ ఎంపీ నందిగం సురేష్ రూ.2.80 లక్షల బకాయిలు

- మొన్నటి వరకు అధికారం అండతో అధికారులకు బెదిరింపులు
- నోటీసులిచ్చినా స్పందన శూన్యం
- ప్రభుత్వం మారటంతో గడువు కోరిన వైనం

గుంటూరు, జూన్ 15: అధికారం అండతో అడ్డగోలుగా వ్యవహరించిన వైసీపీ నేతల బండారం ఒక్కొక్కటిగా బయటపడుతోంది. మాజీ ఎంపీ నందిగం సురేష్ తన ఇంటికి వినియోగించిన విద్యుత్ బకాయిలను నాలుగేళ్లుగా ఎగవేస్తూ అధికారులను సైతం తన అధికారంతో భయపెట్టారు. ఫలితంగా నాలుగేళ్లుగా విద్యుత్ బకాయిలు ఏకంగా రూ.2.80 లక్షలకు చేరింది. రాజధాని అమరావతి ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెం నందిగం సురేష్ స్వగ్రామం. వాస్తవానికి వారి ఇంటికి తన తండ్రి పేరుతో సర్వీసు ఉంది. విద్యుత్ మీటర్‌కు నందిగం సురేష్ ఆధార్ కార్డులు లింక్ చేశారు. వారి ఇంటికి నెలవారీగా వెయ్యి యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం జరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. విద్యుత్‌శాఖ సీఆర్‌డీఏ సర్కిల్ మందడం సెక్షన్ పరిధిలోనున్న సురేష్ ఇంటికి బకాయిలకు సంబంధించి పలుమార్లు అధికారులు నోటీసులు అందించినా స్పందన శూన్యం. సీఎం జగన్ రెడ్డి వెంటే నిత్యం సురేష్ ఉండటంతో పాటు అధికారం అండదండలు కూడా పుష్కలంగా ఉండటంతో విద్యుత్‌శాఖ అధికారులు కూడా మిన్నకుండిపోయారు. నాలుగేళ్లుగా ఎటువంటి చెల్లింపులు లేకపోవటంతో బకాయిలు ఏకంగా రూ.2.80 లక్షలకు చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం మారటంతో మరోసారి అధికారులు బకాయిలకు సంబంధించి మాజీ ఎంపీ ఇంటికి వెళ్లినట్టు తెలిసింది. దీనిపై సీఆర్‌డీఏలోని అధికార వర్గాలను వివరణ కోరగా బకాయిల చెల్లింపులకు సంబంధించి మాజీ ఎంపీ కొన్ని రోజులు గడువు కోరినట్టు తెలిపాయి. కాగా.. అనేక మంది వైసీపీ నేతలు అధికారం అండదండలతో విద్యుత్‌శాఖకు పెద్దఎత్తున బకాయిలు పెట్టినట్టు సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీఆర్‌డీఏ, గుంటూరు సర్కిల్ పరిధిలోని కొందరు వైసీపీ నేతలు ఇంటికి, కార్యాలయాలకు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లోర్ ఫ్లోర్‌కు వేర్వేరుగా విద్యుత్ సర్వీసులు తీసుకొన్నట్టు సమాచారం. తద్వారా విద్యుత్‌శాఖకు పెద్దఎత్తున నష్టం వాటిల్లుతోందని ఆ శాఖ సిబ్బందే వాపోతున్నారు. ఈ తతంగమంతా కొందరు అధికారులకు తెలిసినప్పటికీ వారు మిన్నకుండిపోవటం గమనార్హం.

జూలై 1, 2, 3 తేదీల్లో విశాఖలో సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర సమితి, కార్యవర్గ సమావేశాలను జూలై 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు కార్యవర్గ సమావేశం ప్రారంభమవుతుందని, 2, 3 తేదీల్లో రాష్ట్ర సమితి సమావేశాలు కొనసాగుతాయని వివరించారు. తమ పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

▪ ఆర్కే



కొత్తపలుకు

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

గతం మరిచి గగ్గోలు...

ఆంధ్రప్రదేశ్‌లో దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయి. ప్రజాస్వామ్యం, హక్కులు, విలువలు, విశ్వసనీయత వంటి పదాలు వల్లె వేస్తున్నాయి. 'దేవుడా ఇదెక్కడి ప్రజాస్వామ్యం' అని సదరు గొంతులు వాపోతున్నాయి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని, వైసీపీ కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆ పార్టీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వాళ్లు ఏకంగా రాష్ట్రపతికి ఫిర్యాదు చేసే ప్రయత్నం చేయగా, పార్టీ అధినేత జగన్‌రెడ్డి మరో అడుగు ముందుకెళ్లి... చంద్రబాబు పాలనలో ఈ ఐదేళ్లు కష్టాలకు ఓర్చుకుంటే మళ్లీ మనదే అధికారం అని చెప్పుకొంటున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి పది రోజులే అయింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగు రోజులు మాత్రమే అయింది. ఇంతలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలిపోయినట్టుగా శోకాలు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. కొత్త ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు అధికారంలో ఉన్న ఐదేళ్లలో తామేం చేశామో మరచిపోయారు. ఐదేళ్లపాటు కక్షపూరితంగా పాలన సాగించిన జగన్మోహన్‌రెడ్డి... ఇప్పుడు తనను ఇబ్బందులపాలు చేయబోతున్నారని చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుంది. అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ ప్రత్యర్థులను ఎలా వేధించిందీ మరచిపోతే ఎలా? ప్రశ్నించిన వారిని, విమర్శించిన వారిని కేసులలో ఇరికించడం గుర్తులేదా? రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా చెలరేగిపోయిన వాళ్లు ఇప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కడ అంటూ రోదించడం రోతగా ఉంది.

> జగన్ పాలనలో కొంత మంది అధికారులు పూర్తిగా చెడిపోయారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు అటువంటి వారి పట్ల తన సహజ ధోరణికి భిన్నంగా వ్యవహరించారు. ఐఏఎస్, ఐపీఎస్ సర్వీసులకు కళంకంగా వ్యవహరించిన శ్రీలక్ష్మి, పీఎస్సార్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్ వంటి అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించారు. శ్రీలక్ష్మి పుష్పగుచ్ఛం ఇచ్చే ప్రయత్నం చేయగా దాన్ని తీసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. చంద్రబాబు గత ప్రవర్తనకు ఇది పూర్తి భిన్నం. ఆర్థిక నేరాలలో నిందితుడుగా ఉన్న జగన్ వంటి వ్యక్తికి దాసోహం అవాల్సిన అవసరం ఏమిటో ఆయా అధికారులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. రూల్ ఆఫ్ లా అమలు చేయాల్సిన అధికారులు ఆటవిక పాలనకు తమవంతు సహకారం అందించడమే కాకుండా, అందులో భాగస్వాములయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని సంస్కరించడానికి చంద్రబాబు సహజంగానే ప్రయత్నిస్తారు.

వెంటాడి వేధించలేదా...

జగన్‌రెడ్డి పాలనలో కక్ష సాధింపు ఏ విధంగా ఉండిందో ఒక్కసారి గుర్తు చేసుకుందాం. 2014 నుంచి 2019 వరకు శాసనసభ స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకోవడానికి జగన్ ప్రభుత్వ వేధింపులు కారణం కాదా? కోడెలతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కేసుల మీద కేసులు పెట్టి వేధించడం నిజం కాదా? పల్నాడు పులి అని పిలిపించుకున్న కోడెల ఈ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పాపం జగన్ ప్రభుత్వానిది కాదా? ఆయన ఆత్మహత్య చేసుకున్నాక శాంతించిన ప్రభుత్వం సదరు కేసులను అటకెక్కించలేదా? స్పీకర్‌గా ఉన్నప్పుడు ప్రభుత్వం సరఫరా చేసిన ఫర్నిచర్ తిరిగి ఇవ్వలేదని కోడెలపై కేసు పెట్టిన విషయం మరిచారా? ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేయించిన ఫర్నిచర్ తిరిగి ఇచ్చారా? ఇప్పటికీ లేదే? కరోనా సమయంలో మాస్కులు సరఫరా చేయడం లేదని ప్రశ్నించినందుకు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను వేధించి ఆయన చావుకు కారణం కాలేదా? ఆయనను పిచ్చివాడిగా చిత్రించి నడిరోడ్డుపై పోలీసులతో కొట్టించలేదా? ఆయన అకాల మరణంతో జగన్ ప్రభుత్వం శాంతించింది. సీనియర్ సిటిజన్ రంగనాయకమ్మ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో పోస్ట్ పెట్టిందని చెప్పి పోలీసులతో వేధించడంతో... అది తట్టుకోలేక ఆమె హైదరాబాద్‌కు వలస వెళ్లడం నిజం కాదా? పరువు ప్రతిష్ఠలతో బతికినవారిని, ఆత్మవిశ్వాసంతో ఎదురు నిలిచిన వారిని వేధించడమే పనిగా పెట్టుకోలేదా? రాష్ట్రంలో తన చానల్ ప్రసారాలు నిలిచిపోవడంపై జగన్‌రెడ్డి ఇప్పుడు శోకాలు పెడుతున్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే ఏబీఎన్‌తో పాటు మరో చానల్ ప్రసారాలను ఐదేళ్లపాటు జగన్ అండ్ కో నిలిపివేయించలేదా? తప్పుడు విధానాలకు తెరతీసింది ఎవరు? ధర్మో రక్షతి రక్షితః అంటారు. మనం ధర్మబద్ధంగా వ్యవహరిస్తే, ఇతరులు కూడా మన పట్ల ధర్మబద్ధంగా వ్యవహరించాలని కోరవచ్చు. అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వాళ్లు ఇప్పుడు అన్యాయం, అక్రమం అని శోకాలు పెట్టడమేమిటి? జగన్ నాయకత్వాన్ని ధిక్కరించి విమర్శలు చేసిన సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణ రాజును పోలీసులు తీసుకెళ్లి అరికాళ్లపై అదేపనిగా కొట్టారు కదా? కస్టోడియల్ టార్చర్ నేరమని తెలిసి కూడా ఒక ఎంపీగా ఉన్న వ్యక్తిని చిత్రహింసలు పెట్టారంటే జగన్ పాలన ఎంత దారుణంగా ఉండిందో తెలియడం లేదా? రఘురాజును అరికాళ్లు పగిలేలా కొట్టడం తప్పని చెప్పకపోగా– 'అబ్బే ఆయనను ఎవరూ కొట్టలేదు. అరికాళ్లపై ఆయనకు సొరియాసిస్ ఉంది' అని జగన్ భజనపరులు దిక్కుమాలిన వాదన చేయడం నిజం కాదా? సీఐడీ విభాగాన్ని కిరాయి సైనిక మూకగా మార్చి తప్పుడు కేసులు పెట్టించడాన్ని జగన్‌రెడ్డి ఎలా సమర్థించుకుంటారు? తనకు వేధింపులు కొత్త కాదని, ఇకపై కూడా వేధింపులు, కష్టాలు ఎదురవుతాయని అంటూ ప్రజల సానుభూతి కోసం జగన్ ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇది నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్న నానుడిని ఆయన మర్చిపోతున్నారు. నిండు శాసనసభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీమణిని అవమానించినప్పుడు... నాటి కౌరవ సభలో ద్రౌపదీ వస్త్రాపహరణం సందర్భంగా దుర్యోధనుడు వికటాట్టహాసం చేసినట్టుగా ఈనాటి సభలో జగన్ షిక్కటి చిరునవ్వులతో ఆనందించలేదా? విలువలు, విశ్వసనీయత అప్పుడు గుర్తుకు రాలేదా! కొంతమంది తన మంత్రులు, శాసనసభ్యులు ప్రతిపక్ష నేత చంద్రబాబు వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా బహిరంగంగా వాడూ వీడూ, చెత్త నా కొడుకు అని దూషించినప్పుడు ముఖ్యమంత్రిగా మౌనంగా ఉండిపోవడం ఏ నీతి? ఏ రీతి? వ్యక్తులను దారుణంగా కించపరచడమే కాకుండా ఇళ్లలోని ఆడవాళ్లను కూడా బజారుకీడ్చారు కదా? స్త్రీలను చెరబట్టడం మినహా మిగతా అన్ని రకాలుగా దురాగతాలకు పాల్పడ్డారు కదా? అయినా ఆ ఐదేళ్లలో హద్దుమీరిన అధికారులను, శాసనసభ్యులను, మంత్రులను జగన్‌రెడ్డి ఒక్కసారైనా మందలించడం చూశారా? లేదే? సదరు దుశ్చర్యలు ఆయనకు అమితానందాన్ని ఇచ్చాయి. జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం ఆయనకు గిట్టని వారిపై తన మనుషులు బూతులతో విరుచుకుపడిన విషయం మరిచారా? తనకు గిట్టని మీడియా సంస్థలను శాసనసభ కార్యక్రమాలు ప్రసారం చేయకుండా నిషేధించలేదా? ముఖ్యమంత్రి నివాసం పరిసరాలకు కూడా రానివ్వలేదే? ఆంధ్రజ్యోతి పత్రికకు, ఏబీఎన్ చానల్‌కు ఐదేళ్లపాటు న్యాయంగా ఇవ్వాల్సిన ప్రకటనల్లో ఒక్కటైనా ఇవ్వకపోవడం ఏ నీతి? ఇందుకే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయని అనాల్సి వస్తోంది. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులను వెంటాడి వేధించడంలో ఏ విలువలు దాగి ఉన్నాయి? ఈ వర్గం ఆ వర్గం అన్న తేడా లేకుండా జగన్ పాలనలో ఇబ్బందికి గురికాని వర్గం అంటూ లేకుండా పోవడం నిజం కాదా? అందుకే కదా ప్రజలు కూడా కులం చూడబోము, మతం చూడబోమని జగన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు!

ఇంకా ఆత్మవంచనే...

ఎన్నికల్లో ఓడిపోయిన సందర్భాలలో అధికారం కోల్పోయిన పార్టీలు ఆత్మ విమర్శ చేసుకోవడం సహజం. జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఆత్మ విమర్శకు సిద్ధపడకపోగా పరనిందకు తెగబడుతున్నారు. ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ మళ్లీ ఎన్నికల నాటికి ప్రజాభిమానం చూరగొనడానికి ప్రయత్నిస్తుంది. జగన్ అండ్ కోలో ఈ ఛాయలు కూడా కనిపించడంలేదు. తప్పంతా ప్రజలదే అన్నట్టుగా ఆత్మవంచనకు పాల్పడుతున్నారు. చెడు చేసి ఓడితే బాధపడాలి కానీ, మంచి చేసి ఓడితే బాధపడకూడదని వితండ వాదం చేస్తున్నారు. నిజంగా మంచి పాలనే ఇస్తే ప్రజలెందుకు ఓడిస్తారు? ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిపిన సమావేశాల్లో జగన్‌రెడ్డి ఉపన్యాసం విన్నాక ఆయన మారతారని భావించడం భ్రమే అవుతుంది. తన పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలూ ఎందుకు ఏకమయ్యారో గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టకపోగా ఆత్మవంచన చేసుకుంటూ పొద్దుపుచ్చుతున్నారు. విచిత్రమేమిటంటే జగన్ రోత మీడియాతో పాటు కూలి మీడియా కూడా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సాధించిన ఘన విజయాన్ని సాంకేతిక విజయం మాత్రమేనని, జగన్‌రెడ్డే అసలైన ప్రజా నాయకుడని, ప్రజల మద్దతు ఆయనకే ఉంటుందని ప్రచారం చేస్తూ ఆత్మవంచన చేసుకుంటున్నాయి. ఈవీఎం ట్యాంపరింగ్ వల్లే జగన్ ఓడిపోయారని గత పది రోజులుగా ప్రచారం చేస్తున్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమని ఇదే జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల తర్వాత తేల్చి చెప్పడాన్ని వారు మరచిపోయారు. ఈవీఎంల ద్వారా ప్రజల తీర్పును తారుమారు చేయలేరని అనేక సందర్భాలలో ఎన్నికల కమిషన్ రుజువు చేసింది. చంద్రబాబు విజయానికి ప్రధాని నరేంద్ర మోదీ లేదా ఎన్నికల కమిషన్ పరోక్ష సహకారం ఉందని ప్రజలను నమ్మించే విఫలయత్నం చేస్తున్నారు. తాజా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 2019 మాదిరి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే మెజారిటీ లభించలేదు. ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమయ్యే పక్షంలో చంద్రబాబు విజయానికి సహకరించిన మోదీ తన సొంత పార్టీకి మెజారిటీ సీట్లు సాధించుకోలేరా? కూలి మీడియా, రోత మీడియా ఈవీఎంలపై చేస్తున్న ప్రచారం చూస్తుంటే భర్తృహరి సుభాషితం గుర్తుకొస్తోంది. 'తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు. దవిలి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు. చేరి మూర్ఖుల మనసు రంజింప రాదు' అని భర్తృహరి చెప్పారు. ఎన్నికలకు ముందు కూడా కొంత మంది రాతగాళ్లు, కూతగాళ్లు ఇదే విధంగా జగన్‌రెడ్డిని తప్పు దారి పట్టించారు. ప్రభుత్వ పనితీరు అదరహో అని ప్రచారం చేస్తూ జగన్‌ను కూడా నమ్మించారు. ప్రజలంతా జగన్మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని, 2019 కంటే ఎక్కువ శాతం ఓట్లు, సీట్లు వస్తాయని నమ్మబలికారు. సంక్షేమ పథకాల వల్ల పేదల జీవితాలు మారిపోయాయని, సామాజిక న్యాయం అద్భుతంగా జరిగిందని, దేశ చరిత్రలో ఏ నాయకుడు కూడా సాహసించని నిర్ణయాలను జగన్‌రెడ్డి తీసుకొన్నారని ఊదరగొట్టారు. పూర్వం రాజుల ఆస్థానంలో పొగడ్తల కోసం కొంత మంది ప్రత్యేకంగా ఉండేవారు. ఇప్పుడు జగన్‌రెడ్డి ఆస్థానంలో కూడా ఇలాంటి వారు చేరారు. వారి మాటలను నిజంగానే నమ్మిన జగన్‌రెడ్డి క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుసుకొనే ప్రయత్నం చేయలేదు. భజనపరుల మాటలు నమ్మి నిండా మునిగిపోయారు. తన పాలనకు వ్యతిరేకంగా మెజారిటీ ప్రజలు కులమతాలకు అతీతంగా జట్టుకట్టిన విషయం గుర్తించలేకపోయారు. పేదలు, పెత్తందారులు అంటూ సమాజాన్ని విభజించే ప్రయత్నం చేసి బొక్కబోర్లా పడ్డారు. ప్రభువుల మనసు రంజింపజేసి లబ్ధిపొందడానికి ప్రయత్నించే వాళ్లు ఎప్పుడూ ఉంటారు. అయితే పాలకులు ఎవరైనాగానీ తమ హితం కోరేవారు ఎవరో, సమాజ హితం కోరే వారు ఎవరో గుర్తించి వారిని మాత్రమే చేరదీస్తే ఎన్నికల్లో ఘోర పరాభవం ఎదురవదు. అధికారంలో ఉన్నప్పుడు ఉన్మాద మూకను పెంచి పోషించినందుకు తగిన మూల్యం చెల్లించుకున్న జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా ఆత్మపరిశీలన చేసుకొని వాస్తవిక దృక్పథంతో ఆలోచించడం నేర్చుకోవాలి. విలువలు, విశ్వసనీయత వంటి పదాలు జగన్ నోటికి సరిపడవుగానీ, ప్రజలు నమ్మే మాటలు చెప్పడం మంచిది. తల్లినీ చెల్లిని కూడా విసిరికొట్టిన జగన్మోహన్‌రెడ్డిలో అనుబంధాలు, ఆత్మీయతలు ఉంటాయనుకోవడం భ్రమ అవుతుంది.

> ఈ ప్రభుత్వం మాది అని అన్ని వర్గాల ప్రజలూ భావించాలి. 2019లో తాము ఎందుకు ఓడిపోయిందీ, 2024 ఎన్నికల్లో జగన్ ఎందుకు ఓడిపోయిందీ లోతుగా విశ్లేషించుకొని అందుకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకొని తదనుగుణంగా చంద్రబాబు పాలన సాగాలి.



> అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వాళ్లు ఇప్పుడు అన్యాయం, అక్రమం అని శోకాలు పెట్టడమేమిటి? జగన్ నాయకత్వాన్ని ధిక్కరించి విమర్శలు చేసిన సొంత పార్టీ ఎంపీ రఘురామకృష్ణ రాజును పోలీసులు తీసుకెళ్లి అరికాళ్లపై అదేపనిగా కొట్టారు కదా? కస్టోడియల్ టార్చర్ నేరమని తెలిసి కూడా ఒక ఎంపీగా ఉన్న వ్యక్తిని చిత్రహింసలు పెట్టారంటే జగన్ పాలన ఎంత దారుణంగా ఉండిందో తెలియడం లేదా? నిండు శాసనసభలో ప్రతిపక్ష నేత చంద్రబాబు సతీమణిని అవమానించినప్పుడు... నాటి కౌరవ సభలో ద్రౌపది వస్త్రాపహరణం సందర్భంగా దుర్యోధనుడు వికటాట్టహాసం చేసినట్టుగా ఈనాటి సభలో జగన్ షిక్కటి చిరునవ్వులతో ఆనందించలేదా? విలువలు, విశ్వసనీయత అప్పుడు గుర్తుకు రాలేదా! కొంతమంది తన మంత్రులు, శాసనసభ్యులు ప్రతిపక్ష నేత చంద్రబాబు వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా బహిరంగంగా వాడూ వీడూ, చెత్త నా కొడుకు అని దూషించినప్పుడు ముఖ్యమంత్రిగా మౌనంగా ఉండిపోవడం ఏ నీతి? ఏ రీతి?

బటన్లు నొక్కితే చాలదు...

గతంలో తన పాలనను రాజారెడ్డి రాజ్యాంగం అన్నారని, ఇప్పుడు కొత్త ప్రభుత్వాన్ని రెడ్ బుక్ రాజ్యాంగమని నిందించడం... తొందరపడి కోయిల ముందే కూసింది అన్నట్టుగా ఉంది. అయినా అధికారులను, రాజకీయ ప్రత్యర్థులను ఎన్ని విధాలుగా వేధించవచ్చో చేసి చూపించిన జగన్మోహన్‌రెడ్డిని మించిన దురాగతాలను మరెవరూ చేయలేరు. ఆత్మస్తుతి, పరనింద వల్ల ప్రయోజనం లేదు. ప్రజలకు తానేమీ చెడు చేయలేదని చెప్పుకోవడం ఆత్మవంచనే అవుతుంది. ముఖ్యమంత్రి పనేమిటి? మనం చేసిందేమిటి? అన్న విషయంలో ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. బటన్లు నొక్కడం మాత్రమే ముఖ్యమంత్రి పని కాదు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి గురించి కూడా ఆలోచించాలి. అభివృద్ధి – సంక్షేమం మధ్య సమతుల్యత ఉండాలని జగన్ గుర్తించాలి. ఈవీఎంలలో ఏదో జరిగిపోయిందని చెప్పే వాదనకు తెగబడేవారు జగన్ ఏయే విషయాలలో మారాలో సూచిస్తే ఆయనకు నిజమైన శ్రేయోభిలాషులుగా మిగులుతారు. విష ప్రచారం, దుష్ప్రచారం అన్ని వేళలా పని చేయవని కూడా జగన్ అండ్ కో తెలుసుకోవాలి. ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన స్వల్ప సంఘటనలను భూతద్దంలో చూపినంత మాత్రాన ప్రయోజనం ఉండదు. నిన్నటి వరకు మీ పాలనలో జరిగిన దురాగతాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. తనకంటే దరిద్రంగా చంద్రబాబు పాలన ఉంటే తప్ప జగన్మోహన్‌రెడ్డికి ఐదేళ్ల తర్వాత అధికారం వచ్చి ఒడిలో వాలదు.

కొత్త సర్కారుకు సవాళ్లు

చంద్రబాబు నేతృత్వంలో కొలువుదీరిన ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. జగన్ పాలనలో వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం అయ్యాయి. అఖిల భారత సర్వీసు అధికారుల వెన్ను విరిచి బానిసలుగా మార్చుకున్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలు భారం అదనం కాబోతోంది. ఇచ్చిన మాట ప్రకారం వృద్ధుల పింఛన్‌ను మూడు వేల నుంచి నాలుగు వేలకు పెంచారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం ముందుగా ఆదాయం పెంచుకోవడంపై దృష్టి సారించాలి. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారం ఉండే అవకాశం ఉన్నందున పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. పెట్టుబడులు వచ్చినంత మాత్రాన ఇప్పటికిప్పుడు ఆదాయం పెరగదు. ఇచ్చిన హామీల అమలు కోసం మరిన్ని అప్పులు చేయవలసి రావొచ్చు. తాజా ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సొంతంగానే కావాల్సినంత మెజారిటీ లభించినప్పటికీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. సంకీర్ణ ప్రభుత్వం అన్నాక ఒడిదుడుకులు, అప్పుడప్పుడూ అభిప్రాయ భేదాలు ఏర్పడటం సహజం. ఎన్నికల్లో ఓడిపోయిన జగన్మోహన్‌రెడ్డికి వంచనతో కూడిన కపట రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబుకు రాజకీయాల్లో అపార అనుభవం ఉండటమే కాకుండా భూమాతకు ఉన్నంత సహనం, ఓర్పు ఉంటుంది. అయినా... తెలుగుదేశం–జనసేన పార్టీల మధ్య విభేదాలు సృష్టించడానికి జగన్ అండ్ కో సహజంగానే ప్రయత్నిస్తుంది. జనసేనాని పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు అసాధారణ పరిణతి ప్రదర్శించారు. సీట్ల సర్దుబాటు సమయంలోనూ, మంత్రి పదవుల విషయంలోగానీ ఆయన మంకు పట్టుకు పోలేదు. జగన్‌రెడ్డి విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీతో పొత్తు ఏర్పడకుండా చెడగొట్టడానికి ఎవరెంత ప్రయత్నించినా ఖాతరు చేయలేదు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికే కాకుండా, వ్యక్తిగతంగా తనకు జరిగే నష్టాన్ని గుర్తించి అందుకు తగ్గట్టుగానే మెలిగారు. ఉప ముఖ్యమంత్రిగా కూడా ఆయనపై ఇప్పుడు బాధ్యత పెరిగింది. తెలుగుదేశం – జనసేన మైత్రిని చెడగొట్టడానికి జరిగే ప్రయత్నాలు సఫలం కాకూడదంటే... విభేదాలు ఏర్పడితే వాటి పరిష్కారానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. చంద్రబాబుకు అపార పాలనానుభవం ఉంది. అంతేకాదు, ప్రతిపక్షానికి 11 సీట్లు మాత్రమే వచ్చినందున ప్రభుత్వ సుస్థిరతకు ఎలాంటి ఇబ్బందీ లేదు. జగన్ పాలనలో కొంత మంది అధికారులు పూర్తిగా చెడిపోయారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు అటువంటి వారి పట్ల తన సహజ ధోరణికి భిన్నంగా వ్యవహరించారు. ఐఏఎస్, ఐపీఎస్ సర్వీసులకు కళంకంగా వ్యవహరించిన శ్రీలక్ష్మి, పీఎస్సార్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్ వంటి అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించారు. శ్రీలక్ష్మి పుష్పగుచ్ఛం ఇచ్చే ప్రయత్నం చేయగా దాన్ని తీసుకోవడానికి కూడా ఇష్టపడలేదు. చంద్రబాబు గత ప్రవర్తనకు ఇది పూర్తి భిన్నం. తాము ఏ పరిస్థితుల్లో, ఎవరి ఒత్తిడి వల్ల గత ప్రభుత్వానికి ఊడిగం చేయవలసి వచ్చిందో వివరించడానికి ఆయా అధికారులు సిద్ధపడుతున్నారు. ఆర్థిక నేరాలలో నిందితుడుగా ఉన్న జగన్ వంటి వ్యక్తికి దాసోహం అవాల్సిన అవసరం ఏమిటో ఆయా అధికారులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. రూల్ ఆఫ్ లా అమలు చేయాల్సిన అధికారులు ఆటవిక పాలనకు తమవంతు సహకారం అందించడమే కాకుండా, అందులో భాగస్వాములయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని సంస్కరించడానికి చంద్రబాబు సహజంగానే ప్రయత్నిస్తారు. అయితే absolute power corrupts absolutely అన్నట్టు కనీవినీ ఎరుగని మెజారిటీతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వ పోకడలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ఇంత ఘోర పరాభవం ఎందుకు ఎదురైందో ముందుగా కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర నాయకులు గుర్తించి అందుకు తగ్గట్టుగా మెలగాలి. అధికారం అందింది కదా అని గత ప్రభుత్వంలో మాదిరి చట్టవిరుద్ధంగా దోపిడీ దౌర్జన్యాలకు పాల్పడితే వాతలు పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు. పాలన పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినప్పుడే అది గుడ్ గవర్నెన్స్ అవుతుంది. అంతే కానీ అధికారాలు లేని పదవులు ఆయా వర్గాలకు కేటాయించి సామాజిక సమతుల్యత పాటించామని గొప్పలు చెప్పుకొంటే జగన్‌కు ఏమి జరిగిందో చూశారుగా! ఈ ప్రభుత్వం మాది అని అన్ని వర్గాల ప్రజలూ భావించాలి. 2019లో తాము ఎందుకు ఓడిపోయిందీ, 2024 ఎన్నికల్లో జగన్ ఎందుకు ఓడిపోయిందీ లోతుగా విశ్లేషించుకొని అందుకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకొని తదనుగుణంగా చంద్రబాబు పాలన సాగాలి. ప్రజలు గంపెడాశతో తమను అందలం ఎక్కించారని చంద్రబాబు అండ్ కో గుర్తించాలి. ఎన్నికల్లో జగన్‌కు ఎదురైన పరాభవం ఒక హెచ్చరికగా చంద్రబాబు ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలి. అధికార కూటమి నాయకులు ప్రతిరోజూ పొద్దున్నే లేవగానే జగన్ ఎలా, ఎందుకు ఓడిపోయారో గుర్తుకు తెచ్చుకోవాలి. రాజ్యసభలో మాకు బలం ఉందని జగన్ అండ్ కో గొప్పలు చెప్పుకొంటున్నారుగానీ తలపై బండెడు కేసుల భారం మోస్తున్న జగన్మోహన్‌రెడ్డి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని ధిక్కరించే సాహసం చేయడం అసంభవం. అన్నింటినీ మించిన జోక్ ఏమిటంటే... ఐదేళ్లుగా విభజన హామీలు, ప్రత్యేక హోదా గురించి మాట మాత్రంగానైనా కేంద్రం వద్ద ప్రస్తావించని జగన్‌రెడ్డి ఇప్పుడు చంద్రబాబు ప్రత్యేక హోదా కోరకపోవడం మహా పాపం అని నిందిస్తున్నారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లయ్యాక ఇప్పుడు ప్రత్యేక హోదా, విభజన హామీలకు ప్రాధాన్యత ఉంటుందా? రాజకీయం కోసం జగన్ అండ్ కో చేసే విమర్శలను ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోకుండా ముందుకు సాగి ప్రజలను సంతృప్తిపరచే విధంగా పాలిస్తారని ఆశిద్దాం!

> ప్రజలకు తానేమీ చెడు చేయలేదని జగన్ చెప్పుకోవడం ఆత్మవంచనే అవుతుంది. ముఖ్యమంత్రి పనేమిటి? మనం చేసిందేమిటి? అన్న విషయంలో ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. బటన్లు నొక్కడం మాత్రమే ముఖ్యమంత్రి పనికాదు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి గురించి కూడా ఆలోచించాలి. అభివృద్ధి – సంక్షేమం మధ్య సమతుల్యత ఉండాలని జగన్ గుర్తించాలి. ఈవీఎంలలో ఏదో జరిగిపోయిందని చెప్పే వాదనకు తెగబడేవారు జగన్ ఏయే విషయాలలో మారాలో సూచిస్తే ఆయనకు నిజమైన శ్రేయోభిలాషులుగా మిగులుతారు. విష ప్రచారం, దుష్ప్రచారం అన్ని వేళలా పని చేయవని కూడా జగన్ అండ్ కో తెలుసుకోవాలి. ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన స్వల్ప సంఘటనలను భూతద్దంలో చూపినంత మాత్రానా ప్రయోజనం ఉండదు. నిన్నటి వరకు మీ పాలనలో జరిగిన దురాగతాలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు. తనకంటే దరిద్రంగా చంద్రబాబు పాలన ఉంటే తప్ప జగన్మోహన్‌రెడ్డికి ఐదేళ్ల తర్వాత అధికారం వచ్చి ఒడిలో వాలదు.


వంద వత్సరాల 'పరిణయ రహస్యము'

మహాకవి శ్రీశ్రీ ముద్రిత రచనల్లో లభిస్తున్న వాటిల్లో మొదటిది 'పరిణయ రహస్యము' అనే నవలిక. ఇది 1924లో ముద్రితమైంది. అంటే నూరు సంవత్సరాలు అవుతున్నది. 1910 ఏప్రిల్, 30న జన్మించిన శ్రీశ్రీకి ఈ రచన నాటికి కేవలం పద్నాలుగు సంవత్సరాలు మాత్రమే. సుమారు తొమ్మిదేళ్ళ ప్రాయానికే ఆయన కందం లాంటి పద్య రచన చేశాడు. ఆ తర్వాత 'దివ్య లోచనములు' శీర్షికతో రాసిన పద్యాలు పురిపండా అప్పలస్వామి సంపాదకత్వంలో వెలువడుతున్న 'స్వశక్తి' పత్రికలో ముద్రితమయ్యాయి. అచ్చులో ఇదే శ్రీశ్రీ తొలి రచన. కవిత్వంతో పాటు వచన రచనలూ విరివిగానే చదువుతున్న ("... ఎక్కువగా వచనం, ముఖ్యంగా డిటెక్టివ్ నవలలు చదువుతుండే నాకు..." పుట–35, అనంతం) వాటిలో నవలలు, అందునా డిటెక్టివ్ నవలలూ బాగా చదువుతున్న ప్రభావంతో 'గోకులాయి' డిటెక్టివ్ నవల, వీరసింహ విజయసింహులు అనే దేశభక్తి పూర్వక నవలా రాశాడు శ్రీశ్రీ. ఇవన్నీ ప్రస్తుతం అలభ్యం. సుమారు అదే సమయంలో 'పరిణయ రహస్యం' అనే డిటెక్టివ్ నవల రచించాడు. "పెళ్ళికి ఒకటి, రెండు నెలల క్రిందట నా మొదటి నవలిక పరిణయ రహస్యము అచ్చువేయించాను మా నాన్న డబ్బివ్వగా" (పుట–46, అనంతం) అని చెప్పుకున్నా దీన్ని 1924లో విశాఖపట్టణంలోని ఆంధ్ర సంజీవినీ గ్రంథమాల ప్రచురించింది.

ఈ పుస్తకం గురించి శ్రీశ్రీ తన జీవిత చరిత్రను 1975లో రాస్తూ "... నా పరిణయ రహస్యము (అపరాధ పరిశోధక నవలిక) ఇప్పుడెక్కడా దొరకదు. దీనికోసం ఎందరో మిత్రులు గాలిస్తున్నారు. దొరుకుతుందనే ఆశలేదు" (పుట–250, అనంతం) అని తెలిపారు. శ్రీశ్రీ మరణానంతరం 1991లో ఇది లభించింది. ఇందులోని మొదటి ప్రకరణం 'తూర్పుసీమ' అనే మాసపత్రిక జూలై 1991 సంచికలో ముద్రించారు. దీని గురించి "... అదృష్టవశాత్తు ఇటీవల శిథిలావస్థలో ఒకచోట బయటపడింది. ఆ పుస్తకంలోని కొన్ని పుటలు తూర్పుసీమ పత్రికా ముఖంగా తెలుగు పాఠకుల ముందుంచగల్గుతున్నాము" (పుట–5) అని దాని సంపాదకులు మండా సూర్యనారాయణ (మసూనా) వివరించారు. 1994 ఏప్రిల్ 10, 17, 24 తేదీల్లో ఈ నవలను ఆంధ్రజ్యోతి దినపత్రికలో ముద్రించారు. దీనిని డిసెంబర్, 2009లో 'శ్రీశ్రీ సాహిత్య నిధి' వారు సింగంపల్లి అశోక్‌కుమార్ కూర్పరిగా ప్రత్యేక పుస్తకంగా తీసుకొచ్చారు. శ్రీశ్రీ శతజయంతి సంవత్సరమైన 2010, ఏప్రిల్ 30న 'మనసు ఫౌండేషన్' వారు శ్రీశ్రీ లభ్య రచనలన్నింటినీ చలసాని ప్రసాద్, ఎం.వి. రాయుడు కూర్పరులుగా మూడు సంపుటాలుగా తెచ్చిన వాటిల్లో రెండవ సంపుటిలో ఈ 'పరిణయ రహస్యము' ముద్రితమైంది. ఈ నవలలో ఉన్న విషయం, భాష మొదలైనవి చూద్దాం.

ఈ నవలికలో పది ప్రకరణాలున్నాయి. వాటికి పరిణయ ప్రసంగము, పరిణయ నిశ్చయము, పరిణయ భంగము, రాజమహేంద్రవర ప్రయాణము, ఆలోచనము, కామేశ్వరరావు, రహస్య ప్రకాశనము, సంభాషణము, స్వర్ణాభరణము, నిరూపణము అనే పేర్లు క్రమంగా ఉన్నాయి. ఇవి ఆయా ప్రకరణాల ప్రధాన ఇతివృత్తాన్ని సూచించే విధంగా రచయిత పెట్టాడు. ఇందులో నారాయణ రావు, కృష్ణారావు, రాఘవయ్య, బంగారమ్మ (పద్మనాభరావు), రాఘవయ్య భార్య, పేద వాడు, రామమోహనరావు, కామేశ్వరరావు, కాంతమ్మ, పురోహితులు, పెళ్ళికి వచ్చిన బంధు, మిత్ర పరివారము, దత్తు, ఆనందరావు, పోలీసులు ఇత్యాది పాత్రలు ఉన్నాయి. ఈ కథ విశాఖపట్టణము, సింహాచల క్షేత్రం, రాజమహేంద్రవరము, నరసీపట్టణము, కోర్టు, పోలీసు స్టేషన్, రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్ మొదలైన చోట్ల సాగుతుంది.

> లోకంలో అమ్మాయిలకు వరుణ్ణి వెదకడం సర్వసాధారణం అనే విషయం ఈ నవలిక రచయిత శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) పద్నాలుగేళ్ళ ప్రాయానికే గుర్తించడం గమనిస్తాం. లోకంలో అమ్మాయి పక్షం వాళ్ళు వరుణ్ణి వెదకడం ఆచారం. కానీ దానికి భిన్నంగా అబ్బాయివాళ్ళే వధువును వెదకడం చూస్తాం. ఇందులోని కథను మలుపు తిప్పిన తీరును గమనిస్తే పద్నాలుగేళ్ళకే చేయితిరిగిన రచయితలా కనిపిస్తాడు శ్రీశ్రీ.




కథాపరంగా చూస్తే– నారాయణరావు అనే బ్రాహ్మణ న్యాయవాది విశాఖలో ఉంటాడు. ఇతని ఒక్కగానొక్క సంతానం కృష్ణారావు. ఈతని పెళ్ళికై అమ్మాయిలను వెదకడం మొదలెడతాడు తండ్రి. రాఘవయ్య అనే అతను తన ఏకైక కూతురు బంగారమ్మ చదువులోను, రూపంలోనూ మీకు సరిపోయే విధంగా ఉంటుందని చెప్పి వారికి ఫోటోను ఇచ్చి వెళతాడు. ఈ అమ్మాయి కృష్ణారావుకు నచ్చుతుంది. అమ్మాయి తండ్రి మంచి ముహూర్తాల గురించి చెబుతాడు. అబ్బాయి వాళ్ళు పెళ్ళి స్థలమైన సింహాచలంకు ఒక రోజు ముందే చేరుకుని విడిదిలో బసచేసి, పెళ్ళి రోజు తెల్లవారుఝామునే నిద్రలేచి చూస్తే అమ్మాయి వాళ్ళెవరూ కనిపించరు. పెళ్ళిలో అమ్మాయికి పెట్టాల్సిన నగల పెట్టె అగుపించక దుఃఖిస్తుంటే... బంధువులు ఓదార్చి, విశాఖపట్టణంలోని అపరాధ పరిశోధకుడు రామమోహనరావును కలిస్తే సమస్య పరిష్కారమవుతుందని చెబుతారు. దాంతో విశాఖకు వెళ్ళి జరిగినదంతా రామమోహనరావుకు చెప్పాక, నేర పరిశోధనకు అంగీకరించిన ఆయన, తాను రేపు రాజమండ్రిలో ఓ పెళ్ళికి వెళ్లొచ్చాక మొదలెడతానంటాడు. అక్కడే తనకు కోర్టు పని ఉన్నందున తాను కూడా వస్తానని నారాయణరావు అంటాడు. రాజమహేంద్రవరంలో కామేశ్వరరావు పరమ ధార్మికుడైన ధనిక బ్రాహ్మణుడు. ఇతనికి పద్మనాభరావు, కాంతమ్మ అనే ఇద్దరు పిల్లలు. కామేశ్వరరావు భార్య మరణించినందువల్ల ఒక వంటల వాడిని పెట్టుకుంటాడు. ఈ వంటలవాడు యజమాని కొడుకు పద్మనాభరావును అపహరిస్తాడు. కొడుకు జాడ ఎంత వెదికినా అతనికి దొరకదు. తన కూతురు కాంతమ్మ పెళ్ళికి పూనుకుంటాడు కామేశ్వరరావు. ఈ పెళ్ళికే రామమోహనరావు, నారాయణరావు వస్తున్నారు. అంతలో ఒక పేదవాడు వచ్చి కామేశ్వరరావును కలిసి దొరికిన అతని కొడుకు (పద్మనాభరావు) గురించి చెప్పి, తనకు వెయ్యి రూపాయలిస్తే అతన్ని అప్పచెబుతానంటాడు. అప్పుడే అక్కడికి వచ్చిన రామమోహనరావుకు, అపహరించబడిన కామేశ్వరరావు అబ్బాయి పద్మనాభరావే స్త్రీ వేషంలో ఉండి పారిపోయిన పెళ్ళికూతురు బంగారమ్మ అనే విషయం అర్థమై, పోలీసులకు అప్పజెప్పుతాడు. మోసం బయటపడుతుంది. ఈ మోసగాళ్ళు నరసీపట్టణంలో ఉన్న తమ మిత్రుడు ఆనందరావు దగ్గర ఉన్న నగలను అమ్మిదామనుకున్న సంగతిని రామమోహనరావు, నారాయణరావులు పసిగడతారు. వారు ఆనందరావును పట్టుకోవడానికి నరసీపట్నం చేరుకొని మారువేషంలో తిరుగుతుండగా, నగలు అమ్ముతున్న ఓ వ్యక్తి (ఆనందరావు) తారసపడడంతో తాము కొంటామని చెప్పి... ఇంకా నగలను చూపించమంటారు. అతడు తన ఇంటికి తీసుకెళ్ళి నగలన్నీ చూపించగానే... అవన్నీ తమవే అని నారాయణరావు చెప్పడంతో, ఆనందరావును బంధించి పోలీసులకు అప్పచెబుతాడు రామమోహనరావు. ఆ తర్వాత దొరికిన రాఘవయ్యను కూడా పోలీసులు విశాఖకు తరలిస్తారు. మోసం చేసిన వారికి శిక్ష పడుతుంది. పోయిన నగలు, డబ్బు దొరుకుతాయి. అనంతరం కృష్ణారావు పెళ్ళి జరిగి కథ సుఖాంతమవుతుంది. ఇదీ ఇందులోని ఇతివృత్తం.

లోకంలో అమ్మాయిలకు వరుణ్ణి వెదకడం సర్వసాధారణం అనే విషయం ఈ నవలిక రచయిత శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) పద్నాలుగేళ్ళ ప్రాయానికే గుర్తించడం గమనిస్తాం. లోకంలో అమ్మాయి పక్షం వాళ్ళు వరుణ్ణి వెదకడం ఆచారం. కానీ దానికి భిన్నంగా అబ్బాయివాళ్ళే వధువును వెదకడం చూస్తాం. ఇందులోని కథను మలుపు తిప్పిన తీరును గమనిస్తే పద్నాలుగేళ్ళకే చేయితిరిగిన రచయితలా కనిపిస్తాడు శ్రీశ్రీ.

ఈ పుస్తకంలో లేఖనానికి సంబంధించి వలపల గిలక ప్రయోగింపబడింది. 'హో' అనే అక్షరాన్ని మరో రకంగా ముద్రించారు. ఇలా నేటి ముద్రణకు, లేఖనానికి భిన్నమైన పూర్వరూపాలు గమనిస్తాం. ఇందులో **"అంతట నప్పురుషుడు తన పేరు రాఘవయ్య యనియు, దానాతని దూరపు బంధువుడననియు, వరుసకు బావ నగుదుననియు దన్నెఱింగించుకొని తన నివాస స్థలము చీపురుపల్లి యని వచించెను"** (పుటలు–2, 3, ఆంధ్ర సంజీవనీ గ్రంథమాల ప్రచురించిన పరిణయ రహస్యము) అనే రీతిగా గ్రాంథిక ప్రయోగమే ఎక్కువగా ఉంటుంది. పద్నాలుగేళ్ళ ప్రాయానికే 'పరిణయ రహస్యము' నవలికను ఎంతో పరిణతితో రచించాడు శ్రీశ్రీ.

▪ డా. రాపోలు సుదర్శన్
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అరసం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
ఆదివారం 16 జూన్ 2024





బోర్డింగ్ పాస్ ఇస్తున్న ఎంపీలు కేశినేని చిన్ని, వల్లభనేని బాలశౌరి



అనాథగా మిగిలిపోయిన జక్కంపూడిలోని టిడ్కో ఇళ్లు

జెట్ వేగం

జక్కంపూడి జెట్‌సిటీకి మళ్లీ మంచిరోజులు

ఐదేళ్లుగా అక్కరకు రాకుండా అనాథలా మిగిలిపోయిన జెట్‌సిటీకి మళ్లీ మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అమరావతి తరహాలోనే జెట్‌సిటీని కూడా నాశనం చేసి మూలకు చేర్చింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో ఇక్కడి టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు, ఇండస్ట్రియల్ ఏరియాకు చెందినవారు ఊపిరి పీల్చుకుని ఆశగా ఎదురుచూస్తున్నారు.

- ఐదేళ్లుగా మూలనపడిన ప్రాంతానికి మోక్షం
- ఆశగా ఎదురుచూస్తున్న టిడ్కో లబ్ధిదారులు
- ఫుట్‌వేర్ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌పై ఆశలు
- గతంలోనే 90 శాతం పనులు పూర్తిచేసిన టీడీపీ
- మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని వైసీపీ
- మళ్లీ టీడీపీ రావడంతో చిగురిస్తున్న ఆశలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పరిపాలనా రాజధాని అయితే, విజయవాడ శివారున ఉన్న జక్కంపూడిని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీకి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జక్కంపూడి కొండప్రాంతాన్ని ఎంచుకున్నారు. మూడు భారీ కొండలతో చుట్టూ దాదాపు 145 ఎకరాల ప్రభుత్వ భూమిలో జెట్‌సిటీ నిర్మాణాన్ని మొదలుపెట్టారు. ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసించేలా ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇళ్లను నిర్మించటంతో పాటు స్థానికంగానే ఇండస్ట్రియల్ కాంప్లెక్సులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 'వర్క్ అండ్ లివ్' విధానంలో తొలిదశలో ఇళ్లు, ఇండస్ట్రియల్ కాంప్లెక్సుల నిర్మాణం చేపట్టాలనుకున్నారు. ముందుగా 50 వేల ఎల్ఐజీ గృహాలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వ పీఎంఏవై పథకంలో భాగంగా డీపీఆర్‌ను ఆమోదించారు. టౌన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో)కు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఈ ఇళ్లకు లబ్ధిదారుడితో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా భరించేందుకు సిద్ధమైంది. మొత్తం మీద మొదటి దశలో 15 వేల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించి, తొలిదశలో 9 వేలకు టెండర్లు పిలిచారు. దాదాపు 6 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీటన్నింటినీ 90 శాతం పూర్తి చేశారు. మరిన్ని ఇళ్ల నిర్మాణాల కోసం భూములు అవసరమని గుర్తించి జక్కంపూడి, షాబాదలో 100 ఎకరాలను చూశారు. రైతులకు నష్టపరిహారం ఇచ్చి స్థలాలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు. ఇదే సమయంలో ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పనుల నిర్మాణాన్ని కూడా చేపట్టారు. తొలుత ఫుట్‌వేర్ ఇండస్ట్రీస్ కోసం కాంప్లెక్స్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. విజయవాడలోని ఫుట్‌వేర్ పరిశ్రమలన్నీ ఈ కాంప్లెక్సులోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాయి. స్పేస్ స్లాట్స్ కూడా కొన్నారు. ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. జెట్‌సిటీలో అటు ఇళ్ల నిర్మాణాలు, ఇటు ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ పనులు పురోగతిలో ఉన్న సమయంలో ఎన్నికలు వచ్చాయి.

వైసీపీ వచ్చాక సర్వనాశనం

అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జెట్‌సిటీని ఏడాది కాలం పట్టించుకోలేదు. ఆ తర్వాత జెట్‌సిటీ అనే కాన్సెప్ట్ లేదని తేల్చేసింది. టిడ్కో ఇళ్లు తప్ప మిగిలిన వాటిని రద్దు చేసింది. ఇళ్ల నిర్మాణ పనులను కూడా ఉపసంహరించుకుంది. అవినీతి జరిగిందంటూ విజిలెన్స్ కమిటీలను నియమించి కాలయాపన చేసింది. విజిలెన్స్ ఏమీ తేల్చకపోవటంతో రెండున్నరేళ్ల తర్వాత ఇళ్ల నిర్మాణ పనులు చేపడతామని ప్రకటించింది. ఆ తర్వాత మరో ఏడాది ఎలాంటి పనులు చేపట్టలేదు. మూడున్నరేళ్ల తర్వాత ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. మిగులు చేపట్టాల్సిన 3 వేల ఇళ్ల నిర్మాణాల్లో 1,500 మాత్రమే చేపట్టింది. గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన 6 వేల ఇళ్లలో టైల్స్, టాయ్‌లెట్స్, విద్యుత్, వాటర్ కనెక్షన్ పనులు ఉండగా, అవేమీ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దాదాపు 7,500 ఇళ్ల వరకూ సిద్ధమైనా, మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ కారణంగా ప్రజలు ఇప్పటికీ గృహ ప్రవేశాలు చేయలేదు. ఐదేళ్ల తర్వాత తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వైసీపీ ఛిన్నాభిన్నం చేసిన జెట్‌సిటీపై మళ్లీ ఆశలు నెలకొన్నాయి. రాష్ట్ర గృహనిర్మాణ శాఖతో సమీక్ష సందర్భంలో జెట్‌సిటీ పునరుద్ధరణ పనులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.





పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుతున్న టిడ్కో గృహ సముదాయాలు



చలో ముంబయి

ఎయిరిండియా డైలీ ఫ్లైట్ ప్రారంభం

- రాత్రి 7.10 గంటలకు ముంబయికి బయల్దేరిన కొత్త సర్వీసు
- ఘనంగా స్వాగతం పలికిన సిబ్బంది
- సర్వీసును ప్రారంభించిన మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : రాష్ట్ర రాజధాని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయికి శనివారం రాత్రి 7.10 గంటలకు కొత్త విమాన సర్వీసు బయల్దేరింది. 180 సీట్ల సామర్థ్యంతో ఉన్న ఈ ఎయిరిండియా డైలీ ఫ్లైట్‌ను మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని ప్రారంభించారు. తొలిరోజు ముంబయి నుంచి 153 మంది ప్రయాణికులు విజయవాడకు రాగా, ఇక్కడి నుంచి 142 మంది ముంబయి వెళ్లారు. శనివారం సాయంత్రం 5.55 గంటలకు ఈ విమానం ముంబయి నుంచి విజయవాడకు వచ్చింది. ఇది రన్‌వేపై ల్యాండ్ కాగానే, ఎయిరిండియా అధికారులు నీళ్లు చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు టెర్మినల్ బిల్డింగ్‌లో కేక్ కట్ చేశారు. ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని ముఖ్య అతిథిలుగా పాల్గొని విమాన సర్వీసును ప్రారంభించారు. ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లు అందించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వ రాకతో రానున్న రోజుల్లో రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతుందని, ఇక్కడికి విమాన సర్వీసులు పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆ దిశగానే విజయవాడ విమానాశ్రయం నుంచి ముంబయి సర్వీసు ప్రారంభించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సర్వీసులు తీసుకురావడానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. వారంలో రెండుసార్లు విశాఖపట్నం మీదుగా కోల్‌కతా, వారణాసి, షిర్డికి విమానాలు తిరిగేలా చూస్తామని, సింగపూర్, థాయిలాండ్, శ్రీలంకతో పాటు ఢిల్లీకి మరో రెండు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ ఇండిగో, ఎయిరిండియా సంస్థలతో మాట్లాడి, మరిన్ని సర్వీసులు పెంచే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. కొత్త టెర్మినల్ భవనం ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామని, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముంబయికి విమానం నడవడం ఆనందంగా ఉందని, ఢిల్లీకి విమాన సర్వీసులు పెంచడానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు.

రాష్ట్ర ఆదాయానికి చెక్ పెట్టారు

- రెండు నెలల క్రితం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల మూసివేత
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అనాలోచిత నిర్ణయం

భారీగా ఆదాయం కోల్పోతున్న రాష్ట్రం

6లో..

నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

6లో..

కట్టేసి.. కొట్టేసి..

ఎనికేపాడులో సినీ ఫక్కీలో చోరీ

- 12 కాసుల బంగారం, రూ.1.70 లక్షలు అపహరణ
- ముగ్గురు యువకుల కోసం పోలీసుల గాలింపు

గుణదల, జూన్ 15 : శుక్రవారం రాత్రి 9.30 గంటలు. ఓ కిరాణా షాపునకు ముగ్గురు యువకులు దర్జాగా నడుచుకుంటూ వచ్చారు. సిగరెట్లు కావాలని అడిగారు. షాపు యజమాని సిగరెట్లు ఇచ్చేలోపే.. లోపలికి ప్రవేశించి, యజమానిని, ఆయన భార్యను కొట్టేసి, కట్టేసి, ఇంట్లోని 12 కాసుల బంగారం, రూ.1.70 లక్షల నగదును దర్జాగా దోచుకుపోయారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఎనికేపాడులోని కేవీఆర్ కాలనీలో 23 ఏళ్లుగా పి.సత్యనారాయణ, ఆయన భార్య గోవిందమ్మ కిరాణా షాపు నడుపుతున్నారు. వీరి షాపు వెనుక భాగంలో ఇల్లు కూడా ఉంది. కాగా, శుక్రవారం రాత్రి ముగ్గురు యువకులు ఆ షాపు వద్దకు వచ్చారు. సిగరెట్లు కావాలని అడిగారు. ఇచ్చేలోపే సత్యనారాయణ వెనకగా వచ్చి పిడిగుద్దులు కురిపించారు. ఆయన్ను ఇంట్లోకి లాక్కెళ్లిపోయారు. చీరతో ఆయన చేతులు వెనక్కి కట్టేశారు. ఆ తర్వాత షాపు షట్టర్‌ను కిందకు లాగేశారు. అక్కడే ఉన్న గోవిందమ్మను గొంతు నొక్కేసి ఆమెను కూడా కట్టేశారు. అరిస్తే చంపేస్తామని బెదిరించారు. ఇంట్లో బంగారు ఆభరణాలు ఎక్కడ ఉన్నాయి, నగదు ఎక్కడ ఉంది.. అని అడిగి తెలుసుకున్నారు. భయపడిపోయిన భార్యాభర్తలు ఆ వివరాలు చెప్పడంతో 12 కాసుల బంగారం, రూ.1.70 లక్షల నగదు తీసుకున్నారు. సత్యనారాయణ, గోవిందమ్మ సెల్‌ఫోన్లు లాక్కుని, సిమ్ కార్డులు తీసేసి, షట్టర్ లేపి, దర్జాగా నడుచుకుంటూ వెళ్లిపోయారు. ఆ తర్వాత భార్యాభర్తలిద్దరూ కట్లు విప్పుకొని బయటకు వచ్చేసరికి అర్ధరాత్రి 2 గంటలైంది. ముందు దగ్గరలోని బంధువుల ఇంటికి వెళ్లి ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు, పటమట సీఐ మోహన్‌రెడ్డి శనివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట సీఐ తెలిపారు. ముగ్గురు యువకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.




చోరీ వివరాలు అడిగి తెలుసుకుంటున్న పటమట ఎస్ఐ సతీష్ కుమార్

అమృతం కాదని..

బందరు అభివృద్ధిని అడ్డుకున్న పేర్ని నాని

- అమృత్ నిధులు రూ. 57.33 కోట్లకు అడ్డుపుల్ల
- ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ రాకుండా అడ్డు
- జనాల సొమ్ముతో వైసీపీ కార్యాలయ నిర్మాణం
- నిబంధనలు పక్కనపెట్టి రూ.కోట్ల స్థలం స్వాహా
- నిర్మాణానికి రూ.5 కోట్ల పైచిలుకు ఖర్చు



బందరులోని వైసీపీ కృష్ణాజిల్లా కార్యాలయం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా వైసీపీ కార్యాలయం కోసం బందరు నడిబొడ్డున గజం రూ.40 వేలు పలికే ప్రాంతంలో సుమారు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈడేపల్లిలో జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న ఈ ఖరీదైన స్థలంలో ఆగమేఘాలపై ఇంద్రభవనంలాంటి వైసీపీ కార్యాలయాన్ని నిర్మించారు. దీనికోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయానికి వెయ్యి గజాల స్థలమే ఎక్కువని, అలాంటిది రెండెకరాల ఖరీదైన స్థలం కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాల కేటాయింపుపై ఆక్షేపణ లేకున్నా నగరం నడిబొడ్డున ఉండే ఖరీదైన స్థలాలు కేటాయించడంపై అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. కానీ, వాటిని వైసీపీ సర్కార్ బేఖాతరు చేసి జీవోలు విడుదల చేసింది.

బందరు అభివృద్ధికి మోకాలడ్డు

అమృత్ 2.0 కింద 2023, నవంబరులో సుమారు రూ.57.33 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో బందరు పట్టణంలో వెనుకబడిన వర్గాలు ఉండే కాలనీల్లో తాగునీటి సరఫరా, డ్రెయిన్ల నిర్మాణం, మురుగు, మంచినీటి చెరువు సమస్యలను పరిష్కరించుకోవాలి. రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఈ నిధులకు మోక్షం కలగలేదు. సాక్షాత్తూ అప్పటి ఎమ్మెల్యే, మాజీమంత్రి పేర్ని నాని ఈ నిధులకు మోకాలడ్డారు. అమృత్ 2.0 నిధులు మంజూరైనా వాటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ విడుదలైతేనే పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. కానీ, మ్యాచింగ్ గ్రాంట్ రాకుండా పేర్ని నాని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని అప్పటి వైసీపీ ఎంపీ బాలశౌరి వెల్లడించారు. కాగా, గత గురువారం సాయంత్రం ఎంపీ బాలశౌరి బందరు మున్సిపల్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష జరిపారు. ఆ సమీక్షలో అధికారులు అమృత్ 2.0 నిధులకు మోక్షం కలగని వైనాన్ని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆరా తీయగా, అధికారులు అసలు విషయాన్ని ఎంపీకి తెలిపి, రాజకీయ ఒత్తిళ్లతో తాము ఏమీ చేయలేని పరిస్థితి అని పేర్కొన్నారు.

> స్వకార్యాలను, అధినేత మెప్పు పొందే పార్టీ పనులను ఆగమేఘాలపై చేపట్టిన వైసీపీ నేతలు ప్రజలకు అవసరమైన వాటిని మాత్రం కక్షతో ఆపేసిన కథలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. బందరు పట్టణంలోని పేదల సమస్యలు తీర్చేందుకు విడుదలైన అమృత్ 2.0 నిధులకు మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకుండా అడ్డుకున్న మాజీ మంత్రి పేర్ని నాని.. అధినేత జగన్ మెప్పు కోసం ఇంద్రభవనాన్ని తలపించే వైసీపీ కార్యాలయ నిర్మాణాన్ని నిబంధనలు బేఖాతరు చేసి నిర్మించారన్న విషయం తాజాగా వెలుగుచూసింది.

జనాల సొమ్ముతో పార్టీ కార్యాలయం

మచిలీపట్నంలో నిర్మించిన వైసీపీ కార్యాలయానికి సుమారు రూ.5 కోట్లు వెచ్చించారని సమాచారం. ఈ మొత్తం సొమ్మును వ్యాపారుల నుంచి బలవంతంగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకున్న పేర్ని నాని.. అదే సమయంలో పార్టీ కార్యాలయాన్ని మాత్రం ఆగమేఘాలపై ఏడాదిలో పూర్తి చేయడం గమనార్హం. బందరును అభివృద్ధి చేస్తే ఆ క్రెడిట్ ఎంపీ ఖాతాలో పడుతుందనే ఆందోళనతో అసలు బందరులో అభివృద్ధి ఆనవాళ్లే లేకుండా చేసిన ఘనుడు పేర్ని నాని. బందరు పోర్టు నిర్మాణం విషయంలోనూ తొలి నాలుగేళ్లు సైలెంట్‌గా ఉండి, ఎన్నికల సంవత్సరంలో పనులు మొదలుపెట్టి, తామే బందరు పోర్టు నిర్మించేస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చి హడావిడి చేశారు. తీరా అక్కడ బండరాళ్లు తప్ప అసలు నిర్మాణాలే ప్రారంభానికి నోచుకోలేదు. సహచర ఎంపీ బాలశౌరితో ఉన్న రాజకీయ విభేదాలకు బందరు పోర్టును బలిపశువును చేశారని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. మచిలీపట్నంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) తప్ప మరో పెద్ద సంస్థ ఏదీ లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడిగా, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మచిలీపట్నం ఖ్యాతిని దశదిశలా చాటిన భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో స్మారక భవనం నిర్మించాలన్న ఆలోచనకు మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఊపిరి పోశారు. స్మారక భవనంతో పాటు మ్యూజియం, యువత ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా

- మిగతా 6లో

గుండెపోటుతో సీఐడీ ఎస్సై మృతి

పెనమలూరు, జూన్ 15 : కానూరు తులసీనగర్‌లోని సీఐడీ కార్యాలయంలో ఎస్సైగా పనిచేస్తున్న పీవీ రమణ (53) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై పీవీ రమణ స్వస్థలం కాకినాడ జిల్లా కోటనందూరు. ఇక్కడ ఒంటరిగా ఉంటూ ఉద్యోగం చేస్తున్నారు. గతంలో ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందారు. కాగా, శుక్రవారం ఉదయం ఆయన ఆఫీసుకు రాలేదు. సిబ్బంది ఎంతసేపు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వెళ్లి చూడగా, బాత్‌రూమ్‌లో స్పృహ కోల్పోయి కనిపించారు. దీంతో సిబ్బంది 108కి కాల్ చేయగా, వారు వచ్చి మృతిచెందినట్టు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



పీవీ రమణ (ఫైల్)



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గమ్మ సేవలో జస్టిస్ వి.శ్రీనివాస్

వన్‌టౌన్, జూన్ 15: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను శని వారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి దర్శిం చుకున్నారు. ఆలయ ఈవో కేఎస్ రామారావు, అధికారులు వారికి సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని ఈవో అందజేశారు.



మొక్కులు తీర్చుకునేందుకు మోపిదేవి గుడికి వస్తున్న టీడీపీ, జనసేన నాయకులకు పులిగడ్డ బ్రిడ్జి వద్ద స్వాగతం పలుకుతున్న మండలి వెంకట్రామ్

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందని

బాపట్ల జిల్లా నుంచి మోపిదేవికి పాదయాత్ర

మోపిదేవి/అవనిగడ్డ రూరల్, జూన్ 15: టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, బాపట్ల ఎమ్మెల్యేగా నరేంద్ర వర్మ గెలవడంతో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం నుంచి మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవ స్థానానికి శనివారం 100 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాద యాత్రగా తరలివచ్చి, స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం పులిగడ్డ బ్రిడ్జి వద్దకు చేరుకున్న వారికి నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంక ట్రామ్ ఘన స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. అక్కడ నుంచి మోపిదేవి వార్పు వద్దకు చేరుకున్నాక టీడీపీ, జనసేన నేతలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు రాక్షస పాలన సాగిందని, దేవుళ్లంతా కూటమిని అధికారం లోకి తెచ్చి రాక్షస సంహారం చేశారని పాదయాత్రగా వచ్చిన వారు పేర్కొన్నారు. మోపిదేవిలో రావి రత్నగిరి, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, భోగిరెడ్డి సాంబయ్య, ఉప్పాల యేసు, బల్లా సీతారామ ప్రసాద్ స్వాగతం పలికారు.

చేనేత సమస్యలు పరిష్కరించండి

పెడన, జూన్ 15: చేనేత శాఖ రాష్ట్ర మంత్రి సవితను చేనేత ప్రము ఖుడు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు శనివారం కలిశారు. చేనేత సమ స్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు రావాలని సవిత ఆహ్వానిం చగా శనివారం ఆమె నివాసంలో వేణుగోపాలరావు కలిశారు. చేనేత పరిశ్రమ ఎదు ర్కొంటున్న సమస్యలను మంత్రికి వేణుగోపాలరావు వివరించారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను ఆమెకు సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికుల సంక్షేమానికి అమలు చేసిన పథకా లను వి వరించారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. చేనేత పరిశ్రమపై రూపొందించిన సమగ్ర నివేది కను మంత్రికి వేణుగోపాలరావు అందజేశారు. మంత్రిని వేణుగోపాలరావు సత్కరిం చారు. మాజీ కౌన్సిలర్ యర్రా రాజా, చేనేత సంఘాల ప్రతినిధులు యక్కల నాగే శ్వరరావు, కుర్మా వాసు పాల్గొన్నారు.



మంత్రి సవితతో మాట్లాడుతున్న బొడ్డు వేణుగోపాలరావు

ఐదు సంతకాలతో మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

- టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 15: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ఐదు సంతకాలు చేసి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారా యణరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో 20 ఏళ్ల రాష్ట్రాభివృద్ధి వెనక్కి వెళ్లిందన్నారు. మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు నడుం బిగించారన్నారు. అన్ని రంగాల ప్రజలు టీడీపీ కూటమికి బ్రహ్మరథం పట్టారన్నారు.

సీతనపల్లి ప్రమాదంపై అధికారుల ఆరా

- ప్రమాద స్థలం, వాహనాల పరిశీలన

కృత్తివెన్ను, జూన్ 15: సీతనపల్లి వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై శని వారం ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం ఎలా జరిగింది. ప్రమాదానికి గల కారణాలు, వాహనాల పనితీరుపై విచారణ జరిపారు. రీజనల్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎన్.శివరామప్రసాద్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిద్దిక్‌లు ప్రమా ద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానిక ఎస్సై నాగరాజు నుం చి వివరాలు సేకరించి, ప్రాథమిక అంచనా వేశారు. అనంతరం స్టేషన్ పరిధిలోని వాహనాలను తనిఖీ చేశారు.



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలతో డీఈవో తాహెరాసుల్తానా

వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు

మచిలీపట్నం టౌన్, జూన్ 15: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా కృష్ణాజిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటే షన్ పోటీల్లో విజేతలకు శనివారం డీఈవో తాహెరాసుల్తానా బహుమతులు అంద జేశారు. విద్యాశాఖ కార్యాలయ సమావేశపు హాలులో బహుమతుల ప్రదానోత్స వాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ విభాగం నుంచి వ్యాసరచన పోటీలో పాల్గొన్న అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ కె.కృష్ణవేణి ప్రథమ బహు మతి అందుకున్నారు. జిల్లా సీఈ బోర్డు సెక్రటరీ షేక్ జాన్‌సాహెబ్, ఘంటసాల ఎంఈవో మోమిన్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకీర్‌అహమ్మద్, కో-ఆర్డినేటర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఎంఈవోలతో డీఈవో సమావేశం నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలను సమీక్షించారు.

చిన్న పంపుల చెరువుపై

చిన్నచూపు

కట్ట తెగి మూడేళ్లు ● మరమ్మతులు పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

గుడివాడ చిన్న పంపుల చెరువుపై గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం పట్టణవాసుల పాలిట శాపంగా మారింది. గుడివాడకు తాను శాశ్వత ఎమ్మెల్యేనని చెప్పుకొన్న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని పట్టణవాసుల నీటి కష్టాలను తీర్చాలనే ఆలోచన చేయలేదు. షాడో మంత్రిగా పేరు గాంచిన నాని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశి అప్పుడప్పుడూ అధికారులతో సమీక్షలు నిర్వహించినా చేసింది శూన్యం. నాని మంత్రిగా ఉండగానే చిన్న చెరువు కట్ట తెగింది. కానీ మరమ్మతులు చేయలేదు. మూడేళ్లవుతున్నా చెరువు కట్ట అభివృద్ధికి అతీగతీ లేదు. టెండర్ దశలోనే ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

- అంచనాలు వేసినా ఇంకా టెండర్ దశలోనే
- గుడివాడ శివారు ప్రజలకు ట్యాంకర్లే దిక్కు

గుడివాడ: పట్టణవాసుల నీటి అవసరాలను తీర్చేందుకు 48, 105 ఎక రాల విస్తీర్ణంలో రెండు పంపుల చెరువులున్నాయి. మూడేళ్ల క్రితం చిన్న చెరువు కట్ట తెగిపోయింది. దీంతో లక్షలాది లీటర్ల మంచినీరు కాలువలు, డ్రెయిన్ల పాలైంది. మంత్రిగా ఉన్న కొడాలి నాని మరమ్మతులు చేస్తామని హడావుడి చేశారు. వెంటనే అంచనాలను తయారు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అంచనాలు తయారైనా మూడేళ్ల నుంచి టెండర్ దశలో ఉందని అధికా రులు చెబుతున్నారు. కట్టకు మర మ్మతులు చేయడంపై కొడాలి నానీ శ్రద్ధ పెట్టలేదు. మున్సిపల్ అధికారులతో కట్టల పటిష్టతపై ఏనాడూ సమీక్ష జరిపింది లేదు. దీంతో ప్రభుత్వం, మున్సిపల్ అధికారుల్లో చలనం లేకుండాపోయింది.



వాటర్ ట్యాంకర్ వద్ద నీటి కోసం ప్రజల పాట్లు

కట్టల పటిష్టత అంతంతమాత్రమే

కట్టలు పటిష్టంగా లేకపోవడంతో పూర్తి సామర్థ్యంతో చెరువులను నిం పాల్సిన అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికే చిన్న చెరువు కట్ట తెగి ఉంది. పెద్ద చెరువు కట్ట పటిష్టతపైనా అనుమానాలున్నాయి. దీంతో అధికారులు పెద్ద చెరువు నీటి సామర్థ్యం 1686 మిలియన్ లీటర్లు కాగా, 11 అడుగుల మేర నింపారు. కట్ట పటిష్టతపైన అనుమానంతోనే పూర్తి స్థాయిలో నింపలేదని అధికారులు చెబుతున్నారు. చిన్న చెరువు పూర్తి నీటి సామర్థ్యం 634 మిలియన్ లీటర్లు కాగా, 200 మిలియన్ లీటర్లే నింపారు. కట్ట తెగడంతో అంతంతమాత్రంగానే నీటిని నింపుతున్నారు.

కనీస అవసరాలకు నీరివ్వలేపోతున్నారు

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలంటే రోజుకు 1.25 కోట్ల లీటర్ల నీరు అవసరం. దానికి అనుగుణంగా చెరువుల్లో నీటిని నింపుకోవాలి. చెరువు కట్టలు బలంగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయలేక పోతున్నారు. దీంతో తమకు నీరు అందడం లేదని శివారు ప్రాంత వాసులు గగ్గోలు పెడుతున్నారు. మునిసిపాలిటీ, స్వచ్ఛంద సంస్థలు అందించే నీరే దిక్కుగా మారిందంటున్నారు. పట్టణంలో టిడ్కో కాలనీ విలీనంతో నీటి కష్టాలు మరింత పెరిగాయి. రెండు రోజులకొకసారిని నీటిని సరఫరా చేసి నా కాలనీవాసులకు సరిపోవడం లేదు. వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.



తెగిపోయిన చిన్న పంపుల చెరువు కట్ట

మరో సంప్‌వెల్ అవసరం

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో హెడ్ వాటర్ వర్క్స్ వద్ద అండర్ గ్రౌండ్ సంప్‌వెల్‌ను నిర్మించారు. క్లోరినేషన్ అనంతరం నీటిని నిల్వ చేసేం దుకు మరో సంప్‌వెల్ అవసరముంది. పట్టణంలోని 9 ఎలివేటెడ్ రిజర్వా యర్ల ద్వారా పట్టణవాసులకు నీటిని అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో నింపకపోవడం, అవసరానికి తగ్గట్టుగా పంపింగ్ చేయలేకపోవడం, నిల్వ చేసుకునే వీలు లేకపోవడం, విద్యుత్ కోతలు వంటి కారణాలతో నీటిని అందించలేకపోతున్నారు. రెండు చెరువుల కట్టలను పటిష్ట పరచి పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు.

తాగునీటి సమస్య త్వరితగతిన పరిష్కరిస్తా

మంచినీటి కోసం పట్టణవాసులు పడుతున్న కష్టాలను ఎన్నికల ప్రచారంలో గమనించా. చిన చెరువు కట్ట తెగి మూడేళ్లవుతున్నా మరమ్మతులు చేయలేదు. మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని దీనిపై దృష్టి పెట్టలేదు. టెండర్లను త్వరితగతిన పిలిచి వెంటనే పనులు ప్రారం భిస్తాం. పంపింగ్‌కు అంతరాయం కలుగకుండా విద్యుత్ అధికారులతో మాట్లాడి నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తాం. మరో సంప్ వెల్ అవసరాన్ని గుర్తించాం. పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్య ఉత్పన్నమవ్వకుండా చూస్తాం.

- వెనిగండ్ల రాము, గుడివాడ ఎమ్మెల్యే

రాష్ట్ర ఆదాయానికి చెక్‌పెట్టారు

- రెండు నెలల క్రితం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల మూసివేత
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అనాలోచిత నిర్ణయం
- భారీగా ఆదాయం కోల్పోతున్న రాష్ట్రం
- గరికపాడు చెక్‌పోస్టుకు మూడుకిలోమీటర్ల దూరంలోని తెలంగాణలో యథావిధిగా నిర్వహణ

జగ్గయ్యపేట రూరల్, జూన్ 15: రెండు నెలల క్రితం అంత ర్రాష్ట్ర రవాణా చెక్‌పోస్టులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తొలగించింది. ఈ అనాలోచిత నిర్ణయంతో రాష్ట్రం రూ.లక్షల ఆదాయం కోల్పోతోంది. ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి వచ్చే వాహనాలు, రాష్ట్రం నుంచి బయటకు వెళ్లే వాహనాలు ట్యాక్స్ కట్టకుండానే రాకపోకలు సాగిస్తున్నాయి. 65వ నంబర్ జాతీయ రహదారి గరికపాడు సరిహద్దు చెక్‌పోస్టులో రోజుకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేది. జగ్గయ్యపేట పరిధి లోని సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి సిమెంట్, ఫ్లైయాష్, బొగ్గు తదితరాలను పరిమితికి మించి తరలిస్తుండటంతో రూ.లక్షల్లో ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడుతోంది. రాష్ట్రంలోకి వచ్చే వాహనాలు టెంపరరీ, పర్మినెంట్ ట్యాక్సులను చెక్‌పోస్టుల్లో చెల్లించేవారు. ఆ ఆదాయం రావడంలేదు. అధికారులు స్పం దించి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని, ప్రజలు కోరుతు న్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఒకే దేశం ఒకే పన్ను విధానంతో చెక్ పోస్టులు రద్దు చేశామని అప్పట్లో చెప్పినా, పక్కనున్న తెలంగాణలో మూడు కిలోమీటర్ల దూరంలో చెక్‌పోస్టు యథావిధిగా నడుస్తోంది.



మూతబడిన గరికపాడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు



మంత్రి కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కృష్ణాజిల్లాను అభివృద్ధిపథంలో నడుపుదాం

- అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 15: కృష్ణాజిల్లాను అన్ని రం గాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని తనను కలిసిన ప్రజా ప్రతి నిధులు, జిల్లా అధికారులుతో మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, బందరు ఎంఈవో దుర్గాప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజు తదితరులు మం త్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు కిట్ల పంపిణీపై ఎంఈవోతో మంత్రి చర్చించారు. మంత్రికి రంగనాయకస్వామి దేవా లయ కల్యాణోత్సవాల ఆహ్వానపత్రికను దేవదాయశాఖ ఈవో గోపా లరావు అందజేశారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ముక్తేవి రవికాంత్, టీడీపీ నాయకులు గుమ్మడి విద్యాసాగర్, కొరెడ్ల సుశీల శుభాకాంక్షలు తెలిపారు. పలువురు టీడీపీ, జనసేన నాయకులు రవీంద్రను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

గుణదల, జూన్ 15: గూడవల్లిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న బి.జా హ్నవి(17) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు పటమట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. "అనంతపురానికి చెం దిన బి.జాహ్నవి కళాశాల హాస్టల్‌లో శనివారం ఉదయం స్నానానికి బాత్రూంలోకి వెళ్లి ఎంతకీ బయటికి రాలేదు. దీంతో తోటి విద్యార్థి నులు కళాశాల సిబ్బందికి తెలియజేశారు. వారు అక్కడికి చేరుకుని బాత్రూం డోర్ బద్దలుకొట్టి స్పృహ కోల్పోయి ఉన్న జాహ్నవిని బయ టికి తీశారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని వైద్యులు నిర్ధారించారు. జాహ్నవికి గుండెపోటు గాని, బ్రెయిన్‌డెడ్ గాని జరిగి ఉండవచ్చని కళాశాల యాజమాన్యం తెలిపింది." అని పోలీసులు తెలిపారు. గుంటూరులో ఉంటున్న జాహ్నవి మేన మామ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని మృతి వార్త తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

భార్యపై కత్తితో దాడి..భర్త పరారీ

జి.కొండూరు, జూన్ 15: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసి పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం మైలవరం మండలం పొందుగల గ్రామానికి చెందిన ఈరి శెట్టి రంగారావుకు కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం మానికొండ గ్రామానికి చెందిన రత్నకుమారితో 20 ఏళ్లక్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి మధ్య కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. దీంతో జి.కొండూరు మండలం చెవుటూరులో ఉంటున్న తన అక్క వద్ద రత్నకుమారి తలదాచు కుంటోంది. శుక్రవారం భార్యను కాపురానికి పంపాలని చెవుటూరు వచ్చి రంగారావు గొడవకు దిగాడు. గొడవ జరుగుతుండగానే కత్తితో రత్నకుమారిపై దాడి చేసి, పరారయ్యాడు. గాయపడిన ఆమెను బం ధువులు చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): యూనియన్ పబ్లిక్ సర్వీసు క మిషన్(యూపీఎస్సీ) నేతృత్వంలో నగరంలో ఆదివారం సివిల్స్ ప్రిలి మినరీ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు 11,112 మంది అభ్య ర్థులు హాజరుకానున్నారు. 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల పర్యవేక్షణకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం 25 మంది రూట్ ఆఫీసర్లను, 25 మంది సహాయ సూపర్‌వైజర్లను నియమించింది.

గురుకుల విద్యాలయాల్లో

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, జూన్ 15: కృష్ణాజిల్లాలోని గురుకుల వి ద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేం దుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. 5వ తరగతిలో 58, 6లో 53, 7లో 50, 8లో 50 సీట్లు ఖా ళీగా ఉన్నాయని వివరాలకు గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పీవీ ఎస్ రాజేంద్రప్రసాద్‌ను 8712625035లో సంప్రదించాలన్నారు.



గోవధ నిషేధంపై పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

గోవులు, దూడల వధ నేరం

- 14 ఏళ్లు దాటి వ్యవసాయానికి, బ్రీడ్ అభివృద్ధికి పనికిరాని ఎద్దు, దున్న, గేదెల వధకు పశువైద్యుడి అనుమతి తప్పనిసరి
- కబేళాలోకి ఒక జంతువుతో ఇద్దరికి మాత్రమే అనుమతి
- నగర వీధుల్లో పశువధ చేసి, మాంసం విక్రయిస్తే చర్యలు
- బక్రీద్ సందర్భంగా మార్గదర్శకాల విడుదల

విద్యాధరపురం, జూన్ 15: గోహత్య నిషేధ చట్టం అమలులో ఉం దని గోవులు, దూడలను వధిస్తే కేసులు నమోదు చేస్తామని, అధికారులు హెచ్చరించారు. శనివారం భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోని ఫంక్షన్ హాలులో ఈనెల 17వ తేదీన బక్రీద్ సందర్భంగా భారీగా జంతుబలులు ఇచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ మార్గదర్శకాలను వివరిస్తూ భవానీ పురం పోలీస్‌స్టేషన్, శాంతి కమిటీల ఆధ్వర్యంలో గోరక్షణ సమితి సభ్యులు, ఆహార భద్రతా విభాగం అధికారులు, సిబ్బంది, సంబంధిత విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎద్దు, దున్న, గేదే వంటి వాటిని వధించాలంటే వాటి వయస్సు 14 ఏళ్లు దాటి ఉండాలని వ్యవసాయానికి, బ్రీడ్ డెవలప్‌మెంట్‌కు పూర్తిగా పనికిరాకపోతేనే వధించాలని, అందుకు ప్రభుత్వ వైద్యుడి సర్టిఫికెట్ తీసుకుని, ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాలోనే వధించాలని సూచించారు. రోడ్లపైన, ఇళ్లలో ఎక్కడపడితే అక్కడ పశువు లను వధించడం మాంసాన్ని విక్రయించడం నేరమని తెలిపారు. రెండేళ్ల లోపున్న, అనారోగ్యం సోకి ప్రమాదంలో మరణించిన పశువులను వధించరా దన్నారు. కబేళాలోకి ఒక జంతువును మాత్రమే తీసుకురావాలని దానితో పాటు ఒకరు లేదా ఇద్దరికి అనుమతి ఉంటుందని తెలిపారు. బక్రీద్ సందర్భంగా విజయవాడ వీధుల్లో పశువులను వధించి వాటి మాంసాన్ని వి క్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ సందర్భంగా పశువధ చేయడానికి విజయవాడ నగరపాలక సంస్థ కబేళాలో అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. అనధికార పశువధ జరగకుండా నగరపాలక సంస్థ వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. డీసీపీ హరికృష్ణ, ఏసీపీలు మురళీకృష్ణారెడ్డి, రత్నరాజు, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులపై వేధింపుల నివారణ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వృద్ధులకు ఆప్యాయత, ప్రేమానురాగాలు పంచుదాం

- వారిపై వేధింపుల నివారణకు పాటుపడదాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పిలుపు

కృష్ణలంక, జూన్ 15: "గొప్ప కుటుంబ వ్యవస్థకు నిలయమైన మన దేశంలో వృద్ధులపై వేధింపులు దురదృష్టకరం. వీటికి కారణాలను గుర్తించి, వేధింపులకు అడ్డుకట్ట వేద్దాం. వృద్ధులకు ఆప్యాయత, ప్రేమానురాగాలను పంచుదాం. వారి శ్రేయస్సుతోనే సమాజానికి ఉషస్సు" అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ, అవగాహన దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీనగర్‌లోని ఓ హోట ల్‌లో ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వృద్ధులు గౌరవప్రద జీవితానికి భరోసా కల్పి ద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టం-2007పై వయోవృద్ధులకు అవగాహన పెంపొందించి, వాటిని సద్వినియోగం చేసుకు నేలా చూడాలన్నారు. వేధింపులపై వృద్ధుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై డివిజన్ స్థాయిలో సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు సమావేశమై నాణ్యమైన చర్చలతో మంచి ఫలితాలు వచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరు బాబురావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, హెల్పేజ్ ఇండియా ప్రతినిధి లంకపల్లి మృణాల్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బి.కీర్తి, డాక్టర్ సీఎల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమృతం కాదని..

(ఐదో పేజీ తరువాయి)

స్కిల్ సెంటర్ ఏర్పాటు చేశాలన్న ఆలోచనతో ఆంధ్రాబ్యాంకును వి లీనం చేసుకున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతస్థాయి అధికారులతో బాలశౌరి పలుమార్లు సంప్రదింపులు జరిపారు. సుమారు రూ.70 కోట్లను మంజూరు చేయించారు. ఈ నిర్మాణ పనులకు మచిలీపట్నంలో రెండు ఎకరాలు కేటాయించాలని కోరినా పేర్ని నాని చివరి వరకు మోకాలడ్డుతూ వచ్చారు. స్మారక భవనం కోసం అడిగిన స్థలాన్నే పార్టీ కార్యాలయానికి కేటాయింపజేసుకుని అక్కడ ఆగమేఘాలపై నిర్మాణం చేపట్టారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తక్షణం అక్కడ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని నిర్మించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్లు నాని పగబట్టారు : బాలశౌరి, ఎంపీ, మచిలీపట్నం

మచిలీపట్నం ప్రజలు 2019లో ఓట్లు వేసి గెలిపించినందుకు మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని ప్రజలపై పగబట్టారని, బందరు అభివృద్ధి చెందకుండా ఐదేళ్లుగా కృషి చేశారని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. మచిలీపట్నంలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి తాను చొరవ చూపి కేంద్రం నుంచి ఓ బృందాన్ని తీసుకొచ్చేందుకు సిద్ధం కాగా, వారిని రానివ్వకుండా మాజీ ఎమ్మెల్యే నాని అడ్డుకున్నారని విమర్శించారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక ఆడిటోరియం నిర్మాణానికి స్థలం ఇవ్వకుండా వేధించారని, అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను నిలిపివేయించారని ఆరోపించారు. ఎంపీ నిధులకు సంబంధించిన పనులు ముందుకు సాగకుండా అప్పటి జిల్లా కలెక్టర్లపై ఒత్తిడి తీసుకొచ్చారని మండిపడ్డారు. వైసీపీ వాళ్లు వైనాట్ 175 నినాదంతో అభాసుపాలయ్యారని, కానీ తాము మచిలీపట్నం అభివృద్ధే లక్ష్యంగా వైనాట్ మచిలీపట్నం నినాదంతో అడుగులు వేస్తామని, గతంలో నిలిచిపోయిన అన్ని అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

మర్యాదపూర్వక కలయిక



అజిత్‌సింగ్‌నగర్, జూన్ 15 : రాష్ట్ర ప్రజలు విజ్ఞులని ధర్మం వైపు నిలబడి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేశారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ అన్నారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఆయన కార్యాలయంలో శుక్రవారం పరుచూరి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. వెనిగండ్ల రాముకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ గుడివాడలో గుట్కా నానిని ఓడించి వెనిగండ్ల రాము రికార్డు సృష్టించారని పేర్కొన్నారు.

వైసీపీ నేతల అక్రమాలపై కొరడా

● రెండు అక్రమ నిర్మాణాల తొలగింపు ● రాధానగర్‌లో ఆక్రమిత స్థలం స్వాధీనం



ప్రకాష్‌నగర్‌లో నందెపు జగదీష్ నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగించిన అధికారులు

పాయకాపురం, జూన్ 15 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు నేడు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలుచోట్ల వైసీపీ నేతలు అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా ప్రభుత్వ స్థలాలను సైతం కబ్జా చేశారు. అయితే నేడు తెలుగుదేశం ప్రభుత్వం కొలువుతీరగానే అధికారులు వైసీపీ నేతల అక్రమాలపై చర్యలకు దిగారు. శనివారం ఒక్కరోజే పాయకాపురం ప్రాంతంలో వైసీపీ నేతల అక్రమాలపై కొరడా ఝుళిపించారు. స్థానికంగా వైసీపీ నేతలు చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెండింటిని తొలగించగా మరోచోట ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

● **ప్రకాష్‌నగర్‌లో...**

స్థానిక ప్రకాష్‌నగర్‌లో నూజివీడు ప్రధాన రహదారిని ఆనుకుని వైసీపీ నేత నందెపు జగదీష్‌కు సంబంధించిన స్థలంలోని రెండో ఫ్లోర్ అనధికారికంగా నిర్మించినట్లు చాలా కాలంగా ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరగడంతో రెండో ఫ్లోర్‌లోని కొంత భాగాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. అలాగే సదరు భవనం పక్కనే స్థలంలో జగదీష్ చేపట్టిన నిర్మాణం ప్రభుత్వ స్థలంలో ఉందనే ఆరోపణలు పైగా అనుమతులు లేవన్న నేపథ్యంలో అధికారులు నిర్మాణాన్ని పూర్తిగా తొలగించారు.

● **రాధానగర్‌లో...**

రాధానగర్ ప్రాంతంలో రాజీవ్‌నగర్ కరకట్టను ఆనుకుని సుమారు 500 గజాల ఖాళీ స్థలం ఉంది. సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ స్థలాలకు సంబంధించి డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని స్థలం తమదేనంటూ పలువురు వైసీపీ సానుభూతిపరులు చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు విచారించి అది ప్రభుత్వ స్థలమే అని వైసీపీ సానుభూతిపరులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమణలకు పాల్పడినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ స్థలంగా గుర్తించబడిన 500 గజాల స్థలాన్ని జేసీబీలతో చదును చేయించిన అధికారులు స్థలాన్ని స్వాధీనపరచుకున్నారు. రేపో మాపో ఫెన్సింగ్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.



రాధానగర్‌లో ప్రభుత్వ స్థలంలో జేసీబీతో చదును చేస్తున్న అధికారులు

● **ఇది కక్షసాధింపు**

అయితే శనివారం జరిగిన అక్రమ కట్టడాల తొలగింపు, ప్రభుత్వ స్థలాల స్వాధీనం విషయంపై వైసీపీ నేతలు విభేదిస్తున్నారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యే అని వైసీపీ నేతలపై కక్ష సాధింపుల్లో భాగంగానే అధికార పార్టీ నేతలు ఈ చర్యలకు పూనుకున్నారని ఆరోపిస్తున్నారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

వన్‌టౌన్, జూన్ 15: దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే అన్నవితరణకు ఏలూరు ఆముదాల అప్పల స్వామి కాలనీకి చెందిన నక్కా వరప్రసాద్, ఆయన కుటుంబసభ్యులు శనివారం ఆలయానికి విచ్చేసి రూ.1,00,116లు ఈవో కేఎస్ రామారావు ద్వారా చెక్కును విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో దాతకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



ధర్మపథం వేదికపై స్మిత శ్రీపతి బృందం నాట్యప్రదర్శన

దుర్గగుడి ధర్మపథం వేదికపై శనివారం బెంగళూరుకు చెందిన ఆర్ధ కళామందిరం వారిచే భరతనాట్య ప్రదర్శన హృద్యంగా సాగింది. స్మిత శ్రీపతి బృందానికి చెందిన సుమారు 15 మంది కళాకారులు పాల్గొన్నారు.



బెంగళూరుకు చెందిన కళాకారుల నృత్యప్రదర్శన





ఘనంగా సుబ్బారెడ్డి వర్ధంతి

భారతీనగర్, జూన్ 15: భారతీనగర్ సర్వీస్ రోడ్డులోని రామకృష్ణ మార్బుల్ సెంటర్లో శనివారం ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు టి.సుబ్బారెడ్డి 5వ వర్ధంతి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రావాడ లక్ష్మణరావు పాల్గొని టి.సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పు నగర అధ్యక్షుడు, కార్యదర్శులు వీవీ రాజు, ఎన్. కోట బాబు, ముఠా నాయకులు ఈశ్వరరావు, మల్లేష్, ముఠా హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

భవానీపురం : కార్మికుల హక్కుల కోసం తన జీవితం చివరి ఘట్టం వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి టి. సుబ్బారెడ్డి అని సీఐటీయూ నాయకులు, సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్తిబాబు అన్నారు. సుబ్బారెడ్డి ఐదవ వర్ధంతి సందర్భంగా ఐరన్‌యార్డులో ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. సీతారాములు ఆధ్వర్యంలో సభ జరిగింది. బోయి సత్తిబాబు, యూటీఎఫ్ మాజీ నాయకులు తిరుపతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని నివాళి అర్పించారు. యూనియన్ నగర్ నాయకులు రోశయ్య, ఏ. వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, కె.వెంకట రమణ, రామారావు పాల్గొన్నారు.



సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, తదితరులు



షిర్డిసాయి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



షిర్డిసాయిబాబా సన్నిధిలో కుటుంబ సభ్యులతో గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 15 : షిర్డిసాయిబాబా ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆ సాయిబాబాను కోరుకున్నట్లు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమోఘమైన విజయం సాధించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని గద్దె రామ్మోహన్ తన కుటుంబ సభ్యులతో షిర్డీలోని సాయిబాబాను దర్శించుకున్నారు. తాను మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరుణంలో బాబా ఆశీస్సులు తీసుకున్నానని తెలిపారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని గద్దె ఆశాభావం వ్యక్తం చేశారు.

విజయదుర్గా దేవస్థానంలో సంప్రోక్షణ



వన్‌టౌన్, జూన్ 15: స్థానిక విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి వార్ల దేవస్థానం నాలుగవ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. సువర్చల-ఆంజనేయస్వామివార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. హోమాలు, బలిహరణలు సమర్పించారు. విమాన గోపురం, దేవతామూర్తులకు సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు దేవతా మూర్తులను సందర్శించుకున్నారు. దేవతామూర్తులను నూతన వస్త్రాలు, పుష్పమాలలతో అలంకరించారు.

ఎంఎస్ బేగ్‌కు శుభాకాంక్షలు



విద్యాధరపురం,జూన్ 15: టీడీపీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్‌ను శనివారం పార్టీ 39వ డివిజన్ అధ్యక్షుడు శివశర్మ, 45వ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ చక్రవర్తిలు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధికారంలోకి రావడానికి జరిగిన సమష్టి కృషి ఫలించిందని ఈ సందర్భంగా నాయకులు చర్చించుకున్నారు.



చెన్నుపాటి గాంధీ పుట్టినరోజు వేడుకలు

విద్యాధరపురం, జూన్ 15: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమక్షంలో గురునానక్ నగర్‌లోని ఎన్‌టీఆర్ భవన్‌లో శనివారం ఒక కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఆయన కేక్ కట్ చేశారు. శివనాథ్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గొట్టుముక్కల రఘురామరాజు, మాదిగాని గురునాథం, ఫతావుల్లా, షేక్ ఆషా, జంపాల సీతారామయ్య, కొట్టేటి హనుమంతరావు, నరసింహచౌదరి, ఎం అబీద్ హుసేన్‌లు గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి సాయంత్రం నుంచి కుళాయిల నీరు వాడొద్దు

వన్‌టౌన్, జూన్ 15: 28వ డివిజన్‌లోని భానునగర్ రోడ్డులో ప్రధాన మంచినీటి సరఫరా పైపులైన్‌ను శుభ్రం చేస్తున్నందున ఆదివారం(16వ తేదీ) సాయంత్రం 8 నుంచి సోమవారం (17వ తేదీ) సాయంత్రం 8 గంటల వరకు పైపుల నుంచి వచ్చే నీటిని ఉపయోగించవద్దని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటిని భద్రపరచుకుని పొదుపుగా వాడవలసిందిగా స్థానికులకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర తాగునీటిని ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తామని చెప్పారు. ప్రజలు గమనించాల్సిందిగా కోరారు.

ప్రభుత్వ ప్రతిష్ట పెంచేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలి

గవర్నర్‌పేట, జూన్ 15: ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం పేదలకు అందేలా వార్డు సచివాలయ సిబ్బంది పనిచేయాలని 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి కోరారు. టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువు తీరిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం సూర్యారావుపేటలోని టీడీపీ డివిజన్ కార్యాలయం వద్ద 97, 98 వార్డు సచివాలయ సిబ్బంది బాలస్వామిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ వార్డు సచివాలయ సిబ్బంది ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావివ్వని విధంగా ప్రజలకు సేవలు అందించాలని కోరారు.

మాదాసు రామారావు వీధిలో సమస్యలకు మోక్షం

భవానీపురం, జూన్ 15 : 45వ డివిజన్ మాదాసు రామారావు వీధిలోని అపరిష్కృత సమస్యలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆంధ్రజ్యోతిలో ఫిబ్రవరి 28న 'సమస్యలన్నీ ఇక్కడే' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. దశలవారీగా యూజీడి లైన్లు వేశాక, బీటీ రోడ్డును విస్తరించారు. తాజాగా కొద్ది రోజుల నుంచి రోడ్డు లెవెల్‌లో డ్రెయిన్ ఎత్తు పెంచే పనులు జరుగుతున్నాయి. చాలా కాలంగా అధికారులు చుట్టూ తిరిగి పనులు చేయించలేకపోయామని, ఆంధ్రజ్యోతిలో కథనంతో వీఎంసీ అధికారుల్లో కదలికి వచ్చిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సజావుగా మురుగునీటి పారుదలకు ఆపరేషన్ డీ సిల్టింగ్

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లను పరిశీలిస్తున్న నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్

వన్‌టౌన్, జూన్ 15: రోడ్లపైన మురికినీటితో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, వర్షపునీటి వల్ల ట్రాఫిక్ ఇక్కట్లను నివారించేందుకు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆపరేషన్ డీ సిల్టింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయిలో డీ సిల్టింగ్ పనులను, అవుట్ ఫాల్ డ్రెయిన్‌లను పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్, కండ్రిక నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు, డిస్నీల్యాండ్ మీదుగా రైల్వే ట్రాక్ దగ్గరకు వెళుతున్న సుమారు 10 కిలోమీటర్ల మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో జరుగుతున్న డీ సిల్టింగ్ పనులను పరిశీలించి సూచనలు చేశారు. రైల్వేశాఖ చేపట్టిన మూడవ లైన్ నిర్మాణం వల్ల డ్రెయిన్‌లో మురుగునీటిపారుదలకు ఆటంకం ఏర్పడడంతో రైల్వే వారితో మునిసిపల్ కమిషనర్ మాట్లాడి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు. ఈఈ శ్రీనివాస్, ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ విజ్ఞాన కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో నిర్మితమవుతున్న అందమైన ఆర్‌ఆర్‌ఆర్ విజ్ఞాన కేంద్రాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో నిర్మితమవుతున్న ఆర్‌ఆర్‌ఆర్ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎండోకంపోస్టింగ్ తదితర వివిధ అంశాలను త్రీడీ పద్ధతిలో ప్రత్యేకంగా విద్యార్థులకు, పిల్లలకు సమాచారాన్ని చూపించి అవగాహన పెంచడమే దీని లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వీడియో గేమ్ ప్రత్యేక ఆకర్షణ మాత్రమే కాకుండా అవగాహన కూడా కల్పిస్తుందన్నారు.

బేరియాట్రిక్ సర్జరీపై అవగాహన అవసరం

పటమట, జూన్ 15: ప్రజలందరికీ బేరియాట్రిక్ సర్జరీపై అవగాహన అత్యంత అవసరమని, ప్రముఖ బేరియాట్రిక్ వైద్య నిపుణులు డాక్టర్ కె.రవికాంత్ పేర్కొన్నారు. డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం వాసవ్యలో జరిగిన ఆరోగ్య సదస్సులో బేరియాట్రిక్ సర్జరీ అనే అంశంపై రవికాంత్ మాట్లాడారు. జీవనశైలిలో వచ్చిన మార్పులతో స్థూలకాయం సమస్యలు అధికంగా పెరిగిపోయాయని, చిన్న వయస్సు నుంచే వ్యాయామం లేకపోవడంతో స్థూలకాయం సమస్య అధికంగా తలెత్తుతుందన్నారు. అధిక బరువుతో మధుమేహం, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కొలెస్ట్రాల్, రక్తపోటు, కిడ్నీ సమస్యలు వంటివి తలెత్తుతాయని అన్నారు. స్థూలకాయంతో తలెత్తే ఆరోగ్య సమస్యలకు బేరియాట్రిక్ సర్జరీ ముఖ్యమైన పరిష్కారమని అన్నారు. సర్జరీ తర్వాత చాలా వరకు ఆ సమస్యలు తగ్గిపోతాయని అన్నారు. క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యశైలి జీవితకాలాన్ని పెంచుతుందని అన్నారు. స్థూలకాయం వల్ల 20-30 ఏళ్లకే మృత్యువుని ఆహ్వానించడం జరుగుతుందన్నారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే
లెదర్ టెక్నాలజీ

మనం పెట్టుకునే బెల్ట్, ఉపయోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్ళిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.



పాలిటెక్నిక్ డిప్లొమాలు

తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

- కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో భాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.
- దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిడాస్, రీబాక్, నైక్, హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్, ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ళ అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.
- డిమాండ్ అధికంగా ఉండటంతో కొందరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

ఉన్నత చదువులు: లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.

దిక్సూచి
DIKSUCHI

సింగరేణిలో
మేనేజ్‌మెంట్ ట్రైనీలు

ఖాళీలు 272

జాబ్ కార్నర్

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139**
2. మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: **22**
3. మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: **22**
4. మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), ఈ2 గ్రేడ్: **10**
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **10**
6. మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: **2**
7. మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), ఈ2 గ్రేడ్: **18**
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **3**
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: **30**

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టిఅండ్ ఎస్ గ్రేడ్-సి: 16

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 19

వెబ్‌సైట్: scclmines.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wdmtJDHలో చదవండి.

వర్కింగ్ స్టిల్‌తో ఉస్తాద్



పవన్‌కల్యాణ్, డైరెక్టర్ హరీశ్ శంకర్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. శనివారం డైరెక్టర్ హరీశ్ శంకర్ ఈ సినిమా వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేశారు.

మొక్కు తీర్చుకున్న సాయితేజ్

తన మేనమామ పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన సందర్భంగా హీరో సాయిదుర్గాతేజ్ తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. సాయిదుర్గాతేజ్, అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన విషయం తనకు తెలియదని ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో నిహారిక కొణిదెల అన్నారు



పవన్‌కు బహుమతి

పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచి.. ఇటీవలే ఉప ముఖ్యమంత్రి హోదానూ దక్కించుకున్నారు పవన్‌కల్యాణ్. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆయన తన అన్నయ్య చిరంజీవి ఇంటికి వెళ్లారు. అక్కడ చిరంజీవి సతీమణి సురేఖ పవన్‌కు విలువైన మాంట్‌బ్లాంక్ పెన్నును బహుమతిగా ఇచ్చారు. "తెలుగు ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తావని ఆశిస్తూ.. ఆశీర్వదిస్తున్నాం" అని చిరంజీవి, సురేఖ అన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి, సురేఖ, అన్నా లెజినోవా, పవన్ కలసి ఫొటో దిగారు.

'గరం గరం'




నాని సరికొత్త పాత్రలో నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డివివి దానయ్య కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న సినిమా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'గరం గరం' అంటూ సాగే ఈ పాటను విశాల్ దద్లానీ ఆలపించారు. సహపతి భరద్వాజ్ లిరిక్స్ అందించగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

'భైరవ యాంథమ్'



ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 ఏ.డీ' నుంచి ఓ ప్రోమో సాంగ్ విడుదలైంది. 'భైరవ యాంథమ్' అని సాగే ఈ పాటను భారతదేశపు అతిపెద్ద పాటగా మేకర్స్ తెలిపారు. 21 సెకండ్స్ పాటూ సాగిన ఈ ప్రోమో సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జిత్ దోసాంజే ఆలపించారు. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఈనెల 27న విడుదలవుతోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశాపటాని కథానాయికలు.

ఆగస్టులో ఇస్మార్ట్



రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఇది 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ.

మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా...



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వం వహిస్తున్నారు, పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ "ఇటువంటి ఫీల్ గుడ్ చిత్రాలు తీస్తున్నందుకు చిత్రబృందాన్ని అభినందిస్తున్నాను. ఈ మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని చెప్పారు. ఈ చిత్రానికి డీఓపీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.

ఈ విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది



సుధీర్‌బాబు నటించిన లేటెస్ట్ చిత్రం 'హరోంహర'. మాళవిక శర్మ ఇందులో హీరోయిన్‌గా నటించారు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సుబ్రమణ్యం.జి, సుమంత్ నాయుడు.జి మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా కథ వినగానే తండ్రీ కొడుకుల సెంటిమెంట్, కథానాయకుడి పాత్ర నన్ను బాగా ఆకర్షించాయి. వెంటనే సినిమాను నిర్మించడానికి ఒప్పుకున్నా. ఈ సినిమా విజయం ఎంతో ఆనందాన్నిస్తోంది. విడుదలైన అన్ని చోట్లా థియేటర్లు నిండిపోవడం చూసి ఎంతో ఆనందంగా ఉంది. మంచి సినిమా తీశామని ప్రేక్షకులు, మిత్రులు, ఇండస్ట్రీ పెద్దలు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. ప్రస్తుతం మూడు నాలుగు చిత్రాలు నిర్మిస్తున్నాం. వాటి గురించి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తాము" అని చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PySH7NE లో చదవండి.

ప్రేక్షకులు షాక్ అవుతారు



'నా జీవితంలో మరిచిపోలేని సినిమా 'ఎ'. 26 ఏళ్ల క్రితం ఈ సినిమా విడుదలవుతున్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నానో, ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నాను. ఈ నెల 21న ఈ చిత్రాన్ని తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నాం. థియేటర్లలో 'ఎ' సినిమాను చూసి ఇప్పటి ప్రేక్షకులు షాక్ అవుతారు' అని కన్నడ హీరో ఉపేంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఎ' చిత్రాన్ని నిర్మాత లింగం యాదవ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో ఉపేంద్ర పాల్గొన్నారు.

ఇక రాజకీయాల జోలికి వెళ్లను



ఇక నుంచి తాను రాజకీయ ప్రేరేపిత కథాంశాలతో సినిమాలు చేయనని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల చుట్టూ అల్లుకున్న వివాదాస్పద అంశాలతో పలు సినిమాలు చేస్తూ వార్తల్లో నిలిచారు వర్మ. ఇప్పుడు ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఆయన తోక ముడిచినట్లు కనిపిస్తోంది. తన సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాజకీయాలపై సినిమాలు చేయడం మానుకుంటున్నాను. ఇక నుంచి దేవుళ్లపై సినిమాలు చేస్తాను అని చెప్పారు.

అన్ని చోట్లా ఆదరిస్తున్నారు




కన్నడ హీరో యశ్ నటించిన ఓ చిత్రం తెలుగులో 'రాజధాని రౌడీ' పేరుతో విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మా 'రాజధాని రౌడీ' చిత్రాన్ని 94 కేంద్రాల్లో విడుదల చేశాం. అన్ని చోట్లా మంచి వసూళ్లు వస్తున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు.

9 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం ఆదివారం 16 జూన్ 2024

దక్షిణాది రాష్ట్రాల సినీ పరిశ్రమలపై తనదైన ముద్ర వేసిన వారిలో కన్నడ నటుడు **ఉపేంద్ర** ఒకరు. విలక్షణమైన శైలితో ప్రేక్షకులను ఆకట్టుకొనే ఉపేంద్ర 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.





నేను భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించను. అసిస్టెంట్ డైరక్టర్‌గా నా వృత్తి జీవితాన్ని ప్రారంభించినప్పుడు- సమాజానికి ఏదో ఒకటి చేయాలనుకొనేవాణ్ణి. అదొక కోణం. కానీ నేను ఎప్పుడూ రియాలిటీలోనే బతుకుతూ ఉంటా. అయితే ఏదో చేయాలనే తపన మాత్రం నన్ను వెంటాడుతూ ఉంటుంది. "రాజకీయాలు కలుషితం కాకూడదు.. దానిలో డబ్బు ప్రభావం ఎక్కువ ఉండకూడదు. అవినీతి ఉండకూడదు సమస్యలే ప్రధాన అంశాలుగా ఎన్నికలు జరగాలి. 'రైట్ టూ రీకాల్' అమలు చేయాలి" ఇలా అనేక ఆలోచనలు ఉంటాయి. పవన్ కళ్యాణ్ గారు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత- నన్ను రాజకీయాల్లోకి రమ్మని మా దగ్గర అనేకమంది అడిగారు. ఆయనకు నాకు తేడా ఉంది. ఆయనకు ఒకటే లక్ష్యం, ఆదర్శం. కానీ నా పరిస్థితి వేరు.

నాకు నేనంటేనే ఇష్టం

మీరు నటుడు, దర్శకుడు. ఈ రెండింటిలో మీకు ఏది ఎక్కువ ఇష్టం?

రెండూ ఇష్టమే! అంత కన్నా సినిమా నిర్మాణమంటేనే ఇష్టం. డైరక్షన్ అంటే.. ఒక సినిమాను మన ఆలోచనల నుంచి పుట్టించటం. దాని థ్రిల్లే వేరు. కానీ నటన మరో సముద్రం. డైరక్టర్ చెప్పినట్లు చేయాలి. నా ఉద్దేశంలో నటన కన్నా డైరక్షన్ ఎక్కువ థ్రిల్ ఇస్తుంది. అందుకే నేను రెండింటిలోనూ కొనసాగుతున్నా! ఐదేళ్లకు ఒకసారి డైరక్షన్ చేస్తూ ఉంటా!

మీరు నటించేటప్పుడు డైరెక్టర్‌లా ఆలోచిస్తారా?

నా ఉద్దేశంలో డైరక్టర్ చెప్పినట్లు నటుడు చేయాలి. నేను 'హెచ్‌టూఓ' అనే సినిమా చేసే సమయంలో ఏఎన్నార్‌గారిని - 'ప్రకృతి' అనే ఒక పాత్ర చేయమని అడగటానికి వెళ్లా.. కథ చెప్పా. ఆయనకు బాగా నచ్చింది. ఆ క్యారెక్టర్ ఎలా ఉండాలో నాకు చెబుతూ ఆయన ఊహాల్లోకి వెళ్లిపోయారు. తెల్ల గెడ్డం, తెల్లటి దుస్తులు, వెనుక కాంతి,అందమైన ప్రకృతి... ఇలా ఆ పాత్ర ఎలా ఉండాలో చాలాసేపు చెప్పారు. అయితే ఆయనకు అవుట్‌డోర్ షూటింగ్ చేసే ఓపిక లేదు. అందువల్ల ఆ పాత్ర చేయలేనన్నారు. ఆ సందర్భంలో- ఆయన కొన్ని గొప్ప మాటలు చెప్పారు. " నటుడిగా నాకు ఒక ప్రిన్సిపల్ ఉంది. నేను ఫిల్మ్ ఒప్పుకొనే ముందు కింగ్‌లా ప్రవర్తిస్తా. నాకు కావాల్సినవన్నీ అడుగుతా. ఎక్కడా రాజీ పడను. పూర్తిగా తృప్తి చెందితేనే సినిమా ఒప్పుకుంటా. అయితే ఒక్కసారి ఒప్పుకున్న తర్వాత నేను బానిసలా పనిచేస్తా..." అని అన్నారు.

> **నా కెరీర్‌లో అత్యంత కష్టమైన సినిమా 'రక్తకన్నీరు'. దాన్ని ఎం.ఆర్. రాజాగారు తమిళంలో చేశారు. కొద్దిగా మార్చి నేను కన్నడంలో చేశా. ఆ మేకప్, నటించే పద్ధతి అన్నీ భిన్నంగా ఉంటాయి.**



పరిశ్రమలో వారందరూ నేర్చుకోవాల్సిన విషయమది. ఆ మాటల్లోనే- ఆయన ఇంకో విషయం కూడా చెప్పారు. "గతంలో నా దగ్గరకు ఏదైనా మంచి స్క్రిప్ట్ వస్తే- అది నాకన్నా ఎన్టీఆర్‌కు బావుంటుందని అనిపిస్తే- దాన్ని ఆయన దగ్గరకు పంపేవాణ్ణి.. నేనే ఫోన్ చేసి స్వయంగా చెప్పేవాణ్ణి. ఆయన కూడా అలా చేసేవారు" అని అన్నారు. అందరూ వాళ్లిద్దరి మాదిరిగా ఉంటే చాలా బావుంటుందనిపిస్తుంది.

మీకు నటన అనేది సహజంగా వచ్చిందా? ఎక్కడైనా నేర్చుకున్నారా?

ఎక్కడా నేర్చుకోలేదు. ఎక్కడినుంచి వచ్చిందో నాకు తెలియదు. ఇక్కడ ఒక్క విషయం మీకు చెప్పాలి. నేను వేరే చిత్రాలను లేదా నటులను చూసి స్ఫూర్తి పొందను. ఇతరులు ఎవరూ చెప్పని సబ్జెక్ట్‌ను చెప్పాలని ప్రయత్నిస్తాను.

> **ప్రతి రోజూ మనం ఏదో ఒక విషయాన్ని నేర్చుకుంటేనే ఉండాలి. నా ఉద్దేశంలో ఇండస్ట్రీలో అందరికన్నా ప్రేక్షకులు చాలా తెలివైనవాళ్లు. ఒక్కసారి చూసి 'సినిమా బావుందా? లేదా?' అనే విషయాన్ని తేల్చేయగలుగుతారు. ఆ జడ్జిమెంట్ మనకు ఎప్పుడూ రాదు.**

కొవిడ్ తర్వాత... ఓటీటీ ఫ్లాట్‌ఫాంల ప్రవేశం తర్వాత సినిమా లాంగ్వేజ్‌లో మార్పు వచ్చిందా?

వచ్చింది. అయితే ఇది సహజమే! నేను సినీ రంగంలోకి ప్రవేశించిన కొత్తలో బడ్జెట్‌లు చాలా తక్కువ ఉండేవి. ఆ బడ్జెట్‌లోనే అందరినీ ఆకర్షించే సినిమాలు చేయాలని ప్రయత్నించేవాళ్లం. ఇప్పుడు కూడా అంతే! కొత్త దర్శకులు తమ సత్తా చూపించాలని ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ మధ్య కాలంలో పోటీ పెరిగింది. మార్కెట్ పెరిగింది. సమస్యలు పెరిగాయి. అన్నీ పెరుగుతూ వచ్చాయి. ఇవన్నీ కూడా సహజమైనవే!

> **కొన్ని పాత్రలకు ముందు హోంవర్క్ చేసుకుంటా. అయితే కెమెరా ముందుకు రాగానే హోంవర్క్ అంతా మర్చిపోతా.**

మీరు ట్రెండ్ సెట్టరా? ట్రెండ్‌ను ఫాలో అవుతారా?

నా వరకూ ఒక ట్రెండ్‌ను మొదలుపెట్టాలనుకుంటా. నేను నిజాయితీగా నాకు నచ్చినట్లు సినిమా తీస్తా. ఒక సినిమా హిట్ అయింది కాబట్టి ఆ తరహాలో తీయాలని ప్రయత్నించను. నా ఉద్దేశంలో సినిమాల విజయానికి ఒక ఫార్ములా లేదు. నిజాయితీగా... మనకు నచ్చిన సినిమా తీయటమే అసలైన ఫార్ములా!

మీ ఉద్దేశంలో విజయవంతమైన సినిమాల వెనకున్న ఫార్ములాలు ఏమిటి?

'వయస్సు అయిపోయింది కాబట్టి ఫిలాసఫీ చెబుతున్నాడు' అని మీరు అనుకోవచ్చు కానీ సినిమాలన్నీ కాలమాన పరిస్థితుల మీద ఆధారపడి ఉంటాయనిపిస్తుంది. ఒక్కసారి నా సినిమాలనే తిరిగి చూసుకుంటే- 'ఏ', 'ఉపేంద్ర', 'సూపర్' లాంటి సినిమాలు ఎలా చేశాను? అనిపిస్తుంది. స్టుపిడిటీ అనిపిస్తుంది. కానీ ఆ పరిస్థితుల్లో చేశానంతే! మీకో ఉదాహరణ చెబుతాను. ప్రస్తుతం మొబైల్ ఫోన్లు అందరి దగ్గరా ఉన్నాయి. మొబైల్‌ను నేనే ఆవిష్కరించానని ఒక శాస్త్రవేత్త చెప్పుకున్నాడనుకుందాం. నా ఉద్దేశంలో అది సత్యం కాదు. జనాభా పెరిగిపోయింది. ప్రజల మధ్య కమ్యూనికేషన్‌కు ఒక సమర్థమైన సాధనం కావాలి. దీని కోసం ప్రకృతే మొబైల్ ఫోన్ అనే సాధనాన్ని కనుగొనేలా చేసింది. మనం కేవలం టూల్స్ మాత్రమే!

ప్రస్తుత కన్నడ సినిమా పరిశ్రమ మీద మీ అభిప్రాయమేమిటి?

బాగా ఎదుగుతోంది. అయితే ఇక్కడ ఒక విషయం చెప్పాలి. పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఇండస్ట్రీ మారుతూ ఉంటుంది. ఒక భాషకు చెందిన సినిమా దేశవ్యాప్తంగా పెద్ద హిట్ అయిన వెంటనే- మిగిలిన వారందరూ - ఆ సినిమా వైపు చూస్తారు. కొద్ది కాలం తర్వాత మరో భాష సినిమా హిట్ అవుతుంది. ఇదంతా ఒక చక్రం.



మీకు ఇష్టమైన నటులు ఎవరు?

వాస్తవం చెప్పమంటారా... నాకు నేనంటేనే ఇష్టం. నేను కాకుండా- చిరంజీవిగారు, విష్ణువర్ధన్‌గారు, రజనీగారు... వాళ్లన్నా ఇష్టమే! ఎందుకంటే ప్రజలు వారిని అంతగా ఆదరించారంటే - వాళ్లలో ఏదో ఉన్నట్లే కదా!

● సీవీఎల్ఎన్ ప్రసాద్



ఎనర్జీ డ్రింక్స్‌తో హార్ట్ ఎటాక్?

ఈ మధ్యకాలంలో కొద్దిగా అలసటగా ఉన్నా ఎనర్జీ డ్రింక్స్‌ను తాగేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే లాభాల గురించి వచ్చే ప్రకటనలు కూడా చాలా ఆకర్షణీయంగా ఉండటంతో యువత వీటి వైపు ఆకర్షితులవుతున్నారు. అయితే తాజాగా అమెరికన్ హార్ట్ అసోసియేషన్ చేసిన కొన్ని అధ్యయనాలలో ఎనర్జీ డ్రింక్స్ తాగటం వల్ల హార్ట్ ఎటాక్‌లు వచ్చే అవకాశం ఉందని తేలింది.

సాధారణంగా ఒక క్యాన్ ఎనర్జీ డ్రింక్‌లో 80 నుంచి 500 ఎంజీల కెఫైన్ ఉంటుంది. కెఫైన్‌ను ఎక్కువగా సేవించటం వల్ల అలసట తొలగిపోయినట్లు అనిపిస్తుంది. దీనితో ఎక్కువ మంది యువత ఈ మధ్యకాలంలో ఎనర్జీ డ్రింక్స్‌ను తాగుతున్నారు. అయితే మన శరీరంలోకి ఒకే సారి ఇంత కెఫైన్ ప్రవేశిస్తే- ఆ ప్రభావం మన గుండె కొట్టుకొవటంపై పడుతుందని అధ్యయనంలో తేలింది. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కేవలం గుండెకు మాత్రమే కాకుండా.. ఇతర అవయవాలకు కూడా ప్రమాదం ఉంటుంది నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రమాదాలివే..

- ఎనర్జీ డ్రింక్స్‌లో ఎక్కువ సుగర్ ఉండటం వల్ల బరువు పెరుగుతారు. టైప్ 2 మధుమేహం వచ్చే అవకాశం కూడా ఉంది.
- ఇవి ఎక్కువ తాగితే ఆ ప్రభావం కిడ్నీలపై పడుతుంది.

ప్రత్యామ్నాయాలివే!

- కొన్ని సార్లు శరీరంలో ఆక్సిజన్ శాతం తగ్గటం వల్ల కూడా అలసటగా అనిపిస్తుంది. నీళ్లు తాగితే ఆ అలసట తొలగిపోతుంది.
- గ్రీన్‌టీ వల్ల శరీరానికి కొద్దిగా కెఫైన్ లభిస్తుంది. దీని వల్ల కొంత చురుకుగా పనిచేయగలుగుతారు.
- పళ్లు, డ్రైఫ్రూట్స్, పాలు, తేనెలతో చేసిన షేక్‌లను తాగటం వల్ల శక్తి లభిస్తుంది. దీనిలో ఉండే ప్రొటీన్ వల్ల ఈ శక్తి ఎక్కువ సేపు కూడా ఉంటుంది.

అవే గొప్ప పాఠాలు

రితికా సింగ్ అంటూనే 'గురు' సినిమా గుర్తొస్తుంది. ఆమె హీరోయిన్ కాకముందు.. కరాటేలో బ్లాక్‌బెల్ట్. కిక్ బాక్సర్‌గా రాణించింది. ఈ అమ్మడి గురించి కొన్ని విశేషాలు..

కర్లీ హెయిర్ కథానాయిక.. జిమ్ ఫొటోలతో, వీడియోలతో అలరిస్తుంటోంది. రితికా సింగ్ పూర్తి పేరు రితికా మోహన్ సింగ్. తన ఇన్‌స్టా పేజీకి 44 లక్షల మంది ఫాలోవర్లున్నారు. తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను ఇన్‌స్టాలో షేర్ చేస్తుంది రితికా. డ్యాన్సు వీడియోలు, మాస్కుతో పబ్లిక్‌లోకి వెళ్లి రైల్లో ప్రయాణం చేయటం.. లాంటివి చేస్తుంటుంది. ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉండటం.. చిన్నప్పటి నుంచే అలవడిందట.





అందుకే బాధపడేదాన్ని..

'మేము ముంబైలోని అవుట్‌కట్స్‌లో ఉండేవాళ్లం. కాలేజీకి వెళ్లటానికి రెండు గంటల సమయం పట్టేది మెట్రోలో. ఎక్కువగా కాలేజీ క్లాసులో కూర్చోలేకపోయేదాన్ని. ఎందుకంటే కరాటేనే నా ప్రపంచం. మూడేళ్ల వయసులో కరాటే నేర్చుకోవటం ప్రారంభించా. మా నాన్న, తాతయ్యలు కరాటే, బాక్సింగ్ ఫీల్డ్‌నుంచి వచ్చారు. కాబట్టి నాకు అబ్బింది. మా అన్న కూడా మార్షల్ ఆర్ట్స్‌లో ఉన్నారు. ఉదయాన్నే లేవటం.. వ్యాయామం చేయటం చేసేదాన్ని. మా నాన్నే నాకు స్ఫూర్తి. ఇకపోతే కాలేజీ రోజుల్లో స్పోర్ట్స్ నా మొదటి ప్రయారిటీ. నాకెవరూ స్నేహితులు కూడా ఉండేవాళ్లు కాదు. స్నేహితులు లేకపోవటం వల్ల బాధపడేదాన్ని. నేను చదువలను నెగ్లెట్ చేయలేదు. డిగ్రీ చదివా. చేసే పనిలో వందశాతం ఇవ్వాలి' అని అనుకుండేదాన్ని. రితికా సింగ్ నెగటివ్‌గా ఆలోచించే వాళ్లకు దూరంగా ఉండేదట. ఎవరూ మనకు ఏమీ చెప్పరు. తప్పులనుంచే తెలుసుకోవాలి. జీవితానుభవాలకు మించిన పాఠాలు ఉండవంటూ చెబుతుంది. అప్పుడప్పుడూ.. మోటివేషన్ స్పీకర్‌గా తన జీవిత విశేషాలను విద్యార్థులకు చెబుతుంటుందీమె.

అలా సినిమాల్లో అవకాశం..

'బాక్సింగ్ చేస్తుంటే నటుడు మాధవన్ గారు చూశారు. ఆయన రిఫరెన్స్‌తో 'ఇరుద చుట్రు' అనే బాక్సింగ్ నేపథ్యం కథలో నటించా. అనుకోకుండా సినిమాల్లోకి వచ్చాను' అంటుంది రితికా సింగ్. ఈ తమిళ సినిమా తెలుగులో 'గురు' పేరుతో రీమేక్ అయింది. విజయ్ సేతుపతితో ఓ సినిమాలో నటించింది. ఆ తర్వాత లారెన్స్ 'శివలింగ, 'నీవెవరు', 'ఓ మై కాదవులే' చిత్రాల తర్వాత 'ఇన్‌కార్' అనే హిందీ చిత్రంలో నటించింది. ముంబైలో పుట్టి పెరిగిన రితికా దక్షిణాది సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం తమిళ స్టార్ రజనీకాంత్ 'వెట్టయాన్' షూటింగ్‌లో ఉంది. 'స్టోరీ ఆఫ్ థింగ్స్' వెబ్ సిరీస్‌లో గతేడాది నటించింది. మిక్స్‌డు కిక్ బాక్సింగ్‌లో పతకాలే కాకుండా.. తొలి చిత్రంతోనే ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకుంది. 'సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా.. నిద్ర, వేళకు తినటం మర్చిపోను. ఎందుకంటే ఫిట్‌గా ఉండాలంటే ప్రణాళిక ఉండాలి. ఎంత బిజీగా ఉన్నా కనీసం పదిహేను నిముషాలు వర్కవుట్స్ చేయందే కుదరదు' అంటుంది రితికా సింగ్.




అలనాటి కథ

పవన్... శేషేంద్ర కవిత్వం



"నేను అంతా కలిపి పిడికిలి మట్టే కావచ్చు... కానీ గొంతు ఎత్తితే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరు ఉంది".. శేషేంద్ర రాసిన ఈ కవితా పంక్తులను తన ప్రసంగాలలో ఉటంకించారు జనసేన అధినేత పవన్ కల్యాణ్. ఈ మధ్య కాలంలో నాకు నచ్చిన రాజకీయ నాయకుల్లో పవన్ ఒకరు. సాధారణంగా సాహిత్యాన్ని బాగా చదువుకొన్న రాజకీయ నాయకులు ఇటీవల చాలా అరుదుగా కనిపిస్తున్నారు. వీరిలో పవన్ కల్యాణ్ ఒకరు కావటం... తను అధికారంలోకి రావటం చాలా ఆనందంగా అనిపించింది. ఆయనతో నేను ఎప్పుడూ నేరుగా మాట్లాడలేదు. కానీ ఉత్తరప్రత్యుత్తరాలు మాత్రం నడిచాయి.

ఒకప్పుడు రాజకీయ నాయకులు కేవలం చదువు మాత్రమే కాదు... సాహిత్యాన్ని కూడా చదువుకొనేవారు. ఇప్పటి తరం వారిలో చాలామందికి సాహిత్యంవల్ల కలిగే వికాసం తెలియకపోవచ్చు. కానీ మన సమాజ ఒరవడిని.. దానిలో వస్తున్న మార్పులను పసిగట్టేది సాహిత్యమే. కవిత్వం, కథలు, నవలలు, సాహితీ వ్యాసాలు... కేవలం కవి ప్రతిభను మాత్రమే కాదు.. అతను ఈ సమాజానికి ఏం చేయాలనుకున్నడానే విషయాన్ని కూడా తెలియజేస్తాయి. అందుకే గత కాలపు ఉద్యమాలకు సాహిత్యం ఒక ప్రధానమైన ఇరుసుగా ఉండేది. యువత కవితలను చదివి అర్థం చేసుకొనేవారు. స్ఫూర్తి పొందేవారు. రాజకీయ నాయకులకు కూడా సాహిత్యంపై అవగాహన ఉండేది. హైదరాబాద్ సంస్థానంలో ఎంతోమంది ప్రధానులు పేరుమోసిన కవులే. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాలలో నాయకులకు కూడా సాహిత్యం పట్ల అవగాహన ఉండేది. అందుకే ముఖ్యమంత్రులు, మంత్రులు... ద్యాన్‌బాగ్ ప్యాలెస్‌కు వచ్చిపోతూ ఉండేవారు. పి.వి.నరసింహారావు దగ్గర నుంచి అంజయ్య వరకు అనేక మంది నాయకులకు సాహిత్యం పట్ల అవగాహన ఉండేది. నేను అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో హిందీ అకాడమీ అధ్యక్షురాలిగా పనిచేశాను. ఆ సమయంలో మంత్రులను, ముఖ్యమంత్రులను కలవాల్సి వచ్చేది. వారు సాహిత్యానికి సముచిత ప్రాధాన్యం ఇచ్చేవారు. నిధులు విడుదల చేసేవారు. మంచి సాహిత్యాన్ని ప్రోత్సహించమని చెప్పేవారు. ఎన్టీఆర్ ప్రభుత్వంలో కళలకు మంచి ప్రాధాన్యం లభించింది. శేషేంద్రకు ఎన్టీఆర్ మిత్రుడు కావటంవల్ల సాహితీ విషయాలను చెప్పగలిగే సాన్నిహిత్యం ఉండేది. నాకు గుర్తున్నంత వరకు రాజకీయ నాయకులు తమ ప్రసంగాలలో కవితలను కోట్ చేసేవారు. కమ్యూనిస్టు పార్టీల నినాదాలన్నీ కవితాత్మకంగానే ఉండేవి. ఆ తర్వాత పరిస్థితులు మారాయి.



కొన్నేళ్ల క్రితం 'పవన్ కల్యాణ్ అనే యువ నాయకుడు శేషేంద్ర కవిత్వాన్ని తన ఉపన్యాసంలో ఉటంకించార'ని 'ది హిందూ'లో చదివా. అతను ఉటంకించిన వాక్యాలివి...

"నా అవయవాలకు నీచంగా వంగే భంగిమలు తెలియవు... నేను సత్యాగ్రహిని"

"సత్యం నా గుండెల్లో బద్దలవుతున్న అగ్నిపర్వతం... సత్యం నా గుండెల్లో గర్జిస్తున్న జలపాతం"

"నేను అంతా కలిపి పిడికిలి మట్టే కావచ్చు... కానీ గొంతు ఎత్తితే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరు ఉంది"

"సముద్రం ఒకడి కాళ్ల దగ్గర కూర్చుని మొరగదు... తుఫాన్ ఒకడికి చిత్తం అనడం ఎరగదు... పర్వతం ఎవ్వడికీ సలాం చేయదు"..

> **ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరిగిన తర్వాత నేను, ప్రిన్సెస్ ఇస్రా వంటి అనేక రాజ కుటుంబాల వారసులతో మాట్లాడాను. అందరూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ విజయాల పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. పవన్ తన స్వప్నాలకు సాకారం చేసుకుంటారని ఆశిస్తున్నా, త్వరలోనే ఆయనను జ్ఞాన్‌భాగ్‌లో కలుసుకొనే అవకాశం వస్తుందని ఆకాంక్షిస్తున్నా.**

ఆధునిక కవితా ప్రపంచంలో శేషేంద్రది ఒక అత్యుతన్నత స్థానమని అందరికీ తెలుసు. ఆ కవిత్వాన్ని పవన్ ఆకళింపు చేసుకొని.. దానిని ప్రజల వద్దకు సమయోచితంగా చేర్చటం నాకు ఆనందం కలిగించింది. వెంటనే ఆయన అడ్రస్సు తీసుకొని.. శేషేంద్ర కవిత్వాన్ని ఉటంకించినందుకు అభినందిస్తూ ఒక ఉత్తరం రాశాను. శేషేంద్ర రాసిన కొన్ని పుస్తకాలు పంపాను. ఆ తర్వాతి కాలంలో అనుకుంటా... శేషేంద్ర కవితా పుస్తకాన్ని ఆయన పునఃముద్రించారు. దీనికి అవసరమైన ధన సాయం ఆయనే చేశారని కొందరు చెప్పారు. శేషేంద్రపై ఎంతో అభిమానం లేకపోతే పుస్తకాన్ని పునఃముద్రించటానికి అవసరమైన ధనాన్ని పవన్ కల్యాణ్ ఎందుకు ఇస్తారు? ఈ విషయం నాకు ఆనందం కలిగించింది.

ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. సాధారణంగా రాజకీయ నాయకులు చాలా విషయాలు పట్టించుకోరు. వాటిలో ప్రజల నుంచి వచ్చే ఉత్తరాలు ప్రధానమైనవని నా నమ్మకం. కానీ పవన్ నాకు కృతజ్ఞతలు చెబుతూ ఒక ఉత్తరం రాశారు. 'ఇజం' అనే పుస్తకాన్ని కూడా పంపించారు. ఈ తరహా సంస్కారం ఉన్న వ్యక్తులు ఈ మధ్య కాలంలో అరుదుగా కనిపిస్తున్నారు. నేను పవన్‌తో ఎప్పుడూ మాట్లాడలేదు. కలవలేదు. కానీ మొన్న జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగాలను చాలా జాగ్రత్తగా విన్నాను. వాటిలో ఒక స్వాప్నికత ఉంది. ఆదర్శం ఉంది. భవిష్యత్తు కోసం ఒక ఆరాటం ఉంది. ప్రజల ఆశయాల పట్ల అవగాహన.. ఆర్ద్రత ఉన్నాయి. ఒక మంచి రాజకీయ నాయకుడికి ఇంత కన్నా గొప్ప లక్షణాలు ఏంకావాలి?

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

బిజినెస్

విజయవాడ ● ఆదివారం 16 జూన్ 2024

ఏడేళ్లు.. ఏడు లక్షల విక్రయాలు

» అమ్మకాల్లో టాటా నెక్సాన్ రికార్డు



ముంబై: టాటా మోటార్స్ ఎస్‌యూవీ నెక్సాన్ అమ్మకాల్లో రికార్డులు సృష్టిస్తోంది. ఏడేళ్ల కాలంలో నెక్సాన్ విక్రయాలు ఏడు లక్షల యూనిట్ల మైలురాయిని చేరుకున్నట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. టాటా మోటార్స్ 2017లో టాటా నెక్సాన్‌ను మార్కెట్లోకి విడుదల చేసినప్పటి నుంచి విక్రయాల్లో రికార్డులను తిరగరాస్తూ వస్తోందని పేర్కొంది. 2021 నుంచి 2023 వరకు వరుసగా మూడేళ్లపాటు నెక్సాన్ దేశంలో అత్యధికంగా అమ్ముడుపోయిన ఎస్‌యూవీగా ఉంది. డిజైన్, రక్షణ, కంఫర్ట్ విషయాల్లో నెక్సాన్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దటంతో కస్టమర్లను ఆకట్టుకోగలిగినట్లు టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవాత్సవ తెలిపారు. కాగా నెక్సాన్‌ను తీసుకువచ్చి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా మోడల్, వేరియంట్‌ను బట్టి రూ.లక్ష వరకు బెనిఫిట్స్‌ను అందిస్తున్నట్లు వివేక్ చెప్పారు.

ఐపీఓకి గోదావరి బయోరిఫైనరీస్

న్యూఢిల్లీ: ఇథనాల్, బయో ఆధారిత కెమికల్స్ తయారీ కంపెనీ గోదావరి బయోరిఫైనరీస్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా కొత్తగా రూ.325 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను జారీ చేయటంతో పాటు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 65.27లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,550 ▲	66,500 ▲	95,600 ▲
ముంబై	71,866 ▲	65,829 ▲	87,833 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	480
వరంగల్	492	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	విజయవాడ	145
వరంగల్	139	గుంటూరు	145
కరీంనగర్	139	ఒంగోలు	145
మహబూబ్‌నగర్	139	చిత్తూరు	152
కర్నూలు	139	నెల్లూరు	152
విశాఖపట్నం	136	అనంతపురం	145
గోదావరి	145		

ఐటీ రూటు మారింది..

ప్రాంగణ నియామకాలకు బదులు ఆఫ్ క్యాంపస్ హైరింగ్‌కు కంపెనీల మొగ్గు

నియామకాల సంఖ్య కన్నా నాణ్యతపై దృష్టి



దేశీయ ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాల విషయంలో వ్యూహం మార్చాయని స్టాఫింగ్ సేవల కంపెనీలంటున్నాయి. వీరిని ప్రాంగణ నియామకాలకు బదులు ఆఫ్ క్యాంపస్ ద్వారా రిక్రూట్ చేసుకుంటున్నాయి. నియామకాల సంఖ్య కంటే నాణ్యతపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయని.. దాంతో ఫ్రెషర్ల ఆఫ్ క్యాంపస్ హైరింగ్ కనీసం 30-50 శాతం పెరిగిందని, ఈ ఏడాది మరింత పుంజుకోవచ్చని స్టాఫింగ్ సంస్థలు పేర్కొన్నాయి. ఓపెన్ మార్కెట్ నుంచి హైరింగ్ ఈ ఏడాది 20-30 శాతం పెరగవచ్చని, ప్రస్తుతం 15-20 శాతం ఫ్రెషర్ల నియామకాలు ఆఫ్ క్యాంపస్ ద్వారానే జరుగుతున్నాయని టీమ్‌లీజ్ డిజిటల్ బిజినెస్ హెడ్ కృష్ణ విజ్ అన్నారు. గత ఏడాదితో పోలిస్తే, ఐటీ రంగంలో ప్రాంగణేతర నియామకాలిప్పటికే 50 శాతం పెరిగాయని, ఇది 125-150 శాతం వరకు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఈలిట్మస్ ఎవాల్యువేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అసీమ్ మార్వాహ అన్నారు.

వ్యయాలు తగ్గించుకునేందుకే..

ప్రస్తుతం ఐటీ సేవల డిమాండ్‌పై నెలకొన్న అనిశ్చితి ఇంకా తొలగిపోలేదు. ఈ నేపథ్యంలో ఆన్ బెంచ్ ఉద్యోగుల జీతభత్యాల వ్యయాలు తగ్గించుకునేందుకు ఐటీ కంపెనీలు ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల అవసరాల మేరకు ప్రాంగణేతర నియామకాలపైనే ప్రధానంగా దృష్టిసారించాయని స్టాఫింగ్ కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. అంతేకాదు, చాలా ఐటీ కంపెనీలు ప్రాంగణ నియామకాల్లో భాగంగా ఇప్పటికే ఆఫర్ లెటర్లను జారీ చేసిన వారిని ఉద్యోగంలో చేర్చుకునే ప్రక్రియనూ వాయిదా వేస్తూ వస్తున్నాయన్నారు. అలాగే, ఉన్న ఉద్యోగులనే సమర్థవంతంగా ఉపయోగించుకోవడంతో పాటు వారు మరో కంపెనీకి వలస పోకుండా కాపాడుకోవడంపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయి. ఈ ఏడాది ఇంజనీరింగ్ పూర్తి చేసుకుంటున్న 15 లక్షల మంది ఉద్యోగుల్లో కనీసం 10 శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం దక్కించుకోవచ్చని స్టాఫింగ్ కంపెనీలు తొలుత అంచనా వేశాయి. కానీ, ఈ వాటా 5-6 శాతానికి పరిమితం కావచ్చని అంచనా.

అనిశ్చితిలో 10,000 మంది ఫ్రెషర్ల భవితవ్యం

విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ఐటీ దిగ్గజాలతో పాటు జెన్సార్ టెక్నాలజీస్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ వంటి మధ్య స్థాయి ఐటీ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా నియమించుకున్న 10,000కు పైగా ఫ్రెషర్లను ఇంకా ఉద్యోగంలో చేర్చుకోలేదని ఐటీ ఎంప్లాయీ యూనియన్ ఎన్ఐటీఈఎస్ అంటోంది. ఈ విషయంలో ఇప్పటికే పలువురు ఫ్రెషర్ల నుంచి తమకు ఫిర్యాదులందాయని ఎన్ఐటీఈఎస్ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా అన్నారు.

కంపెనీ వ్యాపార అవసరాలకు అనుగుణంగా మిమ్మల్ని ఉద్యోగంలో చేర్చుకోబోయే తేదీపై 3-4 వారాల ముందుగానే సమాచారం అందిస్తామని ఇన్ఫోసిస్ ఈ మధ్యనే వీరికి ఈ-మెయిల్ పంపినట్లు తెలిసింది. విప్రో అయితే రెండేళ్ల క్రితం ఆఫర్ లెటర్లు జారీ చేసిన వారినీ ఇంకా ఉద్యోగంలో చేర్చుకోలేదు. టాప్ ఐటీ కంపెనీలు 2022లో ఆఫర్ లెటర్లు జారీ చేసిన వారిలో కనీసం 3-5 శాతం ఫ్రెషర్లను ఇంకా ఉద్యోగంలో చేర్చుకోవాల్సి ఉందని కృష్ణ విజ్ అన్నారు.

ప్రతిభ ఆధారంగా ప్యాకేజీ

ప్రస్తుతం ఐటీ రంగంలో ఫ్రెషర్లకు రూ.3-3.5 లక్షల స్థాయిలో వార్షిక పారితోషికం లభిస్తోంది. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఐటీ కంపెనీలు మాత్రం ఫ్రెషర్లందరికీ ఒకే స్థాయి పారితోషికానికి బదులు వారి ప్రతిభ ఆధారంగా భిన్న ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నాయి. టాలెంట్ టెస్ట్‌ల ద్వారా అత్యంత ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.6.5 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ వార్షిక పారితోషికాన్ని అందించేందుకు కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఉదాహరణకు, టీసీఎస్ పలు కేటగిరీల్లో ఫ్రెషర్లను నియమించుకుంటోంది. అందులో నింజా విభాగం వారికి రూ.4.5-6.5 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ ఆఫర్ చేస్తోంది. డిజిటల్ కేటగిరీలో రూ.7-8 లక్షలు, ప్రైమ్ విభాగం వారికి రూ.9 లక్షలు, అంతకు పైగా పారితోషికం అందిస్తోంది.

నిపుణులు దొరక్క కంపెనీలు సతమతం

ఐటీ రంగంలో ఆధునిక సాంకేతికత నైపుణ్యం కలిగిన వారు లభించక కంపెనీలు సతమతం అవుతున్నాయి. సరైన నిపుణులు దొరక్క. టీసీఎస్‌లో 80,000 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. దాంతో కంపెనీ కాంట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తోందని టీసీఎస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ హెడ్ అమర్ షెట్యే తెలిపారు. ప్రస్తుత ఉద్యోగుల నైపుణ్యాలు ప్రాజెక్టుల అవసరాల మేరకు లేకపోవడం, జాబ్ మార్కెట్లోనూ ఆధునిక సాంకేతిక నిపుణులు అందుబాటులో లేకపోవడంతో ఐటీ కంపెనీలు ఉద్యోగుల నైపుణ్యం పెంచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నాయి.

ఈఎంఐలు మరింత ప్రియం

» అన్ని కాలపరిమితి వడ్డీ రేట్లను 0.10 శాతం పెంచిన ఎస్‌బీఐ

» ఈ నెల 15 నుంచే అమల్లోకి..

న్యూఢిల్లీ: అన్ని కాలపరిమితుల రుణాలపై నిధుల సమీకరణ వ్యయ ఆధారిత వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను 0.10 శాతం పెంచుతున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ వెల్లడించింది. ఈ నెల 15 (శనివారం) నుంచే పెంపు అమల్లోకి వచ్చింది. దాంతో ఎంసీఎల్ఆర్ అనుసంధానిత రుణాల నెలవారీ వాయిదా (ఈఎంఐ) చెల్లింపుల భారం మరింత పెరగనుంది. ఎస్‌బీఐ ఏడాది కాల పరిమితి రుణాల ఎంసీఎల్ఆర్ రేటును 8.65% నుంచి 8.75 శాతానికి, రెండేళ్ల కాల పరిమితి రుణాల ఎంసీఎల్ఆర్‌ను 8.75% నుంచి 8.85 శాతానికి పెంచింది. మూడేళ్లకు ఎంసీఎల్ఆర్ 8.85% నుంచి 8.95 శాతానికి పెరిగింది. చాలావరకు గృహ, వాహన, వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు ఏడాది ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానితమై ఉన్నాయి. అయితే, వడ్డీ పెరుగుదల బ్యాంక్ జారీచేసిన ఎంసీఎల్ఆర్ అనుసంధానిత రుణాలకు మాత్రమే వర్తిస్తుంది. రుణాల వడ్డీ రేట్లను ఎంసీఎల్ఆర్‌కు బదులు రెపో రేటు లేదా మరే ఇతర మార్కెట్ రేట్లతో అనుసంధానించాలని బ్యాంక్‌లను ఆర్‌బీఐ 2019లో నిర్దేశించింది. అప్పటి నుంచి బ్యాంక్‌లు చాలావరకు రుణాలపై వడ్డీ రేట్ల నిర్ణయానికి రెపో రేటునే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

బ్రైట్‌కామ్ షేర్ల ట్రేడింగ్ నిలిపివేత

వరుసగా రెండు త్రైమాసికాల ఆర్థిక ఫలితాలు ప్రకటించనందువల్లే..

ముంబై: దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ.. హైదరాబాద్‌కు చెందిన డిజిటల్ మార్కెటింగ్ సొల్యూషన్స్ కంపెనీ బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్ల ట్రేడింగ్‌ను శుక్రవారం నుంచి నిలిపివేశాయి. జూన్ 14 నుంచి కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను నిలిపివేయనున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ గత నెల 15న ప్రకటించాయి. వరుసగా రెండు త్రైమాసికాల (2023 జూలై- సెప్టెంబరు, అక్టోబరు-డిసెంబరు) ఆర్థిక ఫలితాలను ప్రకటించడంలో కంపెనీ విఫలమైన కారణంగా క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2023 జూలై 11న జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్‌లోని 33వ నిబంధనకు అనుగుణంగా కంపెనీపై చర్యలు చేపట్టినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలు తమ సర్క్యులర్‌లో వెల్లడించాయి. నియంత్రణ మండలి నిబంధనలను పాటించేవరకు బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్ల ట్రేడింగ్‌పై సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేశాయి. అయితే, కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను రద్దు కానివ్వమని, ఈ నెల 11లోగా రెండు త్రైమాసిక ఆర్థిక ఫలితాలను విడుదల చేస్తామని బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్‌హోల్డర్లకు తెలిపింది. కానీ, కంపెనీ 11న జూలై-సెప్టెంబరు త్రైమాసిక (క్యూ2) ఫలితాలను మాత్రమే ప్రకటించగలిగింది. అక్టోబరు-డిసెంబరు (క్యూ3) ఫలితాల విడుదలపై మాత్రం స్పష్టతనివ్వలేదు. దాంతో స్టాక్ ఎక్స్ఛేంజీలు ముందుగా ప్రకటించిన ప్రకారం కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను సస్పెండ్ చేశాయి.

ఇరుక్కుపోయిన 6.56 లక్షల మంది రిటైల్ ఇన్వెస్టర్లు

ఈ సస్పెన్షన్ కాలంలో కంపెనీ ప్రమోటర్ వాటా షేర్లను స్తంభింపజేయడంతో పాటు తన డీమ్యాట్ ఖాతాలోని ఇతర సెక్యూరిటీలను సైతం స్తంభింపజేయడం జరుగుతుందని బీఎస్ఈ తెలిపింది. ప్రస్తుతం బ్రైట్‌కామ్ గ్రూప్‌లో ప్రమోటర్‌కు వాటా 18.38 శాతంగా ఉండగా.. మిగతా 81.62 శాతం వాటా పబ్లిక్ వాటాదారుల చేతుల్లో ఉంది. పబ్లిక్ షేర్‌హోల్డర్లలో 6.56 లక్షల మంది రిటైల్ మదుపరులే. వీరి చేతుల్లో కంపెనీకి చెందిన 41.69 శాతం వాటాకు సమానమైన షేర్లున్నాయి.

రూ.50,000 కోట్ల పెట్టుబడులు

2030-31 నాటికి ఉత్పత్తి సామర్థ్యం రెండింతలు పెంపు

కొత్త గనులకు బిడ్స్, కొనుగోళ్లపై నజర్: ఎన్ఎండీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థ ఎన్ఎండీసీ భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా రానున్న ఐదు నుంచి ఆరేళ్ల కాలంలో ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తిని రెండింతలు పెంచేందుకు గాను ఏకంగా రూ.50,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఎర్నింగ్స్‌కాల్‌లో సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ప్రతిపాదిత పెట్టుబడులతో గనుల విస్తరణ, గనుల్లో మరింత లోతుగా తవ్వకాలు చేపట్టేందుకు అనుమతులు తీసుకోవటంతో పాటు కొత్త గనులకు బిడ్స్ దాఖలు చేయటం సహా కొనుగోళ్ల చేపట్టాలని భావిస్తోంది. వీటితో పాటు కొత్తగా స్లర్రీ పైప్‌లైన్స్ ఏర్పాటు చేయటం సహా ఇతరత్రా కార్యకలాపాలను విస్తరించాలని చూస్తోంది.

10 కోట్ల టన్నులకు ఉత్పత్తి: ప్రస్తుతం ఎన్ఎండీసీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 4.5 కోట్ల టన్నులుగా ఉండగా 2030-31 నాటికి రెండింతల వృద్ధితో 10 కోట్ల టన్నులకు చేర్చాలని చూస్తున్నట్లు ముఖర్జీ వెల్లడించారు. ఇందుకోసం రూ.50,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా పెట్టుబడులకు సంబంధించి రానున్న ఆరేళ్ల కాలానికి ప్రత్యేకంగా రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ముఖర్జీ తెలిపారు. ఆ తర్వాతి సంవత్సరాల్లో ఏటా రూ.8,000 కోట్ల నుంచి రూ.9,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది కాలంలో ఈ పెట్టుబడులకు సంబంధించిన అన్ని అనుమతులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత పెట్టుబడుల్లో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు రూ.1,000 కోట్లు, స్లర్రీ పైప్‌లైన్స్‌కు రూ.10,000 కోట్లు, పెల్లెట్ ప్లాంట్స్‌కు రూ.2,000 కోట్లు, స్టాక్ యార్డుల ఏర్పాటుకు రూ.10,000 కోట్ల వరకు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్లు ముఖర్జీ చెప్పారు.

డిమాండ్ పెరుగుతోంది: దేశీయంగా స్టీల్‌కు డిమాండ్ పెరుగుతుండటంతో ముడి ఇనుప ఖనిజానికి అదే స్థాయిలో డిమాండ్ ఉండనుందని ముఖర్జీ తెలిపారు. ఇందుకనుగుణంగానే ఛత్తీస్‌గఢ్, కర్ణాటకల్లోని గనుల్లో ఉత్పత్తిని పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తిని 11% పెంచటం ద్వారా మొత్తం ఉత్పత్తిని 5 కోట్ల టన్నులకు, వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 5.4 కోట్ల టన్నులకు చేర్చాలని చూస్తున్నట్లు ముఖర్జీ పేర్కొన్నారు.

స్పోర్ట్స్

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

ఆస్ట్రేలియా × స్కాట్లాండ్ (ఉ.6. గం.)

పాకిస్థాన్ x ఐర్లాండ్ (రా.8. గం.)


స్మృతి మంధాన

అమ్మాయిలకు 'వన్డే' సవాల్

● సౌతాఫ్రికాతో భారత్ తొలి మ్యాచ్ నేడు

మ. 1.30 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో

బెంగళూరు: వన్డే ఫార్మాట్‌లో తడబడుతున్న భారత మహిళలు మళ్లీ గాడిలో పడేందుకు చక్కని అవకాశం. ఈ నేపథ్యంలో మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో ఆదివారం జరిగే తొలి వన్డేలో మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. గత జనవరిలో సొంతగడ్డపై ఆస్ట్రేలియా చేతిలో వన్డే, టీ20 సిరీస్‌ల్లో చిత్తయిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆ తర్వాత జరిగిన టీ20 సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను 5-0తో ఓడించింది. అక్టోబరులో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని స్వదేశంలో సౌతాఫ్రికాతో జరిగే సిరీస్‌తో జట్టులోని కొన్ని లోపాలను సరిదిద్దుకోవాలనుకొంటోంది. ఇటీవలి కాలంలో హర్మన్‌సేన ఫీల్డింగ్‌పై తీవ్ర విమర్శలు రావడంతో.. ఆ దిశగా ఎక్కువగా దృష్టిపెట్టినట్టు కోచ్ అమోల్ మజుందార్ చెప్పాడు. బ్యాటింగ్‌లో హర్మన్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ కీలకం. జెమీమా రోడ్రిగ్స్ ఫిట్‌నెస్ విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కానీ, గాయం నుంచి కోలుకొన్న పేసర్ పూజా వస్త్రాకర్‌కు తుది జట్టులో చోటుదక్కే అవకాశాలున్నాయి. యువ వికెట్ కీపర్ ఉమా ఛెత్రీని పరీక్షించే చాన్సుంది. పేసర్ రేణుకా సింగ్‌తోపాటు స్పిన్నర్లు ఆశా శోభన, శ్రేయాంక పాటిల్‌లతో బౌలింగ్ విభాగం కొంత బలంగానే కనిపిస్తోంది. మరోవైపు 2025లో వన్డే వరల్డ్‌కప్ జరగనున్న నేపథ్యంలో ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌తో మరిన్ని వన్డే చాంపియన్‌షిప్ పాయింట్లు సాధించాలని సౌతాఫ్రికా లక్ష్యంగా పెట్టుకొంది. కెప్టెన్ లారా వోల్వర్ట్ టాప్ ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం.

వర్షార్పణం

కెనడాతో భారత్ మ్యాచ్ రద్దు

గ్రూప్ 'ఎ' టాపర్‌గా సూపర్-8లోకి రోహిత్ సేన

టీ20 ప్రపంచకప్



లాడర్‌హిల్: ఫ్లోరిడాలో భారీ వర్షాలు టీ20 వరల్డ్‌కప్‌ను వెంటాడుతున్నాయి. స్థానిక సెంట్రల్ బ్రోవర్డ్ రీజనల్ పార్క్ స్టేడియంలో వరుసగా రెండో మ్యాచ్ కూడా వర్షార్పణమైంది. శనివారం గ్రూప్ 'ఎ'లో భాగంగా భారత్-కెనడా జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కనీసం టాస్ పడకుండానే ముగిసింది. శుక్రవారం యూఎస్-ఐర్లాండ్ మ్యాచ్ కూడా వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే. ఈ గ్రూప్‌లో ఏడు పాయింట్లతో రోహిత్ సేన టాప్‌లో ఉండగా.. ఆతిథ్య యూఎస్ఏ ఐదు పాయింట్లతో ఆ తర్వాత స్థానంలో నిలిచింది. ఇక సూపర్-8లో ఈనెల 20న బ్రిడ్జిటౌన్‌లో ఆఫ్ఘాన్‌తో భారత్ తలపడనుంది. కెనడాతో ఆడాల్సిన పోరు నామమాత్రమే అయినా.. కరీబియన్ వెళ్లడానికి ముందు భారత్‌కు ఇది చక్కటి మ్యాచ్ ప్రాక్టీస్ లభించినట్టయ్యేది. వాస్తవానికి మ్యాచ్ సమయానికి వర్షం ఆగిపోయినా అవుట్ ఫీల్డ్ మాత్రం పూర్తి చిత్తడిగా మారింది. అప్పటికీ సిబ్బంది భారీ హెయిర్ డ్రయర్స్‌తో పొడిగా మార్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆకాశం మేఘావృతంగా ఉండడంతో సూర్యుడి వెలుతురు కరువైంది. అటు అంపైర్లు రెండుసార్లు పరీక్షించినా ఆడేందుకు అనుకూలంగా కనిపించలేదు. దీంతో రాత్రి 9 గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	4	3	0	1	7	1.137
అమెరికా	4	2	1	1	5	0.127
కెనడా	4	1	2	1	3	-0.493
పాకిస్థాన్	3	1	2	0	2	0.191
ఐర్లాండ్	3	0	2	1	1	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు



ఆటను మరిచి.. వ్యాపారంపై దృష్టి?

గిల్‌పై క్రమశిక్షణ చర్య!

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్న భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ స్వదేశానికి రానున్నాడు. అయితే క్రమశిక్షణ చర్యల కారణంగానే అతడిపై బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుందన్న కథనాలు వెలువడ్డాయి. అమెరికాలో అడుగుపెట్టాక గిల్ జట్టుతో ఉండకుండా, ప్రాక్టీస్‌కు రాకుండా వ్యక్తిగత బిజినెస్ ప్రాజెక్ట్‌లపై ఎక్కువగా దృష్టి సారించాడని సమాచారం. పాకిస్థాన్‌తో మ్యాచ్ సమయంలోనూ ఇతర రిజర్వ్ ప్లేయర్లు రింకూ, అవేశ్, ఖలీల్ కనిపించినా.. గిల్ మాత్రం ఎక్కడా లేడు. ఈ నేపథ్యంలో కెప్టెన్ రోహిత్-గిల్ మధ్య వాగ్వాదం జరిగిందని, అందుకే రోహిత్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అన్‌ఫాలో చేశాడని అంటున్నారు. యూఎస్‌లో మ్యాచ్‌లు ముగిశాయి కాబట్టి ఆదివారం గిల్‌తో పాటు అవేశ్ ఖాన్ స్వదేశానికి వస్తుండగా.. రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్ అక్కడే ఉండనున్నారు. మరోవైపు ఇలాంటి కథనాలు అవాస్తవమని, గిల్‌పై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.


ఫుల్‌క్రగ్

జర్మనీ.. సూపర్ బోణీ

యూరో చాంపియన్‌షిప్

మ్యూనిచ్: యూరోపియన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య జర్మనీ అద్భుత బోణీ కొట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో గత టోర్నీ రన్నరప్ జర్మనీ 5-1తో స్కాట్లాండ్‌ను చిత్తు చేసింది. విర్ట్ (10వ నిమిషం), ముసీలా (19), హవెర్ట్జ్ (45+1), ఫుల్‌క్రగ్ (68), కాన్ (90+3) జర్మనీ తరఫున గోల్స్ చేశారు. స్కాట్లాండ్‌కు ఏకైక గోల్ అప్పనంగా లభించింది. జర్మనీ ఆటగాడు ఆంటోనియా రుడిగెర్ సెల్ఫ్ గోల్‌తో స్కాట్లాండ్‌కు గోల్ అందించాడు. ఇక.. ప్రత్యర్థి ఆటగాడిని మొరటుగా అడ్డుకోవడంతో స్కాట్లాండ్ డిఫెండర్ ర్యాన్ రెడ్‌కార్డ్‌కు గురయ్యాడు. దీంతో ఆ జట్టు 10 మందితోనే ఆడింది. ఇదే గ్రూప్‌లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 3-1తో హంగేరీపై గెలిచింది. గ్రూప్-బిలో జరిగిన పోరులో స్పెయిన్ 3-0 గోల్స్ తేడాతో క్రొయేషియాపై విజయం సాధించింది.

సఫారీలు చచ్చీ..చెడీ


షంసీ (4/19)

పరుగు తేడాతో విజయం

చెమటలు పట్టించిన నేపాల్

కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్): అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత విజయాన్ని దక్కించుకొనే అరుదైన అవకాశాన్ని పసికూన నేపాల్ జట్టు త్రుటిలో చేజార్చుకుంది. టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా శనివారం ఉత్కంఠగా జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో బలమైన సౌతాఫ్రికాకు నేపాల్ ముచ్చెమటలు పట్టించింది. చివరకు ఒక్క పరుగు తేడాతో గెలిచి సఫారీలు ఊపిరి పీల్చుకున్నారు. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. ప్రత్యర్థి బౌలర్లు కుషాల్ (4/19), దీపేంద్ర (3/21) ధాటికి 20 ఓవర్లలో 115/7 స్కోరుకే పరిమితమైంది. హెన్‌డ్రిక్స్ (43), స్టబ్స్ (27 నాటౌట్) మాత్రమే రాణించారు. ఛేదనలో నేపాల్ 20 ఓవర్లలో 114/7 స్కోరు మాత్రమే చేయగలిగింది. ఓపెనర్ ఆసిఫ్ (42) సత్తా చాటాడు. అనిల్ (27)తో కలిసి మూడో వికెట్‌కు ఆసిఫ్ 50 పరుగులు జోడించాడు. నాలుగు వికెట్లు తీసిన షంసీ (4/19) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. మ్యాచ్ చివరి బంతి రెండు జట్లను హైటెన్షన్‌కు లోను చేసింది. రెండు పరుగులు చేస్తే నేపాల్ సంచలన విజయం అందుకునే పరిస్థితి. కనీసం ఒక్క రన్ చేసినా మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీస్తుంది. కానీ టీనేజర్ గుల్షన్ ఝా (6) ఒక్క పరుగు తీసే క్రమంలో రనౌటవడంతో సౌతాఫ్రికా సంబరాలు చేసుకోగా..నేపాల్ ఆటగాళ్లు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఓటమితో టోర్నీ నుంచి నేపాల్ నిష్క్రమించగా, ఇప్పటికే సూపర్-8కి చేరిన సఫారీలు గ్రూపు దశను ఓటమి లేకుండా ముగించారు.

సంక్షిప్త స్కోర్లు: సౌతాఫ్రికా: 20 ఓవర్లలో 115/7 (హెన్‌డ్రిక్స్ 43, స్టబ్స్ నాటౌట్ 27, కుషాల్ భుర్టెల్ 4/19, దీపేంద్ర 3/21); **నేపాల్:** 20 ఓవర్లలో 114/7 (ఆసిఫ్ షేక్ 42, అనిల్ సా 27, కుషాల్ 13, షంసీ 4/19).

పాయింట్ల పట్టిక — గ్రూప్-సి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
అఫ్ఘానిస్థాన్	3	3	0	0	6	4.230
వెస్టిండీస్	3	3	0	0	6	2.596
న్యూజిలాండ్	3	1	2	0	2	-0.241
ఉగాండా	4	1	3	0	2	-4.510
పీఎన్‌జీ	3	0	3	0	0	-0.886

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

గ్రూప్-డి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	4	4	0	0	8	0.470
బంగ్లాదేశ్	3	2	1	0	4	0.478
నెదర్లాండ్స్	3	1	2	0	2	-0.408
నేపాల్	3	0	2	1	1	-0.293
శ్రీలంక	3	0	2	1	1	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

కివీస్ తొలి గెలుపు

9 వికెట్లతో ఉగాండా చిత్తు

టరోబా (ట్రినిడాడ్): వరల్డ్‌కప్ రేసు నుంచి అవుటైన న్యూజిలాండ్ ఎట్టకేలకు ఓదార్పు విజయాన్ని అందుకొంది. గ్రూప్-సిలో శనివారం జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో న్యూజిలాండ్ 9 వికెట్లతో పసికూన ఉగాండాపై రికార్డు విజయం సాధించింది. అఫ్ఘానిస్థాన్, వెస్టిండీస్ చేతిలో ఓడిన కివీస్‌కు టోర్నీలో ఇదే తొలి గెలుపు. పేసర్లు ట్రెంట్ బౌల్ట్ (2/7), 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' టిమ్ సౌథీ (3/4) నిప్పులు చెరగడంతో.. తొలుత ఉగాండా 18.4 ఓవర్లలో 40 పరుగులకే కుప్పకూలింది. కెన్నెత్ వైస్వా (11) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. కాగా, పొట్టి కప్‌లో ఇది రెండో అత్యల్ప స్కోరు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో ఉగాండా 39 పరుగులకే ఆలౌటైంది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని న్యూజిలాండ్ 5.2 ఓవర్లలో 41/1 స్కోరు చేసి గెలిచింది. మిగిలి ఉన్న బంతుల (88) పరంగా టీ20ల్లో కివీస్‌కిది ఇది భారీ విజయం కాగా.. పొట్టి కప్‌లో మూడోది.

సంక్షిప్త స్కోర్లు: ఉగాండా: 18.4 ఓవర్లలో 40 ఆలౌట్ (కెన్నెత్ 11; సౌథీ 3/4, బౌల్ట్ 2/7); **న్యూజిలాండ్:** 5.2 ఓవర్లలో 41/1 (కాన్వే 22 నాటౌట్; రియాజత్ అలీ 1/10).



ఇదే నా చివరి వరల్డ్‌కప్: బౌల్ట్

తనకు ఇదే చివరి ప్రపంచకప్ అని న్యూజిలాండ్ వెటరన్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ ప్రకటించాడు. 2011లో జట్టులోకి వచ్చిన 34 ఏళ్ల బౌల్ట్.. అనతికాలంలోనే కీలక సభ్యుడిగా ఎదిగాడు. మూడు టీ20 వరల్డ్‌కప్‌ల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అయితే, న్యూజిలాండ్ తరఫున ఎంతకాలం ఆడతాడనే దానిపై అతను స్పష్టత ఇవ్వలేదు.



బ్రిక్స్ గేమ్స్‌లో టీటీ బృందానికి కాంస్యం

న్యూఢిల్లీ: బ్రిక్స్ గేమ్స్‌లో భారత మహిళల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు కాంస్య పతకం సాధించింది. శనివారం రష్యాలోని కజాన్‌లో జరిగిన ఈ టోర్నీ టీటీ సెమీఫైనల్స్‌లో మౌమిత దత్త, యశిని శివశంకర్, పోమంటి బైస్యాతో కూడిన భారత త్రయం 1-3 తేడాతో చైనా జట్టు చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. కేంద్ర నూతన క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవ్య భారత జట్టును అభినందించారు.

ఫైనల్లో సుమిత్ నగల్



పెరూగియా (ఇటలీ): భారత టెన్నిస్ సింగిల్స్ స్టార్ సుమిత్ నగల్ వరుసగా రెండో ఏటీపీ చాలెంజర్ టైటిల్ నెగ్గేందుకు అడుగుదూరంలో నిలిచాడు. గతవారం జర్మనీలో టైటిల్ అందుకున్న సుమిత్ తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తూ పెరూగియా చాలెంజర్ టోర్నమెంట్‌లోనూ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో ఆరోసీడ్ సుమిత్ 7-6(7-2), 1-6, 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ ఆటగాడు బెర్నాబె జపాట మిరాలెస్‌ను ఓడించాడు. లూసియానో దార్‌డెరి (ఇటలీ), డానియెల్ ఆల్ట్‌మెయిర్ (జర్మనీ) మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో సుమిత్ ఫైనల్లో తలపడతాడు.

జగన్ ఇంటి గుట్టు!

> గత ప్రభుత్వంలో అధికారులు నియమ నిబంధనలు, మార్గదర్శకాలను ఉల్లంఘించి మరీ జగన్ ప్యాలెస్‌కు కోట్లు ఖర్చు చేశారు. అక్కడున్న పేదలను తరిమేసి మరీ ఆయనకు రాజభోగాలు కల్పించారు. ఖర్చు చేసిన ఆ 45 కోట్లతో ముఖ్యమంత్రికి శాశ్వత ఆధునిక భవనాన్ని నిర్మించవచ్చు.

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లకుండానే ఇంటి నుంచే వ్యవహారం నడిపించారు. ముఖ్యమంత్రి భద్రత కోసం ఎంత ఖర్చు చేసినా ఎవరూ తప్పుపట్టరు. కానీ ఆడంబరాల పేరిట జగన్ తన ఇంటి పరిసరాలను, ఇంట్లోని మౌలిక వసతులను అత్యంత ఖరీదైనవిగా మార్చుకున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఏడాదే... 2019లో రోడ్లు భవనాల శాఖ ఆయన ఇంటికి అదనపు ఏర్పాట్ల పేరిట 18 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. 2020లో మరో 10 కోట్లు ఖర్చు పెట్టింది. తన ఇంటిపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చుపై బయట చర్చ జరుగుతోందని భావించిన జగన్ నిధుల విడుదలకు సంబంధించిన జీవోలు బయటకు రాకుండా చేశారు. దీంతో తాడేపల్లి ఇంటిపై పెట్టిన 28 కోట్ల రూపాయల ఖర్చులో 13 కోట్లకు సంబంధించిన జీఓలు ఇవ్వలేదు. వీవీఐపీ సెక్యూరిటీ ఏర్పాట్ల పేరిట ఆర్‌అండ్‌బీతో అడ్డగోలుగా నిధులు ఖర్చు పెట్టించారు. 2022లో 8 కోట్లు, 2023లో 6 కోట్లు, ఆయన హయాంలో చివరి ఏడాది 2024లో 3.50 కోట్లు ఖర్చు చేశారు. తాడేపల్లి ప్యాలెస్‌లో వివిధ రకాల హంగులు, ఆర్భాటాలు, సెట్టింగుల పేరిట ఆర్‌అండ్‌బీతో ఈ మేరకు వ్యయం చేయించిట్లు తెలిసింది. నిధులు భారీగా ఖర్చు పెట్టడానికి నిబంధనలు, మార్గదర్శకాలు అడ్డున్నా ముఖ్యమంత్రి కావడంతో అధికారులు అత్యుత్సాహం చూపారు. సీఎం ఇంటిచుట్టూనే మరో ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నం చేయడం కోసం గత ఐదేళ్ల కాలంలో మొత్తం 45.54 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిసింది. ఇందులో 15 కోట్ల వ్యయానికే ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చారు. మిగిలిన వ్యయానికి సంబంధించి మెమో, ఇతర రూపాల్లో ఉత్తర్వులు ఇచ్చి నిధులు మంచినీళ్లప్రాయంలా ఖర్చు పెట్టారు. ఖరీదైన సోఫాలు, కుర్చీలు, వీడియో, టెలీకాన్ఫరెన్స్ పరికరాలు, ప్లాస్మా, 85 ఇంచుల ఓఎల్‌ఈడీ టీవీలు, ప్రీవియం కేటగిరీకి చెందిన ఆపిల్ కంప్యూటర్లు, ఇతర సామగ్రిని క్యాంపు ఆఫీసుకు సమకూర్చిపెట్టారు.

అడ్డగోలుగా ఖర్చు

తాడేపల్లిలో జగన్ నివాసం కొత్తదే. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడే ఎన్నికల ముందు 2019లో గృహప్రవేశం చేశారు. కోట్లాది రూపాయల వ్యయంతో అందమైన ప్యాలెస్ నిర్మించుకున్నారు. అదే ఏడాది అధికారంలోకి వచ్చాక తన ఇంటిని క్యాంపు ఆఫీసుగా మార్చుకున్నారు. ఆ తర్వాత మూడు రాజధానుల డ్రామాను తెరమీదకు తీసుకొచ్చారు. అమరావతిలోని సచివాలయానికి వెళ్లకుండానే ఇంటినే ముఖ్యమంత్రి కార్యాలయంగా మార్చేశారు. జగన్ ఆదేశాలతో ఆయన నివాసం, క్యాంపు ఆఫీసు, దాని పరిసరాలను అభివృద్ధి చేసేందుకు నాటి ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఇంజనీరింగ్ అధికారులు ఎక్కడాలేని ఉత్సాహం కనబరిచారు. జగన్ చెప్పినవి, చెప్పని పనులు కూడా చేసి పెట్టారు. జగన్ కూడా తనకు ఎక్స్‌ట్రార్డినరీ సరంజామా ఉండాలని షరతులు విధించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారి సూచనతో నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కనపెట్టి అడ్డగోలుగా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టారు. నిజానికి ముఖ్యమంత్రి నివాసానికి భద్రత నిమిత్తం, ఇతర అవసరాల పేరిట ఎంత ఖర్చు చేయాలన్నదానికి నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. అయితే ఆర్‌అండ్‌బీలో చక్రం తిప్పిన ఓ ఉన్నతాధికారి జగన్ సేవలో తరించిపోయారు. బిల్డింగ్ విభాగంలో ఉన్న సొమ్మంతా ఊడ్చేశారు. వీవీఐపీ ఏర్పాట్ల పేరిట గుట్టుగా ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన తర్వాత ఆర్‌అండ్‌బీకి వచ్చిన ఓ జూనియర్ అధికారి కూడా జగన్ సేవలో తరించేందుకు తాపత్రయపడ్డారు. జగన్ తన తాడేపల్లి ప్యాలెస్ నిర్మాణం కోసం ఎంత ఖర్చు పెట్టుకున్నారో ఎవ్వరికీ తెలియదు. కానీ ఆ ఇంటికి అదనపు హంగులు, రక్షణ ఏర్పాట్లు, సెట్టింగ్‌ల పేరిట ప్రభుత్వం 45.54 కోట్లపైనే ఖర్చు పెట్టింది.

ఇంకా జగన్ ఆధీనంలోనే

జగన్ ఇప్పుడు అధికారంలో లేరు. ఎన్నికల్లో ఆయన పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. కనీసం ప్రతిపక్షహోదా దక్కించుకునే సీట్లు కూడా జగన్‌కు రాలేదు. దీంతో ఆయన ప్రతిపక్షనేత కూడా కాదు. సాధారణ ఎమ్మెల్యే గానే ఉండాల్సిన పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్, పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్‌క్వాలిఫికేషన్స్ యాక్ట్-1953 ప్రకారం జగన్ తన ఇంట్లో, క్యాంపు ఆఫీసులో ప్రభుత్వ ఖర్చుతో సమకూర్చుకున్న చరాస్తులన్నింటిని వెనక్కి ఇచ్చేయాలి. వాటిని సొంత ఆస్తులుగా వాడుకోవడానికి వీల్లేదు. ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన ఏ వస్తువునూ తన వద్ద ఉంచుకోకూడదని చట్టంలోని రెండో క్లాజులో స్పష్టంగా ఉంది. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చి పది రోజులు గడుస్తున్నా జగన్ ప్రభుత్వ ఆస్తితో జల్సా చేస్తున్నారు. కోట్లు విలువచేసే ఫర్నీచర్, టెక్నికల్, డిజిటల్ ఎక్విప్‌మెంట్, ఇతర పరికరాలను ఆయన వాడుకుంటున్నారు. తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఆయన మీటింగ్‌లు పెట్టుకొని వాటిని వాడుకుంటున్నారు. విలువలు, పద్ధతుల గురించి పదేపదే ఉపన్యాసాలు ఇచ్చే జగన్‌కు.. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రభుత్వ ఆస్తులను తిరిగి ఇచ్చేయాలన్న ఆలోచన రాలేదా? పార్టీ ఆఫీసును మూసేసి, క్యాంపు ఆఫీసు వేదికగా ప్రభుత్వ వనరులను వాడుకోవడంపై రాజకీయ పార్టీలు, ప్రజలు తీవ్ర అభ్యంతరం చెబుతున్నారు.

- కొత్తగా నిర్మించిన జగన్ ఇంటికి అల్యూమినియం కిటికీలు, దృఢమైన చెక్క తలుపుల ఏర్పాటుకు రూ.73 లక్షలు ఖర్చు చేశారు.
- జగన్ 2019లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే ఆయన నివాసం వద్ద 3.66 మీటర్ల రహదారి (పొడవు 1.33 కి.మీ.)ని 10 మీటర్లు వెడల్పు చేసేందుకు రూ.5 కోట్లు ఖర్చు చేశారు.
- జగన్ రక్షణ కోసం ఆయన ఇల్లు, పరిసరాల్లో తదుపరి చర్యలకు 1.89 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంటి వద్దే ప్రత్యేక హెలీప్యాడ్, దానికి ఫెన్సింగ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం రూ.40 లక్షలు, హెలీప్యాడ్ వద్ద గార్డ్ రూమ్, ఇతర సదుపాయాల కోసం రూ.13.50 లక్షలు, సీఎం నివాసం వద్ద పర్మినెంట్ బ్యారికేడింగ్ ఏర్పాటుకు రూ.75 లక్షలు, సీఎం ఇంటికి సమీపంలోనే పోలీస్‌బారెక్ సదుపాయాల కోసం రూ.30 లక్షలు, సెక్యూరిటీ పోస్ట్, సెక్యూరిటీ గేట్లు, క్యాబిన్‌ల ఏర్పాటుకు రూ.31 లక్షలు ఖర్చు చేశారు.
- అత్యాధునిక విద్యుత్ వ్యవస్థ, లైట్లు, సీసీటీవీ సదుపాయం, యూపీఎస్ ఏర్పాటు కోసం రూ.3.63 కోట్లు ఖర్చు పెట్టారు. అత్యాధునిక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, హెచ్‌టీ లైన్, ఆధునిక లైటింగ్ సిస్టమ్‌కు అదనంగా మరో 97 లక్షలు కేటాయించారు.
- అత్యాధునిక ఏసీల ఏర్పాటుకు కోటిన్నర ఖర్చు పెట్టారు. జగన్ ఇంటితో పాటు క్యాంపు ఆఫీసు బయట లైటింగ్ కోసం రూ.11.50 లక్షలు ఖర్చు చేశారు. హైదరాబాద్ సచివాలయంలోని ఎల్‌బ్లాక్‌లో ఉన్న యూపీఎస్‌ను తొలగించి దాన్ని జగన్ ఇంట్లో ఏర్పాటు చేశారు. ఇందుకు 11 లక్షలు ఖర్చు చేశారు.
- ప్రజాదర్బార్ ఏర్పాటు పేరిట 82.50 లక్షలు కేటాయించారు. అయితే ఆ నిధులను ఇతర అవసరాలకు ఖర్చు పెట్టినట్లు తెలిసింది.

ఖర్చుల పద్దు ఇదీ

- క్యాంపు ఆఫీసులో తాత్కాలికంగా పీవీసీ రూఫ్ (షెడ్లు), మొబైల్ టాయిలెట్స్, కూలర్‌ల కొనుగోలుకు రూ.22.50 లక్షలు ఖర్చుపెట్టారు.
- భద్రత చర్యల్లో భాగంగా వ్యాకట్టర్ ఏర్పాటు పేరిట ప్రైవేటు భూమిని సేకరించారు. ఈ భూవికి పరిహారంగా 3.25 కోట్లు విడుదల చేశారు.
- క్యాంపు ఆఫీసులో అత్యాధునిక వీడియో కాన్ఫరెన్స్, టెలీకాన్ఫరెన్స్ సిస్టమ్‌ల కోసం 3.45 కోట్లు ఖర్చుపెట్టారు. 85 ఇంచీల ఓఎల్‌ఈడీ టీవీల కొనుగోలుకు కోటిన్నరదాకా ఖర్చుపెట్టినట్లు తెలిసింది.
- ఐప్యాడ్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర డిజిటల్ ఎక్విప్‌మెంట్ కోసం మరో 45 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు పెట్టినట్లు సమాచారం.
- క్యాంపు ఆఫీసు, ఇంట్లో అవసరాల నిమిత్తం వీవీఐపీ ఏర్పాట్ల పద్దు కింద 4.5 కోట్ల విలువైన సోఫాలు, కుర్చీలు, రిక్లైనర్‌లు, లాంజ్ సోఫాలు సమకూర్చినట్లుగా ఆర్‌అండ్‌బీ అధికార వర్గాలు చెబుతున్నాయి.
- క్యాంపు ఆఫీసు పరిధిలో జరిగే సమావేశాల కోసం 1.37 కోట్ల విలువైన టేబుల్స్, ఇతర ఫర్నీచర్‌ను సమకూర్చినట్లుగా ఆర్‌అండ్‌బీ లెక్కలు చెబుతున్నాయి.
- ఆలయాల సెట్టింగ్‌ల పేరిట 1.45 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది.
- క్యాంపు ఆఫీసులో కళాప్రదర్శనలు, ఇతర ఆర్భాటాల పేరిట 1.67 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం.
- జగన్ ఇంటి చుట్టూ ఉన్న రహదారిని విస్తరించడం కోసం పేదల ఇళ్లను ఖాళీ చేయించారు. వారికి పరిహారం కింద 7.67 కోట్ల రూపాయలను ఆర్‌అండ్‌బీతో ఇప్పించారు.

కోడెలకో నీతి, జగన్‌కో నీతా?

ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా పనిచేసిన డాక్టర్ కోడెల శివప్రసాదరావుకు నాటి ప్రభుత్వం ఆయన ఇంటికి, ఆఫీసుకు ఫర్నీచర్ సమకూర్చింది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన తన ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌ను తీసుకెళ్లాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. అధికారులు కావాలని దాన్ని పక్కనపెట్టి ప్రభుత్వ ఫర్నీచర్‌ను సొంత అవసరాలకు వాడుకున్నారంటూ కోడెలపై నిందలు మోపారు. వేధింపులకు గురిచేశారు. పులిలా బతికిన నేతను అవమానపరిచారు. ప్రభుత్వ వేధింపులతో ఆయన ఎంతో మనోవేదనకు గురయ్యారు. మంత్రిగా, స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి చిల్లరగా ఫర్నీచర్ కోసం ఆరాటపడ్డారని ప్రజలు అనుకునేలా ప్రభుత్వ పెద్దలు తప్పుడు ప్రచారం చేశారు. తీవ్ర మనోవేదనకు గురైన కోడెల ఆత్మహత్య చేసుకున్నారు. మరి జగన్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు వర్తించవా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ముఖ్యమంత్రి పదవికి జగన్ రాజీనామా చేసిన తర్వాత కూడా ప్రభుత్వ ఆస్తులను ఆయన వాడుకుంటుంటే అధికారులు ఏం చేస్తున్నారు? కోడెల విషయంలో ఒకలా, జగన్ విషయంలో మరోలా నిబంధనలను అమలు చేస్తారా? అని రాజకీయవర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం ఇకనైనా ఈ విషయంలో చొరవ తీసుకొని తాడేపల్లి క్యాంపు ఆఫీసులోని చరాస్తులను స్వాధీనం చేసుకుంటుందా?

ప్రభుత్వం గుట్టు విప్పుతుందా?

జగన్ తాడేపల్లి ప్యాలెస్‌పై గత ప్రభుత్వం 45.54 కోట్లు ఖర్చు చేసిందని అంచనా. వాస్తవంలో ఈ లెక్క మరింత ఉండే అవకాశం ఉందని సీనియర్ అధికారులే చెబుతున్నారు. ఆ ఖర్చుతో ప్రభుత్వమే సొంతంగా ముఖ్యమంత్రి కోసం ఓ అద్భుతమైన నివాసం నిర్మించే అవకాశం ఉంది. అయితే జగన్ కోరారని అధికారులు అడ్డగోలుగా ఖర్చు పెట్టారు. కొత్త ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిపెట్టాలని సీనియర్ అధికారులు కోరుతున్నారు. సీఎం క్యాంప్ ఆఫీసుకు నిబంధనల ప్రకారం ఎంత ఖర్చు చేయాలి? జగన్ ప్రభుత్వంలో ఎంత ఖర్చు పెట్టారు? అన్న విషయాన్ని నిగ్గుతేల్చాలని కోరుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి ప్రజాధనాన్ని ఏ మేరకు దుర్వినియోగం చేశారో గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తుందా?

అవి నా మనసుకు నచ్చిన శాఖలు

ప్రజలకు నేరుగా సేవచేసే అవకాశం.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గంలో నాకు కేటాయించిన శాఖలు నా మనస్సుకు, జనసేన మూలసిద్ధాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తనకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలు కేటాయించడంపై ఆయన స్పందించారు. 'ఈ శాఖల ద్వారా ప్రజలకు నేరుగా సేవలందించే అవకాశం కలిగింది. ప్రజల సమస్యలను గ్రామాల్లో స్వయంగా చూశాను. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తా. ఈ శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి. విశాఖ మన్యంలో పర్యటిస్తున్నప్పుడు అక్కడ కురిడి గిరిజన గ్రామంలో గ్రామ ఆడపడచులు గుక్కెడు నీళ్ల కోసం పడుతున్న అవస్థలను కళ్లారా చూశాను. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జల్ జీవన్ మిషన్ ద్వారా పల్లెలకు రక్షిత తాగునీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తాం. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటి. కరువు కాటకాలకు కారణమయ్యే అడవుల విధ్వంసాన్ని అరికడతాం. ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాకు పాల్పడే వారు ఎంతటివారైనా కటకటాల వెనక్కు వెళ్లాల్సిందే. జనసేనకు కేటాయించిన శాఖల ద్వారా చిత్తశుద్ధితో ప్రజాసేవలు అందిస్తాం. నా శాఖలపై మరింత లోతైన అధ్యయనం జరిపి ప్రజలకు మేలైన ఫలాలు అందించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత వద్దు: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖలకు చెందిన ప్రతి అధికారి అందుబాటులో ఉండాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు నిర్దేశించారు. శనివారం విజయవాడలోని నివాసంలో తన మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈనెల 18న రైతులకు అందించనున్న పీఎం కిసాన్, ఇతర అంశాలపై చర్చించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా చూడాలని, నాణ్యమైన పురుగు మందులు సరఫరా చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, తదితరులు పాల్గొన్నారు. మంత్రిని వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ అధ్యక్షుడు వేణుమాధవరావు, కార్యవర్గ సభ్యులు, పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ నేతలు వెంకట్రామయ్య, సత్యనారాయణ మంత్రిని కలిశారు.

తెలుగు ఐఏఎస్‌కు పవన్ అభినందనలు

కేరళలో ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతికి కృష్ణతేజ కృషి



అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలల హక్కుల కమిషన్ పురస్కారానికి ఎంపికైన ఐఏఎస్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణతేజకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఏపీకి చెందిన కృష్ణ తేజ కేరళ రాష్ట్రంలో బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతల్లో ఉన్న ఆయన ఆ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు ఉత్తమ విధానాలు అనుసరించారని గుర్తుచేశారు. కరోనా కష్ట కాలంలో, కేరళ వరదల విపత్తు సమయంలో కృష్ణ తేజ విధి నిర్వహణలో చూపిన అంకితభావాన్ని ఆ రాష్ట్ర ప్రజలు మరచిపోలేదన్నారు. ఆయన మరింతగా సేవలందిస్తూ ఉద్యోగులకు, యువతకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు.

దివ్యాంగునికి చంద్రబాబు రూ.3 లక్షల సాయం

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కడప పట్టణం రాజారెడ్డి వీధికి చెందిన కనపర్తి మనోజ్‌కుమార్ అనే దివ్యాంగునికి సీఎం చంద్రబాబు రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, వైద్యం కోసం సాయం చేయాలని మనోజ్‌కుమార్ విన్నవించారు. శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును కలిసి మనోజ్ తన సమస్యను వివరించారు. వీల్‌చైర్‌కే పరిమితమైన మనోజ్‌కు సీఎం రూ.3 లక్షల సాయాన్ని ప్రకటించారు.

ప్రజాతీర్పును అపహాస్యం చేస్తారా?: ఇక్బాల్

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్ష నేతపై అక్రమ కేసులు పెట్టి, రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలని జగన్‌రెడ్డి కుట్ర పన్నారు. అందుకే కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ప్రజలు గుణపాఠం చెప్పారు' అని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ నేత మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ప్రజా తీర్పును జగన్ ఒప్పుకోలేకపోతున్నాడు. ఆధారాలు లేవు కానీ, తమ ఓటమిపై అనుమానాలు ఉన్నాయంటూ ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా మాట్లాడటం సిగ్గుచేటు. ప్రత్యేక హోదాపై ఐదేళ్లు నోరెత్తకుండా, ఇప్పుడు మాట్లాడటం జగన్‌రెడ్డి నీచ రాజకీయానికి నిదర్శనం' అని మండిపడ్డారు.

జగన్ కలలు.. భ్రమలు: బుద్దా వెంకన్న



విజయవాడ, జూన్ 15: 'జగన్‌రెడ్డిపై ఉన్న అవినీతి కేసుల్లో శిక్షపడితే అతనికి ఎన్నికల్లో పోటీచేసే అర్హత ఉండదు. జగన్ జైలుకు వెళితే వైసీపీ భూస్థాపితమవుతుంది. జగన్ ఇష్టపడే ఉండవల్లి అరుణకుమార్ కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు' అని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. విజయవాడ వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జగన్‌రెడ్డి తన పార్టీ ఎంపీల సమావేశంలో చేసిన ప్రసంగం చూస్తే అతనో పెద్ద సైకో అని మరోసారి రుజువయింది. ఐదు సంవత్సరాలు కళ్లు మూసుకుంటే తమకే మళ్లీ అధికారం వస్తుందని కలలు కంటున్నాడు. జగన్ ఇంకా భ్రమలలోనే తూగుతున్నాడు. జగన్‌పై ఉన్న అవినీతి కేసులను త్వరగా విచారించాలని నేను పిల్ వేస్తా. చంద్రబాబు, లోకేశ్, పవన్‌లను తిట్టించి జగన్ నవ్వుకున్నాడు. ప్రజల్లోలేని జగన్‌కు ఇల్లు అయినా, జైలు అయినా ఒకటే' అని బుద్దా వెంకన్న అన్నారు.


బాబు కలల ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: నిమ్మల

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్టులు పూర్తి చేసి ఆయన లక్ష్యం నెరవేర్చేలా పనిచేస్తానని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శనివారం సీఎం నివాసం వద్ద ఆయన మాట్లాడుతూ జలవనరుల శాఖను సమర్థవంతంగా నిర్వర్తించడం అంటే రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకునే అవకాశం కలిగిందన్నారు. అలాంటి అవకాశాన్ని జగన్ కోల్పోవడంతో పాటు ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి తీరని ద్రోహం చేశాడన్నారు. అవులపల్లి ప్రాజెక్టులో పెద్దిరెడ్డి రూ.600 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని, ఎన్జీటీ నిబంధనలకు విరుద్ధంగా ఆ ప్రాజెక్టు జరిగిందని తెలిపారు. జగన్ అనాలోచిత నిర్ణయాలతో కృష్ణానదీ జలాలపై అంతర్రాష్ట వివాదం తలెత్తిందన్నారు. జగన్ పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశాడని తాము చెప్పడం కాదని, నీతి ఆయోగ్ కమిటీనే ధ్రువీకరించిందని గుర్తుచేశారు.

నేడు మంత్రి నారాయణ బాధ్యతల స్వీకరణ

అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం వెలగపూడి సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 9.06 గంటలకు సచివాలయంలోని రెండో బ్లాక్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ పేషీలో బాధ్యతలు చేపడతారు.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం: హోం మంత్రి అనిత



పాయకరావుపేట/రూరల్, జూన్ 15: సైకో జగన్ పాలనలో అల్లాడిన రాష్ట్రానికి హోంమంత్రి అవడం అతి పెద్ద బాధ్యతగా భావిస్తున్నానని వంగలపూడి అనిత అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, ఆడపిల్లల వైపు తప్పుగా చూడాలన్నా భయపడే విధంగా లా అండ్ ఆర్డర్ ఉంటుందని తెలిపారు. శనివారం పాయకరావుపేట పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ఐపీఎస్ అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరించారన్నారు. హోంశాఖ ప్రక్షాళన దిశగా ముందుకు వెళతానని చెప్పారు.



విధ్వంస పాలనకు ప్రతీకగా 'ప్రజావేదిక'!

శిథిలాలు అలాగే ఉంచాలని చంద్రబాబు నిర్ణయం

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ విధ్వంస పాలనకు ప్రతీకగా 'ప్రజావేదిక' శిథిలాలను అలాగే ఉంచాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. సరిగ్గా ఐదేళ్ల కిందట జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రజా వేదికను బుల్‌డోజర్లు, పొక్లెయిన్లతో జగన్ కూలగొట్టించిన విషయం తెలిసిందే. ఈ వేదిక అమరావతి పరిధిలో సీఎం చంద్రబాబు నివాసానికి పక్కనే ఉండేది. రాష్ట్ర విభజన అనంతరం అమరావతిలో కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత ప్రభుత్వపరమైన సమావేశాల నిర్వహణకు అనువైన సమావేశ మందిరం ఉండాలన్న ఉద్దేశంతో ఉండవల్లి కరకట్ట పక్కన 'ప్రజావేదిక' పేరుతో సమావేశ మందిరాన్ని టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. అయితే ఎన్నికల్లో గెలిచిన వైసీపీ 2019 జూన్ 26న అందులో కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహించింది. నిబంధనలకు విరుద్ధంగా కృష్ణా ముంపు ప్రాంతంలో నిర్మించినందువల్ల ఈ సభా మందిరాన్ని కూల్చి వేస్తున్నామని ఆ సమావేశంలోనే సీఎం హోదాలో జగన్ ప్రకటించారు. కలెక్టర్ల సమావేశం ముగియగానే రాత్రికి రాత్రి బుల్‌డోజర్లు, పొక్లెయిన్లతో కూలగొట్టి ఉదయానికల్లా దానిని శిథిలాల కుప్పగా మార్చారు. సీఎం చంద్రబాబు శనివారం సాయంత్రం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ముచ్చటిస్తున్నప్పుడు ఈ శిథిలాల ప్రస్తావన వచ్చింది. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. 'మేం ఆ శిథిలాలను తొలగించం. భవిష్యత్తులో కూడా ఆ శిథిలాలు చూస్తే అందరికీ వైసీపీ విధ్వంస పాలన గుర్తుకు రావాలి' అని స్పష్టం చేశారు.

బాధ్యతతో పనిచేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ఒక నమూనాగా... ఆదర్శంగా పనిచేసి చూపిద్దాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన టీడీపీలో కింది స్థాయి నేతలైన బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసారి ఎన్నికల్లో సాధించిన విజయం అపూర్వమని, దీనిని పార్టీ కార్యకర్తలకు అంకితం చేస్తున్నానని వ్యాఖ్యానించారు. 'గత 20 ఏళ్లలో గెలవని సీట్లు కూడా ఈసారి మనం గెలిచాం. కూటమి విజయం గాలివాటంగా వచ్చింది కాదు. దీని వెనుక కార్యకర్తలు పడిన కష్టాన్ని మర్చిపోను. పసుపు జెండా పట్టుకొంటే చెయ్యి విరగొట్టారు. జై టీడీపీ అంటే గొంతు కోసి చంపారు. అయినా వెనకడుగు వేయకుండా కార్యకర్తలు పనిచేశారు. అనేకమంది ఆస్తులు పోగొట్టుకొన్నారు. వందల మంది జైళ్లకు వెళ్లారు. ఆ సమయాల్లో నిద్రలేని రాత్రులు గడిపాను. వారి త్యాగాలు నా జీవితంలో మర్చిపోలేను. కింది స్థాయిలో ఎవరు ఎక్కడ ఏం పనిచేశారో అధ్యయనం చేస్తున్నాం. నాయకులు, కార్యకర్తలు సాధికారత సాధిస్తే పార్టీ పునాదులు కూడా బలంగా ఉంటాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో ఎక్కడెక్కడ అన్న క్యాంటీన్లు పెట్టామో వాటన్నింటినీ వంద రోజుల్లో ఏర్పాటు చేస్తామని, ప్రజల జీవన ప్రమాణాలు మార్చేలా పథకాలు అమలు చేస్తామని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు త్వరలో ఇస్తామని ఆయన ప్రకటించారు. ఇక నుంచి ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి రావాలని చంద్రబాబు నిర్ణయించారు. మంత్రులూ తమ జిల్లాల్లో పార్టీ కార్యాలయాలకు తరచూ వెళ్లాలని ఆదేశించారు.

సీఎంగా తొలిసారి టీడీపీ కార్యాలయానికి రాక

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక మొదటిసారిగా టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన చంద్రబాబుకు కార్యాలయ సిబ్బంది, నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారు. కార్యకర్తలు, నేతలు, కార్యాలయ సిబ్బందితో ముచ్చటించారు. కార్యకర్తలు ఆయనతో కలిసి ఫొటోలు దిగారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నేతలు చంద్రబాబును కలిసి గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కొంతమంది మహిళలు మెమెంటోలు అందజేసి ఆయనకు పాదాభివందనం చేశారు. కొంత మంది కార్యకర్తలు, వృద్ధులు తమ సమస్యలను చెప్పగా ఓపికగా విని వినతిపత్రాలు స్వీకరించారు.



కార్యకర్త కోరికతో చలువ కళ్లజోడు పెట్టుకున్న బాబు

బ్యారికేడ్లు వద్దు

పార్టీ కార్యాలయంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో చంద్రబాబు వద్దని వారించారు. ప్రజలు తనను నేరుగా కలిసేందుకు అవకాశమివ్వాలని, బ్యారికేడ్లు వద్దని భద్రత సిబ్బందికి సూచించారు. అనంతరం అందుబాటులో ఉన్న నేతలతో, ఆ తర్వాత టీడీపీ కేంద్ర కార్యాలయ సిబ్బందితో భేటీ అయ్యారు. ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న సమయంలో బాగా పనిచేశారని అభినందించారు. విజయంతో పని అయిపోయినట్లు కాదని, మరింత ప్రతిభావంతంగా పనిచేయాలని సూచించారు. పార్టీ పరంగా అందరికీ న్యాయం చేస్తానని, తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.

పోలవరం పరిస్థితేంటో చూడాలి

పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతుల పరిశీలనకు సోమవారం అక్కడకు వెళ్లే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. వర్షాలు, వరదలు రావడానికి ముందే ఒకసారి పోలవరం పరిస్థితి ఏమిటో నేరుగా చూడాలని అనుకొంటున్నామని, అందుకే వచ్చే సోమవారం పోలవరానికి వెళ్లాలన్న ఆలోచన ఉందని సీఎం చెప్పారు. తన క్షేత్ర స్థాయి పర్యటనలు పోలవరంతో మొదలవుతాయన్నారు. అసెంబ్లీ సమావేశాల తేదీలను ఇంకా అనుకోలేదని, త్వరలో ఖరారు చేస్తామని వివరించారు. ప్రజల నుంచి వినతుల స్వీకరణకు ఒక వ్యవస్థ ఏర్పాటు చేయడంపై ఆలోచన చేస్తున్నామన్నారు. 'ముఖ్యమంత్రికి విజ్ఞాపనలు ఇవ్వడానికి ప్రజలు వస్తుంటారు. దీనికోసం ఎలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నది ఆలోచన చేస్తున్నాం. వీలైనంత వరకూ రాష్ట్ర సచివాలయం వద్ద వినతుల స్వీకరణ ఉంటే బాగుంటుందని అనుకొంటున్నాం. అక్కడ కాకపోతే మరో చోట పెడతాం. ఎక్కడ పెట్టినా అక్కడకు వచ్చే సామాన్యులకు కనీస వసతులు ఏర్పాటు చేస్తాం' అని చెప్పారు. వినతులను సత్వరం పరిష్కరించడానికి ఎటువంటి ఏర్పాటు ఉండాలన్నదానిపై కూడా చర్చిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అమరావతిని నిర్లక్ష్యం చేయడం వల్ల సచివాలయానికి రాకపోకలకు ఇబ్బంది కలిగిందని, ఇప్పుడు వాటిని మరింత మెరుగుపరుస్తామని చంద్రబాబు చెప్పారు.

'స్పందన' పేరు మార్పు

ప్రజల నుంచి సమస్యలు స్వీకరించి వాటిని సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపి పరిష్కరించే కార్యక్రమం పేరును ప్రభుత్వం మార్చింది. వైసీపీ ప్రభుత్వం 'స్పందన' పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం దీనికి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్)గా నామకరణం చేసింది. కాగా అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 19 నుంచి ఉండవచ్చని పోలీస్ శాఖ అభిప్రాయపడుతోంది.

ఐదేళ్లలో మూతపడిన బడులెన్ని?

పాఠశాల విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలపై మంత్రి లోకేశ్ సమీక్ష

అమరావతి(ఆంధ్రజ్యోతి)/ మంగళగిరి, జూన్ 15: విద్యా వ్యవస్థలో మార్పులకు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. శనివారం ఉండవల్లిలోని నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఏడాదిలోగా పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. గత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని పాఠశాలలు మూతపడ్డాయో సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అందుకు కారణాలు కూడా తెలపాలని, గ్రామాల్లో విద్యార్థులకు బడులు ఎంత దూరంలో ఉన్నాయనే వివరాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం రుచిగా, నాణ్యతతో ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ఢిల్లీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఇతర రాష్ట్రాల్లోని ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలన్నారు. బైజూస్ కంటెంట్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల వినియోగంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా స్టూడెంట్ కిట్లు అందజేయాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు జూలై 15లోగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు అందించాలని ఆదేశించారు.



లోకేశ్‌కు సమస్యలు చెప్పుకొంటున్న మైనారిటీ నేత

రీయింబర్స్‌మెంట్ బకాయిల వివరాలివ్వండి

రాష్ట్రవ్యాప్తంగా విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. వివాదాస్పద వీసీలు, వర్సిటీల్లో అవినీతి ఆరోపణలపై కూడా నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఐటీ ఎలక్ట్రానిక్ హబ్బులుగా విశాఖ, తిరుపతి

రాష్ట్రంలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో నూతన ఐటీ పాలసీ తీసుకొస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ ముఖ్య అధికారులతో సమీక్షించారు. విశాఖపట్నాన్ని ఐటీ హబ్ గాను, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

లోకేశ్ 'ప్రజా దర్బార్'

మంగళగిరి సిటీ, జూన్ 15: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు మంత్రి లోకేశ్ శనివారం 'ప్రజా దర్బార్' నిర్వహించారు. మంగళగిరి ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక యంత్రాంగాన్ని సైతం ఏర్పాటు చేసుకున్నారు. ప్రజా దర్బార్‌లో నియోజకవర్గ ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అన్నీ సావధానంగా విన్న లోకేశ్ వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

'ఉద్యాన' వీసీని రీకాల్ చేయాలి

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిపై ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. వీసీని రీకాల్ చేయాలని, వీసీ పదవీ కాలంలో నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కోరింది.

'ప్రక్షాళన తిరుమల నుంచే మొదలవుతుంది' అని ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణం చేసిన వెంటనే తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్న సందర్భంగా చంద్రబాబు అన్నారు. ఆ ఒక్క మాటతో తిరుమలలో పెనుమార్పులు ఉంటాయని అందరూ భావిస్తున్నారు. గత ఐదేళ్లుగా టీటీడీ కేంద్రంగా సాగిన అరాచక నిర్ణయాలు, అవినీతి, అవకతవకలను పునఃసమీక్షిస్తారని, ప్రక్షాళన చేస్తారని శ్రీవారి భక్తులు కోటి ఆశలు పెట్టుకున్నారు.



పీఆర్వోల దుకాణాలు

కొందరు మంత్రులు, పాలకమండలి సభ్యులు దర్శనాల పేరిట కొండపై ఏకంగా దుకాణాలే తెరిచేశారు. టికెట్లను భారీ ఎత్తున అమ్ముకున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా దర్శనాలను వ్యాపారంగా మార్చుకున్నారు. తిరుమలలో ప్రైవేటు పీఆర్వోలు ఇబ్బడిముబ్బడిగా అవతరించారు. ఎమ్మెల్యేలు, ఎం పీలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, బోర్డు సభ్యులందరికీ పీఆర్వోలు ఉండి, దర్శన ఏర్పాట్లు చూసేవారు. దాతలు నిర్మించిన అతిథి గృహాలు ప్రైవేటు పీఆర్వోలకు, దళారీలకు కేంద్రాలుగా మారాయి.

గోవిందా.. గోవిందా!

తిరుమల పవిత్రతపై వైసీపీ దెబ్బ.. వ్యాపార మయంగా మార్చిన జగన్.. ధర్మారెడ్డి హయాంలో రాజకీయ రచ్చ

- తిరుమల పాలన ప్రక్షాళన ఎలా?
- సీఎం చంద్రబాబుపై భక్తులకు కోటి ఆశలు

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో జగన్ పాలనలో పవిత్రమైన తిరుమల క్షేత్రాన్ని రాజకీయ వ్యాపార కేంద్రంగా మార్చేశారు. ఐఏఎస్ కాని ధర్మారెడ్డిని ఈవోగా నియమించారు. ఆయన దుందుడుకు నిర్ణయాలతో సాధారణ భక్తులకు వెంకన్న దర్శనం దుర్లభంగా మారింది. ఇదేసమయంలో సంపన్నులకు పెద్దపీట వేశారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా ఆయన నియంత తరహా పాలనలో మార్పు రాలేదు. జగన్ ప్రయోజనాలే పరమావధిగా ధర్మారెడ్డి వ్యవహరించారు. టీటీడీలో ఉద్యోగులకు, అర్చకులకు కనీస గౌరవం లేని వాతావరణాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో తాజాగా చంద్రబాబు సీఎం కావడంతో మళ్లీ మునుపటి రోజులు వస్తాయనే నమ్మకం అందరిలో పెరుగుతోంది. జగన్ పాలనలో భ్రష్టుపట్టిన తిరుమల పాలనపై దృష్టిపెట్టి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని వెంకన్న భక్తులు కోరుతున్నారు.

దర్శనాల వ్యాపారం

జగన్ పాలనలో శ్రీవారి దర్శనాల్లో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల హవా నడిచింది. గత చంద్రబాబు పాలనలో ఎమ్మెల్యేల నుంచి రోజుకో సిఫారసు లేఖనే అనుమతించేవారు. అప్పుడు కూడా ఆరుగురికే దర్శనం కల్పించేవారు. వైసీపీ హయాంలో ఎమ్మెల్యే లేఖలపై టికెట్లను రోజుకు ఆరు నుంచీ పదికి పెంచేశారు. స్వయంగా వెళితే 20నుంచి 30 టికెట్లు ఇచ్చారు. మంత్రులకైతే అసలు పరిమితి లేదు. మంత్రి స్వయంగా వెళితే 60 నుంచి 70 మందిని అనుమతించారు. ఇక బోర్డు సభ్యులకు రోజుకు 35 టికెట్లు ఇచ్చారు. పాలకమండలి చైర్మన్ కార్యాలయం నుంచి రోజుకు 500 నుంచి వెయ్యి టికెట్లు ఇచ్చారు. గతంలో రోజుకి బ్రేక్ దర్శన టికెట్లు 2వేలకు మించేవి కాదు. జగన్ పాలనలో 6వేలకు పెంచారు.

అడ్డగోలు నియామకాలు!

వైసీపీ హయాంలో టీటీడీలో అడ్డగోలు నియామకాలు జరిగాయి. కావలసినవారికి వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో కొలువులిచ్చారు. కొత్తగా సలహాదారులను నియమించుకునే సంప్రదాయానికీ తెరదీశారు. అకౌంట్స్ విభాగంలో నరసింహమూర్తి, ఇంజనీరింగ్‌లో కొండలరావు, రామచంద్రారెడ్డి సలహాదారులుగా ఉన్నారు. బర్డ్ ఆస్పత్రికి డాక్టర్ గురవారెడ్డిని సలహాదారుగా నియమించారు. విజిలెన్స్ విభాగంలోనూ ప్రభాకర్ అనే వ్యక్తిని సలహాదారుగా నియమించారు. సైబర్ ఎక్స్‌పర్ట్‌గా సందీప్ అనే వ్యక్తిని నియవిుంచారు. ఆ తర్వాత ఏకంగా ఐటీ విభాగానికే ఆయనను జనరల్ మేనేజర్ చేసేశారు. కీలకమైన ఎస్టేట్ విభాగంలో రిటైరైన అధికారి మల్లిఖార్జున కొనసాగుతున్నారు. ఎస్వీబీసీలో గాయని మంగ్లీ, విజయ్‌కుమార్ సలహాదార్లుగా ఉన్నారు. వీరికి రూ. లక్షకు పైగా వేతనం, వాహనం, గదులు కేటాయించి టీటీడీ ఖజానాను గుల్ల చేశారు.

కమిషన్ల కోసం నిర్మాణాలకు నిధులు

టీటీడీ ఇంజనీరింగ్ విభాగం చేపట్టే పనుల నాణ్యత మీద గతంలో ఆరోపణలు వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక నాయకులకు 15శాతం కమీషన్ తప్పనిసరిగా మారిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో నిర్మాణ పనులూ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. 2019 దాకా బడ్జెట్‌లో ఈ విభాగం వాటా రూ. 150కోట్లకు మించేది కాదు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏకంగా రూ.3వేల కోట్లకు పైగా నిధులను ఇంజనీరింగ్ పనులకు కేటాయించారు. తిరుపతిలో ఇటీవలే మరమ్మతులు చేసిన గోవిందరాజస్వామి సత్రాలను కూల్చేసి కొత్త భవనం నిర్మించాలంటూ ఆగమేఘాల మీద బోర్డులో తీర్మానం చేసి, రూ.600 కోట్లు కేటాయించారు. అదేవిధంగా స్విమ్స్ భవనాలు పటిష్ఠంగా ఉన్నప్పటికీ వాటిని కూల్చేసి కొత్తవి నిర్మించేందుకు రూ.300 కోట్లు కేటాయించారు. శ్రీవారి ప్రసాదం లడ్డూ మొదలు, కాటేజీల దాకా అన్నింటి ధరలనూ పెంచేశారు. అలిపిరి టోల్‌గేటులో కారుకు రూ.15 ఉండగా రూ.50కి, మినీ లారీ, మినీబస్సులకు రూ.50 నుంచి రూ.వందకు పెంచారు. పాంచజన్యం, కౌస్తుభం సముదాయాల్లోని గదుల అద్దె రూ.500 ఉండగా వైసీపీ ప్రభుత్వం రూ.1000కి పెంచింది. స్పెషల్ టైప్ కాటేజీల అద్దెను రూ.750 నుంచి రూ.2200కు, కొన్ని కార్నర్ సూట్లు రూ.1500 నుంచి రూ.2800కు పెంచేశారు. టీటీడీ బోర్డు సమావేశంలోనే గదుల అద్దెలు పెంచిన వీడియో అప్పట్లో వైరల్ అయ్యింది.

లడ్డూల్లో కోత!

శ్రీవారి దర్శనం అనంతరం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తీసుకునే లడ్డూ ప్రసాదంలోనూ వైసీపీ సర్కారు కోత పెట్టింది. ధర రెట్టింపు చేసింది. టీడీపీ పాలనలో బ్రేక్ దర్శన టికెట్‌పై 2 లడ్డూలు, ఏ ఆర్జిత సేవకు వెళ్లినా, రూ.300 టికెట్ తీసుకున్నా 2లడ్డూలు ఇచ్చేవారు. నడక భక్తులకు ఒక లడ్డూ ఉచితంగా అందేది. సర్వదర్శన భక్తులకు రూ.10కి 2 లడ్డూలు, రూ.25 ధరతో రెండు లడ్డూలు ఇచ్చేవారు. వైసీపీ హయాంలో శ్రీవారిని దర్శించుకునే ప్రతి ఒక్కరికీ ఒక ఉచిత లడ్డూ ఇస్తూ, అదనపు లడ్డూ ధరను రూ.25నుంచీ రూ.50కు పెంచారు. రూ.300, రూ.500 బ్రేక్ దర్శన టికెట్‌లతో సహా సుప్రభాతం, అర్చన, తోమాల, ఆర్జిత సేవల టికెట్లపై గతంలో ఇస్తున్న రెండు లడ్డూలలో ఒక లడ్డూ కోత విధించారు. రుచికి, శుచికి పేరొందిన శ్రీవారి అన్న ప్రసాదం నాణ్యత కరువైందన్న ఫిర్యాదులు కూడా ఎక్కువగా వినిపించాయి.

శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు



అక్టోపస్ భవనం వద్ద క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు

తిరుమల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య శనివారం మధ్యాహ్నం నుంచి పెరిగింది. సాయంత్రానికి శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, లడ్డూ వితరణ కేంద్రం, బస్టాండ్ ప్రాంతాల్లో రద్దీ భారీగా నెలకొంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిషెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ రింగురోడ్డులో అక్టోపస్ భవనం వరకు దాదాపు 3కిలోమీటర్ల మేర వ్యాపించింది. వీరికి 36 గంటల దర్శన సమయం పడుతున్నట్లు టీటీడీ ప్రకటించింది. రద్దీ కారణంగా గదులకు డిమాండ్ నెలకొంది. సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి, ఏఆర్పీ, టీబీ కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. గది పొందేందుకు 3 నుంచి 4 గంటల సమయం పడుతోంది. కల్యాణకట్టలు కూడా రద్దీగా కన్పిస్తున్నాయి. సోమవారం వరకు సెలవు లున్న నేపథ్యంలో మంగళవారం వరకు రద్దీ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పెద్దిరెడ్డీ 'గోబ్యాక్'

పుంగనూరులో నిరసన సెగ



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న టీడీపీ శ్రేణులు

పుంగనూరు, జూన్ 15: వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణం దద్దరిల్లింది. వైసీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనడానికి ఆయన వ స్తున్నారన్న సమాచారంతో టీడీపీ, జనసేన శ్రేణులు పెద్దఎత్తున నిరసనకు దిగాయి. గత ఐదేళ్లలో ఆయన చేసిన అరాచకాలను నిరసిస్తూ ఆందోళన చేపట్టాయి. 'పెద్దిరెడ్డీ గో బ్యాక్' అంటూ కార్యకర్తలు నినదించారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా పుంగనూరుకు వస్తే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ర్యాలీ చేశారు. ఆ సమయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడు గోపి యాదవ్‌కు దేహశుద్ధి చేశారు. ర్యాలీ వైసీపీ నాయకుడు వెంకటరెడ్డి యాదవ్ ఇంటివద్దకు రాగానే కేకలు వేస్తూ రాళ్లు విసిరారు. కొందరు నేతలు శ్రేణులను నిలువరించే ప్రయత్నం చేశారు. ఆవేశంతో ఉన్న కార్యకర్తలు... 'వైసీపీ ప్రభుత్వంలో మాపై తప్పుడు కేసులు బనాయించారు. కుటుంబాలను రోడ్డున పడేశారు' అంటూ ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈడిగపల్లె వద్ద ఎదురుపడ్డ మాజీ ఎంపీపీ నరసింహులుపై టీడీపీ శ్రేణులు దాడి చేయబోగా పార్టీ నేత మాధవరెడ్డి వారించారు. వైసీపీ కార్యకర్తలు రెచ్చగొట్టేలా బూతులు మాట్లాడటంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ పేర్కొన్నారు. 'మా ఎమ్మెల్యే వస్తున్నారు, ధైర్యం ఉంటే రోడ్డుపైకి రావాలి' అంటూ వారు బహిరంగ సవాలు విసరడంతో రావాల్సి వ చ్చిందని తెలిపారు. ఉద్రిక్తత నేపథ్యంలో పోలీసుల సూచనమేరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పర్యటన వాయిదా వేసుకున్నారు. అలాగే పుంగనూరు, మదనపల్లెకు రావాల్సిన ఎంపీ మిథున్‌రెడ్డి తిరుపతి నుంచి నేరుగా మదనపల్లె వెళ్లారు.

పొన్నవోలుపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు

అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌పై పొన్నవోలు సుధాకర్ రెడ్డి యూట్యూబ్ వీడియోలలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై కేసులు నమోదు చేయాలని టీడీపీ పరిశోధన, సమాచార కమిటీ సభ్యులు తోపూరి గంగాధర్ మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జగనన్నను వేటాడారని, జగన్‌ను చంపేస్తే ఏందని చంద్రబాబు అన్నట్లు పొన్నవోలు తప్పుడు వ్యాఖ్యలు చేశారని గంగాధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రయత్నించిన సుధాకర్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

సర్కారుకు సంపూర్ణ సహకారం

- ఏపీ అమరావతి జేఏసీ

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ముందు తరాల వారి భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధికి ఉద్యోగులుగా తమ వంతు పాత్ర పోషించి, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నూతన ప్రభుత్వానికి తోడ్పాటు, సంపూర్ణ సహకారం అందిస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో మంత్రులుగా శాఖల కేటాయింపులు అనంతరం జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పక్షాన, అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తదితరులను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు.

ప్రజలు ప్రలోభాలకు లోనయ్యారు

- మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ వ్యాఖ్య

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 15: 'అయిదేళ్లపాటు సంక్షేమ పాలన అందించాం.. ఆ పథకాలతో ప్రజలు సంతృప్తి చెందారనుకున్నాం.. కానీ ప్రలోభాలకు లోనయ్యారు' అని మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. వాస్తవానికి తాడేపల్లిగూడెంలోనే వైసీపీ ఎక్కువగా ఓటర్లకు సొమ్ములు ఇచ్చి ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేశారని సర్వత్రా చర్చించుకుంటున్నారు. దీనికితోడు ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని ఎన్నిరకాలుగా ఇబ్బందులు పెట్టాలో అన్ని అస్త్రాలు ఉపయోగించారు. చివరికి నియోజకవర్గం చరిత్రలోనే అత్యధిక ఘోర పరాజయం చవిచూశారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని రచ్చచేసిన చంద్రబాబు, పవన్ వాటికి మించిన హామీలు ఇచ్చారన్నారు. అధికార మదంతో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం దారుణమని, కూటమి నెగ్గినంత మాత్రాన ఏమీ అయిపోలేదని కొట్టు వ్యాఖ్యానించారు.



'థ్యాంక్స్ టు గాంధీజీ'

- నెల్లూరులో ఎమ్మెల్యేల వినూత్న ప్రదర్శన

అన్యాయంపై న్యాయం విజయకేతనం ఎగురవేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా నెల్లూరులో శనివారం 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ర్యాలీగా గాంధీబొమ్మ వరకు చేరుకున్నారు. అక్కడ గాంధీజీకి పాలాభిషేకం చేశారు. పురపాలక మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశిం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. - నెల్లూరు(విద్య)

మెగా డీఎస్సీపై బీజేవైఎం ధన్యవాదాలు

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం మొదటి నెలలో జాబ్ కేలండర్ విడుదల చేస్తానంటూ నిరుద్యోగ యువతను మభ్యపెట్టి మోసం చేసిన జగన్ రెడ్డి పాలన పోయి.. ఇచ్చిన హామీ మేరకు మొదటి సంతకంతోనే మెగా డీఎస్సీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బీజేవైఎం నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర భారతీయ జనతా యువ మోర్చా అధ్యక్షుడు మిట్టా వంశీ, ప్రధాన కార్యదర్శి నవనీత్ కృష్ణ తదితరులు విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పాదయాత్రలో యువతను నమ్మించిన జగన్ నైజం అధికారంలో బయట పడిందని, ప్రజలు, నిరుద్యోగులు రెండోసారి మోసపోకుండా ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పనలో భాగంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించే కీలక నిర్ణయాలు తీసుకోబోతోందని బీజేవైఎం నేతలు వెల్లడించారు.

ఏయూలో వైఎస్ విగ్రహాన్ని తొలగించాలి

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్‌లను కలిసి విగ్రహాన్ని వారం రోజుల్లోగా తొలగించాలంటూ వినతిపత్రం సమర్పించారు. విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో జనసేన విద్యార్థి విభాగ రాష్ట్ర నాయకుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బోర్డింగ్ పాస్ నమూనాతో ఎంపీలు కేశినేని చిన్ని, వల్లభనేని బాలశౌరి

బెజవాడ నుంచి ముంబైకి డైలీ ఫ్లైట్

- ప్రారంభించిన ఎంపీలు బాలశౌరి, కేశినేని చిన్ని

విజయవాడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేశ వాణిజ్య రాజధాని ముంబైకి విజయవాడ నుంచి డైలీ ఫ్లైట్ ప్రారంభమైంది. విజయవాడ(గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి 7.15 గంటలకు 180 సీట్ల సామర్థ్యం కలిగిన ఎయిర్‌ఇండియా ఎయిర్‌బస్ విమానం బయలుదేరింది. ముంబై నుంచి విజయవాడకు 153 మంది ప్రయాణికులు రాగా విజయవాడ నుంచి 142 మంది ప్రయాణికులు ముంబైకి బయలుదేరారు. ముంబై విమాన సర్వీసును మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని సంయుక్తంగా ప్రారంభించారు. గన్నవరం ఎయిర్‌పోర్టు ఇంటీరియం టెర్మినల్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేక్ కటింగ్ చేసిన అనంతరం, ఎంపీలు ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లను అందించారు. విమానానికి ఫైర్ ఇంజన్లతో నీటిని చల్లి స్వాగతం పలికారు.

సీఎంవో ఆదేశాలు పాటించాం

పత్రికలకు ప్రకటనల జారీపై హైకోర్టులో సమాచార శాఖ కమిషనర్ అఫిడవిట్

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు తూట్లు పొడిచి, నచ్చినవారికి ఇష్టారీతిన ప్రభుత్వ ప్రకటనలు జారీచేసిన సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి తన నిర్ణయాలను సమర్థించుకున్నారు. ప్రకటనల జారీ విషయంలో చట్టనిబంధనలు అనుసరించి, సీఎంవో ఆదేశాలకు అనుగుణంగా నడుచుకున్నామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. రాష్ట్రంలో ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న మొదటి రెండు పత్రికలకు మాత్రమే ఎంప్యానల్డ్ రేటుతో ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చామని తెలిపారు. ఇతర పత్రికలకు సంప్రదింపుల ప్రక్రియ ద్వారా తక్కువ రేటుకు జారీ చేశామని, తద్వారా గత ఐదేళ్లలో ప్రభుత్వ ఖజానాకు రూ.328 కోట్లు ఆదా చేసినట్లు వివరించారు. నచ్చినవారికి ప్రకటనలు ఇచ్చామని పిటిషనర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. పిటిషనర్ 2019 నుంచి మాత్రమే ప్రకటనల జారీ వివరాలు కోరారని, రాజకీయ దురుద్దేశంతో పిల్ దాఖలు చేశారని, ఈ నేపథ్యంలో వ్యాజ్యాన్ని కొట్టివేయాలని కోరారు. వైసీపీని రాజకీయంగా ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి ప్రకటనలు ఇస్తోందని, ఇందుకోసం రూ.కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొం టూ బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి సింగయ్య ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రకటనల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేయడంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. ఈ పిల్‌పై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు.. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ప్రకటనలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి తాజాగా అఫిడవిట్ దాఖలు చేశారు.

జగన్ అక్రమ కట్టడాల కూల్చివేత

- హైదరాబాద్ లోటస్‌పాండ్ వద్ద ఫుట్‌పాత్‌పై సెక్యూరిటీ సిబ్బంది కోసం నిర్మాణాలు



జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేసిన అక్రమ కట్టడాలు

బంజారాహిల్స్ జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నివాసం వద్ద అక్రమ కట్టడాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం కూల్చివేశారు. బంజారాహిల్స్ లోటస్‌పాండ్ వద్ద ఫొటోగ్రాఫర్స్ కాలనీని ఆనుకొని జగన్మోహన్‌రెడ్డి నివాసం ఉంది. ఇంటి వెలుపల ఉన్న ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తూ సెక్యూరిటీ సిబ్బంది కోసం నిర్మాణాలు చేపట్టారు. మొదట తాత్కాలికంగా ఏర్పాటు చేసినప్పటికీ ఆ తరువాత పక్కా నిర్మాణాలతో నాలుగు గదులు నిర్మించారు. వీటిలో ఏసీ, మంచాలు, ఫ్రిజ్ ఇలా సకల వసతులూ కల్పించారు. అయితే, ఇవి అక్రమ నిర్మాణాలని తేల్చిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శనివారం కూల్చివేతలు చేపట్టారు. బుల్‌డోజర్‌తో నిర్మాణాలు కూల్చివేశారు. ఏసీలు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తొలగించి పక్కనే కుప్పగా వేశారు. ఫిలింనగర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



విజయలక్ష్మికి పూలతో ఘనస్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

చంద్రన్న గెలుపుతో మళ్లీ పుట్టింటికి!

- బాబు గెలిచేంతవరకూ అడుగుపెట్టనంటూ గతంలో శపథం
- ఖమ్మం జిల్లాలో ఆసక్తికర సంఘటన

కూసుమంచి, జూన్ 15: చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యే వరకూ పుట్టినింట్లో అడుగు పెట్టనంటూ ఆ ఇల్లాలు చేసిన శపథం ఐదేళ్ల తర్వాత నెరవేరింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురానికి చెందిన కట్ట విజయలక్ష్మికి, ఆమె కుటుంబ సభ్యులకు మధ్య 2019లో రాజకీయంగా చర్చ జరిగింది. చంద్రబాబు తిరిగి అధికారంలోకి వస్తారని ఒకరు.. కాదు వైఎస్ జగనే గెలుస్తారని కుటుంబ సభ్యుల్లో ఒకరికొకరు పందెం కాసుకున్నారు. జగన్ గెలిస్తే ఐదేళ్లపాటు తాను పుట్టింటికి రానంటూ విజయలక్ష్మి శపథం చేసింది. దీంతో జగన్ అధికారంలోకి రావడంతో ఐదేళ్లపాటు పుట్టింటిని వదులుకుంది. తిరిగి 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు అధికారం చేపట్టడంతో విజయలక్ష్మి కల నెరవేరింది. ఐదేళ్ల తర్వాత శనివారం విజయలక్ష్మి పుట్టింటికి రావడంతో కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులు పూలజల్లులతో, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

పిన్నెల్లి బ్రదర్స్‌పై రౌడీషీట్..?



మాచర్ల టౌన్, జూన్ 15: పల్నాడు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అరాచకాలు, అక్రమాలకు పాల్పడి, అల్లకల్లోలం సృష్టించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డిపై మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్లో శనివారం రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు తెలిసింది. ఎన్నికల రోజు రెంటచింతల మండలం పాల్వాయిగేటులో ఈవీఎం ధ్వంసం చేశారు. టీడీపీ ఏజెంట్ నంబూరు శేషగిరిరావుపై దాడి చేశారు. ఆ మరుసటి రోజు కారంపూడిలో వందల సంఖ్యలో అల్లరి మూకలను వెంటబెట్టుకు రోడ్లపై స్వైరవిహారం చేశారు. జనాలను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటనలలో పాల్గొన్న పిన్నెల్లి సోదరులు, వైసీపీ రౌడీ మూకలపై హత్యాయత్నం, పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీ షీట్స్ ఓపెన్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై మాచర్ల పట్టణ పోలీసులు సమాచార ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ప్రభుత్వాసుపత్రి రోడ్డు ఆక్రమణ




రోడ్డు, డ్రెయిన్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆక్రమణదారులు

డ్రెయిన్‌పైనే టిఫిన్, భోజనాల బండ్లు, దుకాణాలు

రోడ్డు ఆక్రమణతో వాహనదారుల ఇబ్బందులు

పట్టించుకోని వీఎంసీ, పోలీసు అధికారులు

ప్రభుత్వాసుపత్రి, జూన్ 15: మురుగు కాల్వలను ఆక్రమించి టిఫిన్లు, భోజనాల బండ్లు పెట్టి మరీ విక్రయాలు సాగిస్తున్నారు. సాక్షాత్తు కొత్త ప్రభుత్వాసుపత్రి ఎదురుగానే ఈ వ్యవహారం జరుగుతోంది. నిత్యం వందలాది మంది రోగులు, వారి బంధువులు వచ్చే ఆసుపత్రి వద్దే పరిస్థితి ఇలా ఉంటే పర్యవేక్షించాల్సిన వీఎంసీ సిబ్బంది ఏం చేస్తున్నారని పలువురు నిలదీస్తున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిసరాల్లోని సర్వీస్ రోడ్డుపై ఉన్న మురుగు కాల్వలను ఆక్రమించేసి అక్రమ నిర్మాణాలు చేసుకుని వ్యాపారాలు చేస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రజలు ఇబ్బందులు, రోగుల అగచాట్లు మనకెందుకులే అన్నట్టు ప్రభుత్వాధికారుల పనితీరు ఉంది. నగరంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన రోగులు మెరుగైన వైద్యం కోసం ఇక్కిడికి వస్తుంటారు. అలాగే ప్రత్యేక వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రికి తీసుకొచ్చే క్రమంలో సర్వీసు రోడ్డు సగభాగం ఆక్రమణలు, అనధికారికంగా పార్కింగ్‌తో పాటు ప్రైవేట్ అంబులెన్స్‌ల నిలుపుదలతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ ఆక్రమణల తొలగింపు



విషయంలో వివిధ శాఖల అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. రోజూ ట్రాఫిక్ సమస్య ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నా పోలీసులు మాత్రం స్పందించటం లేదు. ఇది పలు అనుమానాలకు తావిస్తోంది. ఆక్రమణల తొలగింపు విషయంలోనూ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించటం లేదు. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డులోని ఆక్రమణలు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

మురుగు మధ్యనే భోజనాలు..!

ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న మురుగుకాల్వల చెంతనే బండ్లు ఏర్పాటు చేసుకుని టిఫిన్లు, భోజనాల విక్రయాలు సాగిస్తున్నారు. ఇలాంటి అపరిశుభ్ర పరిసరాల్లో తినే ఆహారాన్ని విక్రయిస్తున్నా అటు ఫుడ్ సేఫ్టీ అధికారులు కానీ ఇటు వీఎంసీ సిబ్బంది కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి వచ్చే రోగులు, వారి బంధువులందరూ ఇక్కడే అపరిశుభ్ర వాతావరణంలోనే ఆహారం తీసుకుంటున్నారు. ఆసుపత్రి అధికారులు స్పందించి తక్షణం వారికి ఆసుపత్రిలోనే సౌకర్యం ఏర్పాటు చేయాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.



ఓడినా రాజీనామా చేయం!

అధికారం కోల్పోయినా దుర్గగుడిని వీడని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ● ఆయన సేవకే పనివారిని పంపిస్తున్న కాంట్రాక్టర్

రాజీనామా చేయకుండా కొనసాగుతామంటూ భీష్మించుకున్న ట్రస్ట్‌బోర్డు

వన్‌టౌన్, జూన్ 15: దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఇంకా రాజీనామా చేయకుండా భీష్మించుకుని కుర్చున్న వైనంపై చర్చ జరుగుతోంది. అధికారం కోల్పోయినా ఇంకా పెత్తనం చెలాయించడం విమర్శలకు దారి తీస్తోంది. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోయి టీడీపీ అధికారంలోకి వచ్చింది. తాజాగా సీఎంగా చంద్రబాబు బాధ్యతలు కూడా స్వీకరించారు. నూతన ప్రభుత్వం మెల్లగా కొలువుతీరనుంది. ఫలితాలు వచ్చిన రెండు మూడ్రోజుల తరువాత నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారంతా రాజీనామాలు చేయించి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కలెక్టర్లను, అధికారులను ఆదేశించారు. వాస్తవంగా అధికారం కోల్పోయిన పార్టీకి చెందిన వారెవ్వరూ నామినేటెడ్ పోస్టుల్లో కొనసాగకుండా నైతిక బాధ్యత వహించి రాజీనామాలు చేయాల్సి ఉంటుంది. అయితే దుర్గగుడిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడిన ట్రస్ట్‌బోర్డు వింత పోకడ పోతోంది. ఎన్నికల కోడ్ మొదలైనప్పుడే పదవుల్లో ఉన్నవారికి ఎలాంటి ప్రోటోకాల్ ఇవ్వరాదని అధికారిక ఉత్తర్వులు ఉన్న ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు తనకు ప్రోటోకాల్ ఇవ్వాలంటూ పట్టుబట్టారు. వీలుపడదని అధికారులు చెప్పినా రెండు, మూడుసార్లు గుడికి వచ్చి తన చాంబర్‌లో కూర్చుని పెత్తనం చేయడానికి ప్రయత్నించారు. అధికారులు స్పందించి ఇలా చేయడం కుదరదని గట్టిగా చెప్పడంతో విరమించుకున్నారు. అయితే దుర్గగుడిలో పనిచేస్తున్న కార్మికులు ముగ్గురిని చైర్మన్ ఇంటిలో పనిచేయడా



నికి ఇప్పటికీ కాంట్రాక్టర్ పంపిస్తుండడం శోచనీయం. దుర్గగుడి నుంచి డబ్బులు తీసుకుంటూ అక్కడ పనిచేయడంపై విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ట్రస్ట్‌బోర్డుకు ఒక సభ్యుడు, ఒక ప్రత్యేక ఆహ్వానితుడు మాత్రమే రాజీనామా చేయగా మిగతా వారంతా రాజీనామాలు చేయడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. తమకు 2025 వరకు జీవో ప్రకారం అధికారంలో ఉండే అవకాశం ఉందని ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పనిచేసిన రాంబాబు చెబుతుండడం విశేషం. ఇంకోవైపు ట్రస్ట్‌బోర్డు సభ్యులెవ్వరూ రాజీనామాలు చేయవద్దంటూ మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అనుచరుడు సలహాలిస్తుండడం విశేషం. ఏదైనా ప్రభుత్వం మారిన తరువాత ఎలా కొనసాగుతామన్నది నైతికతకు సంబంధించిన అంశమని చెబుతున్నారు.



కూరగాయల లారీకి పూజ చేసి జెండా ఊపి పంపుతున్న దాతలు

తిరుమలకు కూరగాయల వితరణ

మొగల్రాజపురం, జూన్ 15: తిరుమల తిరుపతి దేవస్థానానికి యూఎస్ఏలో ఉండే దాతలు నిమ్మగడ్డ చంద్రశేఖర వర్మ 10 టన్నుల కూరగాయలను శనివారం పంపారు. మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వద్ద చలసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూరగాయల లారీకి పూజ చేసి పచ్చజెండా ఊపి పంపారు. వేంకటేశ్వర భక్త సమాజం యలమంచిలి ఈశ్వరరావు, తోటకూర రాజా పాల్గొన్నారు.

సెంట్రల్‌జోన్ వన్డే క్రికెట్‌లో గుంటూరు జయభేరి

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 15: మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ పురుషుల అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా శనివారం నాటి మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టుపై గుంటూరు 132 పరుగుల భారీ తేడాతో జయభేరి మోగించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు 50 ఓవర్లలో 357/8 పరుగులను చేసింది. బ్యాటర్ చందు (109) సెంచరీతోను, కేఎల్ శ్రీనివాస్ (54), మొహ్మద్ సిద్ధిఖ్ (60) అర్ధసెంచరీలతో రాణించడంతో గుంటూరు భారీ స్కోర్‌ను సాధించింది. పశ్చిమ బౌలర్లలో దీపక్ చందు, సాయిసుశాంత్, పి.భువనేశ్వర్ రెండేసి చొప్పున వికెట్లను తీశారు. 358 పరుగుల భారీ లక్ష్యంతో బరిలో దిగిన పశ్చిమగోదావరి జట్టు 50 ఓవర్లలో 225/8 పరుగులను చేసింది. స్వామి నాయుడు 64, కేఎస్ఎన్ రాజు 87 పరుగులు అర్ధసెంచరీలతో రాణించినా మిగిలిన బ్యాటర్స్ ముందుకు జట్టును నడపించలేకపోయారు. గుంటూరు బౌలర్లలో సుబ్బారావు 4, సిద్ధిక్‌కు 3 వికెట్లు దక్కాయి.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ సభ్యులు

షార్ట్ ఫిలిం పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గవర్నర్‌పేట, జూన్ 15: సెప్టెంబరు 21, 22న నగరంలో జాతీయ తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు షార్ట్ ఫిలిం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీకేఎస్ఎస్ ప్రసాద్, డీవీ రాజు తెలిపారు. శనివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ సెప్టెంబరు 10లోపు షార్ట్ ఫిల్మ్, ప్రైవేట్ పాటల వీడియో, రీల్స్ పంపాలని కోరారు. షార్ట్ ఫిల్మ్‌కు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5 వేలుగా, ప్రైవేట్ పాటల వీడియోకు రూ.5వేలు, 3వేలు, 2వేలు రీల్స్ విజేతలకు రూ.3 వేలు, 2వేలు, వెయ్యి ఫస్ట్, సెకండ్, థర్డ్ బహుమతులుగా నిర్ణయించామన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో అసోసియేషన్ నేతలు డాక్టర్ అశోక్ ఆనంద్, వెంకట్, కిరణ్, రామారావు, విఠల్, విక్రాంతి, వలీ, నాగరాజు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వచ్చి తుదిశ్వాస విడిచిన వృద్ధురాలు



వన్‌టౌన్, జూన్ 15: కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చి ఓ వృద్ధురాలు శనివారం ఆలయంలో స్పృహ తప్పి పడిపోయి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బావాజీపేట 3వ లైన్‌కు చెందిన పులిపాక జానకీ (75) తన సోదరుడితో కలిసి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి శనివారం సాయంత్రం వచ్చారు. దర్శనానంతరం బయటకు వచ్చిన అనంతరం ఆలయ ప్రాంగణంలో స్పృహ తప్పి పడిపోయారు. అనంతరం అక్కడున్న ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఆమెను పరిశీలించి స్పృహ లేకపోవడంతో అంబులెన్స్‌ను పిలిపించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె రాత్రి సమయంలో తుదిశ్వాస విడిచింది. జానకీ తుదిశ్వాస విడిచినట్టు ఆమె కుమారుడు చంద్రశేఖర్ తెలిపారు.

ఉషారామాలో అధ్యాపకులకు శిక్షణ



ఉంగుటూరు, జూన్ 15: మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించి తదనుగుణంగా బోధనా పద్ధతులు అమలుచేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని హైదరాబాద్ ఐఈఈ విశ్రాంత డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.సాయికుమార్ అన్నారు. మండలపరిధిలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు బోధనా పద్ధతులు, ఆవిష్కరణల గురించి 3 రోజులపాటు నిర్వహించిన శిక్షణాతరగతులు శనివారం ముగిశాయి. రిసోర్స్‌పర్సన్ సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులదేనన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులను పారిశ్రామిక ఉత్పత్తులవైపు దృష్టి మళ్లించి, నూతన ఆవిష్కరణలతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అధ్యాపకులు అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. సమన్వయకర్తగా ప్రొఫెసర్ సాగర్ వ్యవహరించారు.

ఏ ఎండకా గొడుగు..!

కేసుల బారినుంచి తప్పించుకునేందుకు వైసీపీ నేతల ప్రయత్నాలు ● గుణదల వైసీపీ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేతో సంబరాలు ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఉదంతం ● గందరగోళంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు

గుణదల, జూన్ 15: రాజకీయం అంటేనే సహజంగా నేటి సమాజంలో ఏ ఎండకు ఆ గొడుకు పట్టే దశలో ఉందని చెప్పేలా ఉంది. నిన్న మొన్నటి వరకు వైసీపీ కార్యాలయంగా ఉన్న భవనంలో కౌంటింగ్ ప్రక్రియ గడచి నిండా 10 రోజులు గడవక ముందే ఓ వైసీపీ నేత కూటమి తరఫున గెలిచిన బీజేపీ ఎమ్మెల్యేను తన ఇంటికి పిలిపించుకుని మా నేత అని చెప్పుకునే ప్రయత్నం చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి బీజేపీ తరఫున ఎన్.ఈశ్వరరావు పోటీచేసి గెలుపొందిన విషయం విదితమే. నగరంలోని 3వ డివిజన్ వైసీపీ కార్యాలయం ఏర్పాటు చేసిన కోనేరు వాసు దేవినేని అవినాష్ గెలుపునకు విశేషంగా కృషి చేశారు. తన సొంత భవనంలో వైసీపీ కార్యాలయం ఏర్పాటు చేసి వైసీపీ బలోపేతానికి కృషిచేశారు. ఇదిలా ఉండగా నగరంలో 3 ఏళ్ల క్రితం జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కోనేరు వాసు 3వ డివిజన్ నుంచి ఎన్నికల బరిలో కార్పొరేటర్‌గా నిలబడ్డ టీడీపీ అభ్యర్థిని కొండపనేని వాణి, ఆమె కుమారుడిపై దాడికి తెగబడ్డాడు. 2021 ఫిబ్రవరి 14న నగరంలో జరిగిన



వైసీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, వైసీపీ అనుచరగణం

ఈఘటన సంచలనం కలిగించింది. ఆ సమయంలో మీకు అండగా నిలబడతానంటూ నారా లోకేష్ వారిని ఫోన్లో పరామర్శించి ధైర్యం చెప్పారు. కూటమి భారీ విజయం సాధించిన కొద్ది గంటలకే గుణదల 3వ డివిజన్ కార్యాలయం వద్ద బ్యానర్లు, ఫ్లెక్సీలన్నీ తీసేశారు. ఇదేంటబ్బా అని స్థానికులు అనుకుంటున్న తరుణంలో ఈనెల 12న అప్పటి వరకు వైసీపీ కార్యాలయంగా ఉన్న భవనం వద్ద బీజేపీ ఎమ్మెల్యే ప్రత్యక్షమవ్వడంతో హడావిడి వాతావరణం నెలకొంది. చంద్రబాబు సీఎంగా కేసరపల్లిలో ప్రమాణ స్వీకారం చేసిన రోజున ఉదయం 8గంటలకే ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అనుచరగణంతో గుణదల చేరుకుని కోనేరు వాసు ఇంటి వద్ద కేక్ కట్ చేయడం బాణాసంచా కాల్చి హడావిడి చేయడంతో స్థానికులు విస్మయం చెందారు. రెడ్‌బుక్ నుంచి తప్పించుకోవాలన్న ఆలోచనతోనే ఈ తరహా క్రియలకు వైసీపీ నేత వాసు పూనుకున్నట్టు స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు భావిస్తున్నారు. ఏది యేమైనా అసలు సిసలైన టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎవరన్నది అధిష్ఠానం గ్రహించి పార్టీకి అండగా నిలబడ్డ వారికి రక్షణగా నిలవాలన్నది స్థానిక టీడీపీ నేత మనోగతం. ఇదే విషయాన్ని టీడీపీ అధిష్ఠానానికి వివరించాలన్న ఆలోచనలో స్థానిక టీడీపీ నేతలు ఉన్నారు. అధిష్ఠానం ఈవిషయమై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అన్నది వేచి చూడాల్సి ఉంది.

మంత్రి పయ్యావుల కేశవ్‌కు సత్కారం

ధర్నాచౌక్, జూన్ 15: రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి ఏపీ స్టేట్ ఆడిట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలిపింది. ఆర్థికశాఖ మంత్రిగా నియమితులైన పయ్యావుల కేశవ్‌ను అసోసియేషన్ నేతలు శనివారం కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాఖలోని పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి త్వరలో శాఖపరంగా ఉన్న అన్ని అంశాలను పరిశీలించి ఉద్యోగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రవిశంకర్, అబ్రహం, కా



పయ్యావుల కేశవ్‌ను సత్కరిస్తున్న సంఘం నేతలు

ర్యనిర్వాహక కార్యదర్శి కిశోర్, కోశాధికారి భాస్కర్, హరికృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

సుద్దాల కాదు.. యుద్ధాల అశోక్‌తేజ

విజయవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీ సాహిత్యంలోని చల్లని వెన్నెల, అగ్నిధార సుద్దాల సాహిత్యంలో కనిపిస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గాంధీనగరంలోని హనుమంతరాయ గ్రంథాలయంలో సుద్దాలకు శ్రీశ్రీ అవార్డును అందజేశారు. మానవాళికి కొత్త జీవన విధానాన్ని శ్రీశ్రీ సాహిత్యం ద్వారా అందజేశారన్నారు. అటువంటి ఉన్నతమైన సాహిత్యాన్ని ప్రజాజీవనానికి అందించి, చిత్రరంగంలో జాతీయ అవార్డును పొందారన్నారు. ఆయన ఒక జనకవి అన్నారు. జాషువా, శ్రీశ్రీని కలిపి చూడాలన్నారు. 1500 చిత్రాలకు 2వేల పాటలు రాసిన సుద్దాల ప్రజల ఆదరాభిమానాలు



అశోక్‌తేజను సన్మానిస్తున్న నేతలు

పొందారన్నారు. ఇండ్ల రామసుబ్బారెడ్డి, రాయవరపు సత్యభామ, ఎక్కంటి సుధాకర్‌బాబు, సింగంపల్లి అశోక్‌కుమార్, ఆంజనేయరాజు, రామలింగ రాజు, సీతారామారావు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఆర్డీవో కార్యాలయంలో బీజేపీ నేతల వినతి

తిరువూరు, జూన్ 15: గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతోపాటు పట్టణంలో ఒకటో వార్డులో గోవులను సంహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పట్టణ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. రాజుపేట కొత్తకాలనీలో ఇద్దరు వ్యక్తులు ఇళ్ల మధ్య గోవధ చేస్తున్నారన్నారు. నాయకులు నాళ్లా సురేష్, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, క్రాంతికుమార్, దారామాధవరావు పాల్గొన్నారు.

విస్సన్నపేట: బక్రీద్ సందర్భంగా మండలంలోని గోవులను వధిస్తే చట్టపరమైన చర్యలుంటాయని ఎస్సై జి.రామకృష్ణ హెచ్చరించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దల తో సమావేశం నిర్వహించారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

గానుగపాడు (తిరువూరు), జూన్ 15: చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని జనవిజ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. గానుగపాడులో శనివారం పర్యావరణ పక్షోత్సవాల్లో భాగంగా, పొగాకు ఉత్పత్తుల వినియోగం నష్టాలు అనే అంశంపై రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కొందరు యువత పొగాకు ఉత్పత్తులకు బానిసలుగా మారుతూ, తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హానికర ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

మైలవరం: మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోయిన యువకుడిపై నుంచి వెనుక వస్తున్న కారు టైర్ ఎక్కడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. జి.కొండూరు మండలం చిన్ననందిగామ గ్రామానికి చెందిన బలుసు మురళి (33) బైక్‌పై మైలవరం బైపాస్‌లో వెళుతూ అదుపుతప్పి కింద పడ్డాడు సరిగ్గా అదే సమయానికి వెనుక వస్తున్న ఓకారు అతని తలపై నుంచి పోవడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృషభం మృతి

పెనుగంచిప్రోలు: డౌన్ సెంటర్‌కు చెందిన బండి వెంకటరత్నం సాధారణ కౌలు రైతుకు చెందిన వృషభం విద్యుదాఘాతంతో పొలంలో శనివారం మృతి చెందింది. ఈ నెల 13న సాయంత్రం వచ్చిన ఈదురు గాలుల వల్ల మునేటి అవతల పొలంలోని విద్యుత్ వైరు తీగ తెగి కింద పడిపోయింది. పశువుల మేతకు వెళ్లిన సమయంలో ఆ వైర్ తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు వెంకటరత్నం తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రాన్స్ కో ఏఈ పూర్ణచంద్రరావు, పశువైద్యాధికారి అనిల్‌కుమార్, వీఆర్వో చైతన్య ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

రసరమ్యంగా.. భామాకలాపం

విజయవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాట్యాచార్యుడు భారత ప్రభుత్వ ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత డాక్టర్ చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన కూచిపూడి భామాకలాపం రసరమ్యంగా సాగింది. సత్యనారాయణపురంలోని ప్రభుత్వ సంగీత కళాశాలలో శనివారం రాత్రి ఈ రూపకాన్ని ప్రదర్శించారు. పారిజాతం అనే పేరుతో సిద్ధేంద్రయోగి రచించిన ఈ భామాకలాపాన్ని చక్కగా నర్తించి అలరించారు. భామనే సత్యభామనే భామరో శృంగార జగభిరామనే ముఖవిజిత హేమాధామనే ద్వారకాపురాధ్యురామనే వయ్యారి సత్యభామనే అనే దరువుతో సాగుతూ సత్యభామ పాడుతుంది. ఆ వెనుక అత్తమామల ప్రశస్తి చెప్పి, సత్యభామ హరి ఎక్కడున్నాడని అడిగి, అనంతరం భూదేవిని ప్రశంసిస్తుంది. తర్వాత దరువు, వెన్నెల పదం, మరికొన్ని దరువులు శ్రీకృష్ణుడితో కలిసి పాడిన సన్నివేశ దరువులు అలరించారు. కృష్ణుడిగా విష్ణుభట్ల పూర్ణలలిత, సత్యభామగా లంక సాయినాగ సుస్మిత, సూత్రధారిగా డాక్టర్ చింతారావు బాలకృష్ణ పాత్రలను పోషించారు. ఈ నృత్యానికి నట్టువాంగం, సూత్రధారుడు చింతా రవిబాలకృష్ణ, గాత్రం వేదాంతం వెంకట దుర్గాభవాని, కవి వెంకట సుబ్రహ్మణ్యప్రసాద్, మృదంగంపై పసుమర్తి హరనాథ శాస్త్రి, వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయులు, ఫ్లూట్‌పై సొలాపురపు వనమాలిలు సహకరించారు. అనంతరం కళాకారులను భాగవతుల శ్రీనివాస్, సీహెచ్ అజ్‌కుమార్, జి.వెంకటరావు, వి.అనంతలక్ష్మిని సత్కరించారు.

చంద్రబాబుతో పారిశ్రామికాభివృద్ధి

● దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అమరావతి జోన్ అధ్యక్షురాలు రాజమణి

పటమట, జూన్ 15: సీఎం చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగం శరవేగంగా పురోభివృద్ధి చెందుతుందని దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అమరావతి జోన్ అధ్యక్షురాలు వి.రాజమణి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక సూక్ష్మ, మధ్యతరగతి కంపెనీల ఏర్పాటుకు గతంలో మాదిరిగానే ప్రోత్సాహం ఇవ్వాలని ఆమె సీఎం చంద్రబాబును కోరారు. తమ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు పదవీబాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పారిశ్రామిక రంగం చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు ఇబ్బందుల్లో ఉన్నాయని, ఈ సమస్యలపై సీఎం దృష్టి సారించాలన్నారు. త్వరలోనే తమ చాంబర్‌తరఫున చంద్రబాబును కలిసి అభినందనలు తెలియచేస్తామన్నారు. సౌత్‌జోన్ కో-ఆర్డినేటర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. చాంబర్ ప్రతినిధులు జి.బుజ్జిబాబు, తాడి నాగరాజు, లలిత, భరత్, జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి నాంది పడింది

● విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

గన్నవరం: వాణిజ్య రాజధాని ముంబై నుంచి గన్నవరానికి విమాన సర్వీసు రావటం అభినందనీయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గన్నవరం విమానాశ్రయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి నాంది పడిందన్నారు. భవిష్యత్‌లో మరెన్ని సర్వీసులు వస్తాయన్నారు. చంద్రబాబు మార్క్ కొనసాగుతుందన్నా రు. ఈ విమానాశ్రయం నుంచి దేశవిదేశాలకు రాకపోకలు సాగించవచ్చన్నారు. గత ప్రభుత్వ హయాం లో విమాన సర్వీసులతో పాటు అన్ని సర్వీసులు ర ద్దు అయ్యాయన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అ య్యాక అన్ని సర్వీసులు ముందుకు వస్తున్నాయన్నా రు. కేంద్రంలో ఏవియేషన్ మంత్రిగా రామ్మోహన్ నాయుడు ఉండటంతో ఎయిర్‌పోర్టు అభివృద్ధి మ రింత సులభతరం అవుతుందన్నారు. ఎంపీలుగా సమష్టి కృషితో అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు.

రాజధాని అమర వీరుల స్మారక స్థూప నిర్మాణ కమిటీ: పోతుల

ధర్నాచౌక్: అమరావతి ఉద్యమంలో అసువులు బాసిన అమరావతి అమర వీరుల స్మారక స్థూపాన్ని నిర్మించేందుకు నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసినట్టు అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. స్మారక కమిటీ గౌరవాధ్యక్షుడిగా యలమంచిలి ప్రసాద్, సలహాదారుగా ఉన్నం మురళీధర రావు, అధ్యక్షుడిగా పోతుల బాలకోటయ్య, ఉపాధ్యక్షులుగా వేనుగుంట రాజర్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శిగా రాయపాటి శైలజతో పాటుగా అమరులైన వారి కుటుంబ సభ్యులు, ఉద్యమానికి బాసట గా నిలిచిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, రా ష్ట్రంలోని మూడు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, మేధావులు 25మందితో సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని రై తులతో పాటు ఎందరో అమాయకుల ప్రాణాలు కో ల్పోతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాజకీయ విశ్లేషకుడు ముప్పా అంకమ్మరావు, కనకదుర్గ దేవాలయం బోర్డు మాజీ సభ్యుడు గూడపాటి పద్మ శేఖర్, రైతు కంచర్ల గాంధీ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతో బీసీలకు మంచి రోజులు: శొంఠి

విద్యాధరపురం: సీఎం చంద్రబాబు పాలనతో బీసీలకు మంచి రోజులొచ్చాయని కృష్ణాజిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ శొంఠి శివరాంప్రసాద్ గౌడ్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయం లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో జగన్‌రెడ్డి పాలన లో బీసీలు అన్ని విధాలుగా మోసపోయారని, రా జ్యాంగం కల్పించిన హక్కులను దూరం చేసి ఆర్థిక ఎదుగుదలకు ఆటంకం కల్పించారన్నారు. కులాలు గా విడగొట్టి రాజకీయ పదవులను పరిమితం చేశాడన్నారు. జగన్‌రెడ్డి లాంటి రాక్షసుడిపై పోరాటం చేయడంలో బీసీల పాత్ర ఎంతో ప్రముఖంగా ఉందన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుంటుందని బీసీలకు మంచి అవకాశాలు వ చ్చాయని, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగే అవకాశం వచ్చిందన్నారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్ మంత్రులయ్యారని వీరంతా బీసీలకు అండగా ఉంటూ ఆ కుటుంబాలను ఆదుకునే బాధ్యత తీసుకుంటారన్నారు. సంగెపు రంగారావు, పీతా గోపీచంద్, వీరంకి కుటుంబరావు, ఆరేపల్లి దాసు, తాడిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

శిశుపాలుడికి మించిన జగన్ పాపాలు: కొట్టేటి

విద్యాధరపురం: మాజీ సీఎం జగన్‌రెడ్డి శిశుపాలుడి కంటే ఎక్కువ పాపాలు చేశాడని మాజీ ఫ్లోర్‌లీడర్ కొట్టేటి హనుమంతరావు విమర్శించారు. గురునానక్ కాలనీలోని ఎన్‌టీఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబును శిశుపాలుడంటూ జగన్‌రె డ్డి వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నా రు. జగన్‌రెడ్డి తన హయాంలో చేసిన పాపాలకు లెక్కలేదన్నారు. జగన్ నిరంకుశ పాలనకు విసుగుచెందిన ప్రజలు కూటమికి పట్టంకట్టారన్నారు. ప్ర జాగ్రహాన్ని చూసినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. శి శుపాలుడి కన్నా లెక్కలేనన్ని పాపాలు చేశాడు కాబ ట్టే ప్రజలు తమ తీర్పులో తనకు ప్రతిపక్షహోదా కూడా ఇవ్వలేదన్నది గుర్తు పెట్టుకుని జగన్ మాట్లాడాలన్నారు. విషపూరిత మాటలతో ఇంకా ప్రజలను మభ్యపెట్టాలని చూడడం అవివేకమన్నారు. చంద్రబాబు అభివృద్ధి పథం వైపు నడుస్తున్నారన్నారు.

రేపు స్టేడియంలో ఈద్ నమాజ్

లబ్బీపేట: బక్రీద్ సందర్భంగా సోమవారం ఐజీఎంసీ స్టేడియం నందు ఈద్ నమాజ్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం 7గంటలకు ఈద్ సందేశం, 7.30 గంటలకు ఈద్ నమాజ్ జరుగుతుందని, అందుకవసరమైన ఏర్పాట్లు చేశామని, ముస్లింలంతా పాల్గొనాలన్నారు.



టీడీపీ కార్యాలయంలో నేతలతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కింది స్థాయిలోనూ భారీ అవినీతి!

- తప్పి తీద్దామని చంద్రబాబుకు టీడీపీ నేతల ప్రతిపాదన
- సమాచారం తెప్పిస్తే ఏం చేయాలో ఆలోచన చేద్దామన్న సీఎం
- నేతలకు సహకారం అందించాలని మంత్రులకు సూచన

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పైస్థాయిలో జరిగిన అవినీతికి సమానంగా కింది స్థాయిలో భారీ అవినీతి జరిగిందని, దానిని తప్పి తీద్దామని టీడీపీ నేతలు సీఎం చంద్రబాబు వద్ద ప్రతిపాదించారు. శనివారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో సీఎం కొంతసేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్రయాదవ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. 'వైసీపీ హయాంలో కనీ వినీ ఎరుగని స్థాయిలో భూ దోపిడీ జరిగింది. వేల ఎకరాల భూమిని కింది స్థాయిలో వైసీపీ నేతలు స్వాహా చేశారు. ఇళ్ల స్థలాలకు భూముల కొనుగోలులో వందల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగాయి. ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లు వేసి అయినకాడికి దోచుకున్నారు. ఓటర్ల జాబితాలు ముందు పెట్టుకొని ఆ పేర్లు రాసి కూలీల పేరుతో వేతనాలు జేబుల్లో వేసుకున్నారు. నాడు నేడు పేరుతో స్కూళ్లలో జరిగిన పనుల్లో అక్రమాలకు అంతే లేదు. చివరకు మంచినీటి సరఫరాకు వినియోగించే ట్యాంకర్ల బిల్లుల్లో కూడా మేసేశారు. వీటన్నింటిపైనా మేం జిల్లాల్లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు మనం వీటన్నింటినీ వెలికితీయాలి. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక సెల్ ఏర్పాటు చేసి అన్ని జిల్లాల నుంచి సమాచారం తెప్పించి దాని ఆధారంగా విచారణకు ఆదేశించాలి' అని ఆయన సూచించారు. ఈ సూచనకు సమావేశంలో పాల్గొన్న ఇతర నేతలు మద్దతు తెలిపారు. ఇది మంచి సూచనని, పార్టీ వద్ద ఉన్న సమాచారం తెప్పిస్తే ఏం చేయాలో ఆలోచన చేద్దామని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ విషయంలో నేతలకు సహకారం అందించాలని మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధికి ఆయన సూచించారు. ఇరిగేషన్ వ్యవహారాల్లో అనుభవం ఉన్న మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు సలహాలు తీసుకోవాలని నిమ్మలకు చెప్పారు.

ఏయూను ప్రక్షాళన చేయండి

- గత ఐదేళ్లుగా వైసీపీ కోసం వర్సిటీ వనరులు, నిధులు దుర్వినియోగం
- ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకలు
- సీఎంకు న్యాయ విద్యార్థిని అంజన ప్రియ ఫిర్యాదు
- విచారణకు సిటింగ్ జడ్జి/ప్రత్యేక బృందాన్ని నియమించాలని విజ్ఞప్తి

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని, ప్రక్షాళన చేయాలని న్యాయ విద్యార్థిని సత్యాల అంజన ప్రియ ముఖ్యమంత్రి చంద్రబాబుకు శనివారం ఫిర్యాదు చేశారు. వర్సిటీలో గడిచిన ఐదేళ్లలో అవినీతి, అధికార దుర్వినియోగం పెరిగిపోయాయని, రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను ఉపయోగించుకున్నారని ఆమె సీఎంవోకు మెయిల్ ద్వారా చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి బాధితురాలిగా ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువస్తున్నట్టు వెల్లడించారు. గతంలో వర్సిటీలో జరుగుతున్న అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినందుకు హాస్టల్ వార్డెన్ వేధించారన్నారు. తన ఫిర్యాదుపై ఏయూ వీసీ విచారణ చేపట్టకుండా తనను అలవాటుదారు ఆర్టీఐ దరఖాస్తుదారునిగా తప్పుడు ముద్ర వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై భారత ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ)కు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. వర్సిటీ వనరులు, నిధులు, వైసీపీ కోసం దుర్వినియోగం అయిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆమె తెలిపారు. ఆయన పాలనను విద్యార్థులు, ఉద్యోగులు ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో అణిచివేశారని ఆమె ఆరోపించారు. యూజీసీ నిధులు దుర్వినియోగం, అవినీతి, ప్రొఫెసర్ల నియామకాల్లో అవకతవకల గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశానని, అయినా విచారణ మాత్రం చేపట్టలేదన్నారు. వర్సిటీలో జరిగిన అక్రమాలపై తక్షణమే సిటింగ్ జడ్జి/ప్రత్యేక బృందాన్ని నియమించి విచారణ జరిపించాలని ఆమె తన లేఖలో సీఎంను కోరారు. వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఏయూలో అవినీతిని నిర్మూలించి, అవినీతిపరులను తొలగించి ప్రక్షాళన చేయాలని ఆమె కోరారు. రాజకీయాలు లేని పరిపూర్ణమైన అధ్యయన వాతావరణంతో కూడిన విద్యా సంస్థను విద్యార్థులకు బహుమతిగా సీఎం అందిస్తారని తాను ఆశిస్తున్నానన్నారు.

రమేష్ కార్తీక్ నాయక్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం

- ఆయన రచించిన 'ఢావ్లో' కథా సంపుటికి దక్కిన గౌరవం
- చంద్రశేఖర్ ఆజాద్‌కు బాల సాహిత్య పురస్కారం
- ఆయన రాసిన 'మాయాలోకం' నవల ఎంపిక



న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ 2024 సంవత్సరానికి యువ, బాలసాహిత్య పురస్కారాలను ప్రకటించింది. ఈ ఏడాదికి ప్రముఖ బంజారా యువ రచయిత రమేష్ కార్తీక్ నాయక్‌కు ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత పి.చంద్రశేఖర్ ఆజాద్‌ను బాల సాహిత్య పురస్కారం వరించింది. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన జరిగిన కార్యనిర్వాహక మండలి సమావేశంలో ఈ ఏడాదికి 23 మంది యువ రచయితలకు యువ పురస్కారాలు, 24 మంది రచయితలకు బాల సాహిత్య పురస్కారాలను అందించాలని నిర్ణయించినట్లు అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు శనివారం వెల్లడించారు. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్‌నగర్ తండాలో జన్మించిన రమేష్ కార్తీక్ నాయక్ రచించిన 'ఢావ్లో' గోర్ బంజారా కథాసంపుటి సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైంది. ప్రొఫెసర్ సూర్యధనుంజయ్, ఆర్.సీతారామరావు, శిఖామణితో కూడిన న్యాయనిర్ణేతల బృందం రమేష్ కార్తీక్ నాయక్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. రమేష్ కార్తిక్ పదో తరగతి నుంచే రచనలు చేస్తున్నారు. ఆయనకు ఇంతకు ముందు రావిశాస్త్రి కథా పురస్కారం, చిలకమర్తి లక్ష్మీనరసింహం పురస్కారాలతోపాటు అనేక అవార్డులు లభించాయి. గోర్ బంజారాల జీవితం, వారి సంస్కృతి, సంప్రదాయాలను 'బల్దేర్ బండి' కవిత్వం, 'ఢావ్లో' కథ సంపుటి, 'చక్ మక్' ఆంగ్ల కవిత్వం ద్వారా అక్షర బద్ధం చేశారు. కార్తీక్ నాయక్ రచించిన 'జారేర్ బాటి(జొన్న రొట్టెలు)' కవితను కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఖమ్మంలోని ఓ కళాశాల డిగ్రీ కోర్సు ఐదో సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎంఏ తెలుగు నాలుగో సెమిస్టర్ పాఠ్యాంశాల్లో 'బల్దేర్ బండి' కవితా సంపుటిని చేర్చారు. చాలా రోజుల తర్వాత కలిసిన బంధు మిత్రులను ఆలింగనం చేసుకొని దుఃఖించడం గోర్ బంజారాల సంస్కృతిలో భాగం. అలా కన్నీరు పెట్టడాన్ని లంబాడా భాషలో 'ఢావ్లో' అంటారు. ఆ పేరుతో వెలువడిన కథా సంపుటిలో గిరిజనుల బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టే ఎనిమిది కథలు ఉన్నాయని రచయిత చెప్పారు.

బాల సాహిత్యంలో ఆజాద్ ప్రయోగాత్మక రచనలు

డీకే చదువుల బాబు, సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి, పీఎస్ గోపాలకృష్ణతో కూడిన న్యాయనిర్ణేతల బృందం ఆజాద్‌ను బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసింది. ఆయన రాసిన 'మాయాలోకం' నవల ఈ పురస్కారానికి ఎంపికైంది. పదేళ్లు దాటిన పిల్లల కోసం రాసిన ఈ నవలకు 2021 తానా బాల సాహిత్య పోటీలో బహుమతి లభించింది. చంద్రశేఖర్ ఆజాద్ స్వస్థలం గుంటూరు జిల్లా వెల్లటూరు. ఆయన తొమ్మిది వందలకు పైగా కథలు, 90కి పైగా నవలలు, 'రాధామధు', 'లయ', 'ఎదురీత' తదితర టెలివిజన్ సీరియళ్లకు సంభాషణలు రాశారు. చంద్రశేఖర్ ఆజాద్ బాలల కోసం వందకు పైగా కథలు, పదికి పైగా నవలలు, పలు రేడియో నాటికలు రచించారు. బాల సాహిత్యంలో తన మొట్టమొదటి రచన 'అందమైన పూలతోట' నవల 1983లో ఆంధ్రజ్యోతి లో ప్రచురితమైందని తెలిపారు. కాగా యువ, బాల సాహిత్య పురస్కారాలకు ఎంపికైన వారికి రూ.50 వేల చొప్పున నగదు, రజత పతకాలు ఇస్తారు.

'విమానానికి' వీడనున్న చెర!

- బెజవాడ విమానాశ్రయంలో ఇక సీఐఎస్ఎఫ్ భద్రత
- ఇప్పటి వరకు రాష్ట్ర పోలీసులతోనే నిర్వహణ
- తాడేపల్లి ప్యాలెస్ కనుసన్నల్లో అక్రమాల ఆరోపణలు
- జూలై 2న రానున్న 250 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది
- రాష్ట్ర బలగాలను ఉపసంహరించుకోవాలని డీజీపీకి లేఖ
- సిబ్బంది క్వార్టర్స్‌నూ ఖాళీ చేయాలని ఏఏఐ స్పష్టీకరణ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)



రాష్ట్ర పోలీసుల చెర నుంచి విజయవాడ(గన్నవరం) విమానాశ్రయానికి విముక్తి కలగబోతోంది. త్వరలో ఈ విమానాశ్రయం కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లబోతోంది. ప్రస్తుతం ఇక్కడ రాష్ట్ర పోలీసు విభాగం పరిధిలోని ఎస్పీఎఫ్, ఏపీఎస్పీ, ఆక్టోపస్ సిబ్బంది భద్రతా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ బలగాలను ఉపసంహరించుకోవాలని విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి డీజీపీకి లేఖ రాశారు. ఈ బలగాల స్థానంలో సీఐఎస్ఎఫ్ బలగాలను భద్రతకు నియమిస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు. విమానాశ్రయ సిబ్బందికి సంబంధించిన క్వార్టర్స్‌లో రాష్ట్ర పోలీసులు ఉంటున్నారని, వాటిని తక్షణమే ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు విజయవాడ విమానాశ్రయ భద్రతను రాష్ట్ర పోలీసులకు అప్పగించారు. 2019 నుంచి ఈ విమానాశ్రయం ద్వారా జగన్ అండ్ కో అనేక వ్యవహారాలను చక్కబెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రముఖుల ముసుగులో భారీగా బ్యాగ్‌లను తీసుకురావడం, తీసుకెళ్లడం చేసేవారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో పని చేసిన అధికారుల కనుసన్నల్లో బంగారం విమానాశ్రయం ద్వారాలు దాటి వచ్చిందన్నది బహిరంగ రహస్యం. ఈ వ్యవహారాలు సజావుగా సాగాలంటే రాష్ట్ర పోలీసుల భద్రత అయితేనే మంచిదన్న భావనతో ఇక్కడ ఎస్పీఎఫ్, ఏపీఎస్పీ, ఆక్టోపస్ బలగాలను నియమించినట్టు ఆరోపణలున్నాయి. ఆగమన, నిష్క్రమణ ద్వారాల వద్ద, రన్‌వేల దగ్గర, కార్గో పాయింట్ల వద్ద వారు భద్రతను నిర్వర్తిస్తున్నారు.

ఎంవోయూను అడ్డుపెట్టుకుని..

విజయవాడ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ భద్రత ఏర్పాటు చేయాలని 2017లోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ భావించింది. అయితే, 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని తొక్కిపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా జరిగిన ఎంవోయూను సాకుగా చూపి సీఐఎస్ఎఫ్ బలగాలు రాకుండా కుట్రలు పన్నింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా 2007లో గన్నవరం కేంద్రంగా విజయవాడ విమానాశ్రయ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పుడు విమాన ప్రయాణాలకు హైదరాబాద్ కేంద్రంగా ఉండేది. సేవలు అప్పుడప్పుడే ప్రారంభమవ్వడంతో ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. విమానాశ్రయం అభివృద్ధి చెందే వరకు రాష్ట్ర పోలీసు విభాగంతోనే భద్రత కల్పించాలన్నది అందులోని సారాంశం. దీన్ని అదునుగా చేసుకుని మాజీ సీఎం జగన్ సొంత ప్రణాళికలను అమలు చేశారు. విజయవాడ విమానాశ్రయం దశలవారీగా అభివృద్ధి చెందినా జగన్ అండ్ కో వ్యవహారాలు గుట్టుచప్పుడు కాకుండా జరగాలంటే రాష్ట్ర పోలీసులు ఉంటేనే మంచిదని భావించారు. ఎస్పీఎఫ్, ఏపీఎస్పీ, ఆక్టోపస్, స్థానిక పోలీసులతో మొత్తం 273 మందిని భద్రతకు ఏర్పాటు చేశారు. విమానాశ్రయ సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్‌లో వారికి నివాసం ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయ సర్వీసుల ప్రారంభంతో..

విజయవాడ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభంకావడంతో కేంద్ర బలగాల భద్రత అనివార్యమైంది. దీన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా చేయాలని గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు సంకల్పించారు. దీంతో 2018 డిసెంబరులో ఇక్కడి నుంచి అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత వాటికి బ్రేక్ పడింది. తిరిగి 2022 అక్టోబరులో అంతర్జాతీయ సర్వీసులను పునరుద్ధరించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన సెన్సిటివ్ విమానాశ్రయాల జాబితాలో విజయవాడ ఒకటి. ఈ తరహా విమానాశ్రయాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలను భద్రత కోసం నియమించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. త్వరలో ఇక్కడికి 240-250 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది జనవరిలోనే సీఐఎస్ఎఫ్ రావాల్సి ఉండగా, తర్వాత మార్చికి వాయిదా పడింది. ఇంతలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల విధులకు పంపడం వల్ల అది సాధ్యపడలేదు. వచ్చే నెల రెండున సీఐఎస్ఎఫ్ బృందం వస్తుందని ఏఏఐ ఉన్నతాధికారులు విజయవాడ ఎయిర్‌పోర్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటి నుంచి విమానాశ్రయం భద్రత సీఐఎస్ఎఫ్ ఆధీనంలోకి వెళ్తుంది. దీంతో రాష్ట్ర పోలీసు సేవలను ఉపసంహరించుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి డీజీపీకి లేఖ రాశారు. ఇకపై విమానాశ్రయం బయటి ప్రదేశాలు మాత్రమే స్థానిక పోలీసుల పరిధిలో ఉంటాయి.



తిరుమల ఆలయం వద్ద సుమన్

హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబే కారణం

- ఏపీ రాజధాని కూడా అలా రూపొందాలి: సినీ నటుడు సుమన్

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ముఖ్యంగా గచ్చిబౌలి వంటి ప్రాంతానికి వెళితే హైదరాబాద్‌లో ఉన్నామా లేక న్యూయార్క్‌లో ఉన్నామా అనే భావన కలుగుతోందని, ఇంతటి అభివృద్ధికి కారణం చంద్రబాబే అని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీ రాజధాని కూడా అంత అందంగా తయారుకావాలంటే నిర్మాణ పనులు వేగంగా జరగాలన్నారు. అందుకు అందరూ సహకరించాలన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని.. చంద్రబాబు, పవన్, బీజేపీ కూటమి గెలవడం రాజకీయాల్లోనే కొత్త ట్విస్ట్ అన్నారు. ఐదేళ్లు వెనక్కి వెళ్లిన ఏపీని ప్రజలు మళ్లీ ముందుకు తీసుకువచ్చారన్నారు. ఏపీలో కూడా పలు ప్రాంతాల్లో చిన్నపాటి సినిమా స్టూడియోలు వస్తే రెవెన్యూ పెరగడంతో పాటు అనేకమంది కళాకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ దిశగా నూతన ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు అధిక సంఖ్యలో నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని, అది కష్టమే అయినప్పటికీ సీఎం చంద్రబాబు చేస్తారన్న ఆశాభావాన్ని సుమన్ వ్యక్తంచేశారు.

సీఎస్, పీఎస్‌లను కలిసిన సచివాలయ ఉద్యోగులు

విజయవాడ(పాయకాపురం), జూన్ 15 : రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్రలను ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీలను అసోసియేషన్ సభ్యులు శుక్రవారం వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జీ.వీ.వీ.రాఘవరెడ్డి ఈ సందర్భంగా సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్రలకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా, కార్యదర్శి పులిబండ్ల నరసింహారావు, మహిళా పోలీసు విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు మల్లెల విజయలక్ష్మి పాల్గొన్నారు.

త్వరలో తగ్గనున్న పప్పు దినుసుల ధరలు

- తూర్పు ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతులు

న్యూఢిల్లీ, జూన్ 15: ఎల్ నినో కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడ్డ పప్పు దినుసుల కొరత త్వరలో తీరనుంది. జూలై నుంచి దిగుమతులు రానుండటంతో ధరలు తగ్గే అవకాశముందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరె వెల్లడించారు. గతేడాది ప్రతికూల వాతావరణం, అస్థిరమైన రుతుపవనాల కారణంగా దేశంలో పప్పు దినుసుల దిగుబడి బాగా తగ్గింది. కాయ ధాన్యాలు, తృణధాన్యాలు, గోధుమలు, బియ్యం, చక్కెర ఉత్పత్తులు తగ్గాయి. దీంతో డిమాండ్‌కు తగినట్టు దిగుబడులు లేకపోవడంతో ధరలపై ప్రభావం పడింది. ముఖ్యంగా బఠానీలు, శనగల ధరలు పెరగాయి. త్వరలో ఈ పరిస్థితి మారనుంది. 'శుభవార్త ఏమిటంటే ఎల్ నినో ముగిసింది. లా నినా రావడానికి సిద్ధంగా ఉంది. సానుకూల రుతుపవనాల కారణంగా సాగు ఆశాజనకంగా ఉంటుంది. ఇది మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిస్తుంది. అలాగే ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో తూర్పు ఆఫ్రికా దేశాల నుంచి పప్పు దినుసుల దిగుమతులు వచ్చే అవకాశముంది. దీని వల్ల డిమాండ్-సప్లయ్ మధ్య వ్యత్యాసం తగ్గుతుంది. దీంతో ధరలు తగ్గేందుకు దోహదపడుతుంది' అని నిధి ఖరె వివరించారు.

ఇంటర్ మూల్యాంకనంలో

స్కానింగ్ స్కామ్!

- అస్మదీయ కాంట్రాక్టర్ల కోసమే ఆన్‌లైన్ విధానం
- హైదరాబాద్‌లోని మాగ్నెటిక్ కంపెనీకి కాంట్రాక్టు
- పేపరుకు రూ.25 చొప్పున 4కోట్లు సమర్పయామి
- మాజీ మంత్రి బొత్స హస్తం ఉందని ఆరోపణలు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేయించాలని తీసుకున్న నిర్ణయం వెనుక స్కానింగ్ స్కాం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం అస్మదీయ కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకేనని స్పష్టమవుతోంది. విద్యార్థుల చదువులను పణంగా పెట్టి మరీ ఆన్‌లైన్ మూల్యాంకనం చేయించాలని వైసీపీ ప్రభుత్వం హడావుడిగా నిర్ణయించింది. అదీ ఎన్నికల సమయంలో ఇంత కీలక నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకుంది. దీని వెనుక విద్యాశాఖ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హస్తం ఉన్నట్లు ఇంటర్ విద్యాశాఖలో ప్రచారం జరుగుతోంది. కొందరు అధికారులు కూడా దీనికి పూర్తిస్థాయి సహకారం అందించారు. మరోవైపు పదో తరగతిలోనూ ఈ అడ్డగోలు విధానాన్ని ప్రవేశపెట్టారు. దాని ఫలితంగానే ఇప్పటివరకూ టెన్త్ గణితం సమాధాన పత్రాల మూల్యాంకనం పావు వంతు కూడా పూర్తికాలేదు.

ఆ కంపెనీకే ఎందుకు?

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల సమాధాన పత్రాలను ఆన్‌లైన్‌లోనే మూల్యాంకనం చేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే పరీక్షలు ముగిసేవరకూ దీనిపై జూనియర్ లెక్చరర్లకు సమాచారం ఇవ్వలేదు. హైదరాబాద్‌కు చెందిన మాగ్నెటిక్ స్కానర్స్ అనే కంపెనీకి ఏకపక్షంగా ఈ కాంట్రాక్టు ఇచ్చినట్లు తెలిసింది. పేపర్ల స్కానింగ్ కోసం ఆ కంపెనీ మెషీన్లు కొనుగోలు చేసి రాష్ట్రంలోని ఆరు కేంద్రాల్లో ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఇంటర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలు 5లక్షల మంది విద్యార్థులు రాయగా, దాదాపు 12.7 లక్షల సమాధాన పత్రాలు ఉన్నాయి. ఒక్కో పేపరు స్కానింగ్ చేసినందుకు ఆ కంపెనీకి రూ.25 ఇస్తున్నట్లు తెలిసింది. అలాగే పదో తరగతిలో 50వేల గణితం పేపర్లు కూడా ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేస్తున్నారు. ఇవికాకుండా ఇతరత్రా ఖర్చులు కలిపి మొత్తం రూ.4కోట్లు ఆ కంపెనీకి చెల్లిస్తున్నారు. అయితే విద్యార్థుల పేపర్లను సకాలంలో స్కానింగ్ చేయడంలో మాగ్నటిక్ కంపెనీ విఫలమైంది. విద్యార్థి ఎన్ని పేజీల్లో సమాధానం రాసినా మొత్తం 24 పేజీల బుక్‌లెట్‌ను స్కానింగ్ చేయాలి. ఇది చాలా ఎక్కువ సమయం తీసుకుంది. టెన్త్‌లో గణితం ఒక్క సబ్జెక్టే అయినా రెండు రోజుల కిందటి వరకూ స్కానింగ్ పూర్తికాలేదు. సమాధాన పత్రాల్లో కొన్నిచోట్ల చేతివేళ్లు కనిపిస్తుండటంతో అవి ఫోన్లలో తీశారేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వర్ సామర్థ్యం చాలకపోవడంతో పేపర్లు డౌన్‌లోడ్ కావట్లేదు. శనివారం ఉదయం గంటసేపు కంప్యూటర్ ముందు కూర్చున్నా ఒక్క పేపర్ కూడా ఓపెన్ కాలేదని జూనియర్ లెక్చరర్లు చెబుతున్నారు.

ఫలితాలు ఇప్పట్లో లేనట్టే

ఈనెల 1న ఇంటర్ కాలేజీలు తెరుచుకున్నాయి. మరోవైపు డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం కాబోతున్నాయి. గతేడాది జూన్ 13న సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కాగా ఈ ఏడాది ఇప్పట్లో ఇచ్చే పరిస్థితి లేదు. ఒక్కో జేఎల్ రోజుకు పది పేపర్లు కూడా దిద్దలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు చేసిన నిర్వాకంతో విద్యార్థులు ఎటూ కాకుండా పోయే పరిస్థితి నెలకొంది. కేవలం కమీషన్ల కోసమే విద్యార్థుల చదువులను పణంగా పెట్టి ఆన్‌లైన్ విధానాన్ని ఎంపిక చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి.

చంద్రబాబు అండతోనే ఎన్‌డీఏ మనుగడ

- బీజేపీ దూకుడుకు కళ్లెం వేసిన ఘనత 'ఇండియా'దే
- కోయంబత్తూరు కూటమి విజయోత్సవ సభలో సీఎం స్టాలిన్



చెన్నై, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నా చిరకాల ఆత్మీయ మిత్రుడు, ఏపీ సీఎం చంద్రబాబు అండతోనే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మనగలుగుతోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. చంద్రబాబు, బిహార్ సీఎం నితీశ్ కుమార్ చలువతో కొనసాగాల్సిన అగత్యం ఆ మైనారిటీ ప్రభుత్వానికి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. కోయంబత్తూరులో శనివారం సాయంత్రం జరిగిన ఇండియా కూటమి విజయోత్సవం, కరుణ శతజయంతి వేడుకల ముగింపు సభ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. '400 స్థానాలు సాధిస్తామంటూ గొప్పలు చెప్పుకున్న బీజేపీ దూకుడుకు కళ్లెం వేసి, 240 సీట్లకే పరిమితం చేసిన ఘనత మా కూటమికి దక్కుతుంది. 28 పార్టీలతో ఇండియా కూటమి ఏర్పాటైనప్పటి నుండి బీజేపీ పాలకుల గుండెల్లో గుబులు పుట్టింది. ప్రధాని నరేంద్రమోదీ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మైనారిటీలకు వ్యతిరేకంగా విమర్శలు చేసినా దేశ ప్రజలెవ్వరూ పట్టించుకోలేదు. మత విద్వేషాలపై ఆధారపడేవారికి ఈ వ్యవహారం చెంపపెట్టులాంటిది. సభకు ఇండియా కూటమికి చెందిన రాష్ట్ర నేతలు, 40 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

కిషన్‌రెడ్డితో పెమ్మసాని భేటీ

న్యూఢిల్లీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఆయనతో కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు మంత్రులు కలిసి అల్పాహారం తీసుకున్నారు. కిషన్‌రెడ్డి వంటి అనుభవజ్ఞులు, నిబద్ధత కలిగిన నాయకునితో కలిసి కేంద్ర మంత్రివర్గంలో పనిచేయడం గర్వంగా, ఆనందంగానూ ఉందని పెమ్మసాని ఎక్స్ వేదికగా తెలిపారు. కాగా, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయమంత్రిగా ఇటీవల నియమితులైన శ్రీనివాస వర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

'రేషన్'లో అవినీతి తేలుస్తాం: మంత్రి నాదెండ్ల

తెనాలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో భారీ అవినీతి జరిగింది. గత ప్రభుత్వం అనేక అవతవకలకు పాల్పడిందనడానికి సరకుల నాణ్యత, తూకంలో వ్యత్యాసాలే ఉదాహరణ. నాణ్యమైన సరుకయినా లబ్ధిదారులకు అందించారా అంటే అదీలేదు. ఒక్క విషయంలోనూ జవాబుదారీతనం లేదు. అన్ని లెక్కలూ తేల్చుతాం. ఈ కుంభకోణాల్లో బాధ్యులైనవారిని ఎవరినీ వదిలేది లేదు' అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో విజయవాడ అశోక్‌నగర్‌లో గల సివిల్ సప్లయిస్ ప్రధాన కార్యాలయానికి విచ్చేశారు. చైర్మన్ చాంబర్‌లో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అత్యంత నిరాడంబరంగా ఈ కార్యక్రమాన్ని ముగించిన అనంతరం.. మంత్రి గుంటూరు జిల్లా తెనాలిలో పర్యటించారు. పౌరసరఫరాల శాఖ గోదాములు, చౌకడిపోలు, ఎండీఎఫ్ వాహనాల్లో సరుకుల పంపిణీపై ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బియ్యం నిల్వ ఉంచిన గోదాములో అంతా పురుగులు తిరుగుతుండటం, వాటిని నియంత్రించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంపై మండిపడ్డారు. పేదలకు పంపిణీ చేసే బియ్యంపై ఇంత అలుసైతే ఎలా అని ప్రశ్నించారు. తర్వాత ఎం.ఎల్.ఎస్ పాయింట్‌లో ఉన్న కందిపప్పు, పంచదార, పామాయిల్ ప్యాకెట్‌లను పరిశీలించారు. అనుమానం వచ్చి కందిపప్పు ప్యాకెట్ ఒకటి తూకం వేయించగా, దానిలో 50 గ్రాములకుపైగా వ్యత్యాసం వచ్చింది. దీంతో.. 'ఈ తేడా ప్రతి ప్యాకెట్‌లో వస్తే రాష్ట్ర వ్యాప్తంగా లక్షల టన్నులు మాయమైపోయినట్టేకదా? ఇట్లా వస్తుంటే ఏం చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ అధికారులను మంత్రి ప్రశ్నించారు. సరుకులు ఎలా వస్తే అలాగే పంపిణీ చేస్తున్నామని అధికారులు బదులివ్వడంతో.. ఆయన మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదవాడికి అందించే ఆరకిలోలో కూడా కక్కుర్తి చూపిస్తుంటే మీరేం చేస్తున్నారని నిలదీశారు. వారి నుంచి ఎటువంటి సమాధానం లేకపోవటం, సరకు కూడా నాసిరకంగా ఉండటంతో వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా సరకుల పంపిణీని ఆపేయాలని, మొత్తం ఆడిట్ చేసి వారంలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై ఫోన్‌లో ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఎక్కడ అవకతవకలు జరిగినా వదలకుండా మొత్తం నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు. అయితే లబ్ధిదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, సరకులు సకాలంలో అందుతాయని పేర్కొన్నారు.

వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారు!

మంత్రి నాదెండ్ల మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ కాలంలో ప్రజల కోసం కాకుండా పౌరసరఫరాల శాఖను కొందరు నేతల వ్యక్తిగత లబ్ధికోసం వాడుకున్నారని, రూ. వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మొత్తం బయటకు తీస్తానని, ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అప్పగించిన ఈ శాఖను ప్రక్షాళన చేసి గాడిలో పెడతానన్నారు. తనిఖీల్లో గుంటూరు జేసీ రాజకుమారి, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని తూకం వేసి డీలర్లకు ఇవ్వాలి

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలో కచ్చితమైన తూకంతో కాటా వేసిన తర్వాతనే డీలర్లకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్స్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈ-పోస్ కాటాలను మూలన పడేశారని, రేషన్ బియ్యాన్ని తూకం వేయకుండానే డీలర్లకు ఇస్తుండటం వల్ల ప్రతి డీలర్‌కూ 100 కేజీలకు పైగా బియ్యం తక్కువ వస్తోందని తెలిపారు. గత ఐదేళ్లలో ప్రజా పంపిణీ వ్యవస్థను భ్రష్టు పట్టించారని, దీనిని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ డీలర్లకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆయనను కలిసి వినతిపత్రం సమర్పిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య దృశ్యం
ఆదివారం • 16 జూన్ 2024

వెబ్ సిరీస్‌కు సై

పెద్దతెరపైన కథానాయికలుగా బిజీగా ఉన్నా సరే ఓటీటీ అరంగేట్రానికి ఉత్సాహం చూపుతున్నారు కథానాయికలు. మంచి కథ కుదిరితే వెబ్ సిరీస్‌లు, ఒరిజినల్ మూవీస్ చేయడానికి 'సై' అంటున్నారు. 'ది ఫ్యామిలీమాన్ 2' లాంటి సిరీస్‌లతో సమంత లాంటి అగ్ర కథానాయికలు సైతం మంచి విజయాలను దక్కించుకున్నారు కూడా. కొందరు హీరోయిన్లు సినిమాలతో సమాంతరంగా వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ ఎంట్రీలోనూ సత్తా చాటుతున్న హీరోయిన్ల గురించి తెలుసుకుందాం.









కాల్ మీ బె

విజయ్ దేవరకొండ 'లైగర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ భామ అనన్యపాండే. నిర్మాత కరణ్ జోహార్ 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' చిత్రంతో అనన్యను బాలీవుడ్ చిత్రసీమకు పరిచయం చేశారు. ఇప్పుడు అనన్యపాండే ఓటీటీ అరంగేట్రం కూడా కరణ్ ప్రాజెక్ట్‌తోనే జరగబోతోంది. అనన్యపాండేతో 'కాల్ మీ బె' అనే హిందీ వెబ్ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో ఆమె బెల్లా బె చౌదరి అనే పాత్రలో కనిపించనున్నారు. శ్రీమంతుల కుటుంబానికి చెందిన యువతి ఓ భారీ కుంభకోణానికి పాల్పడిన నేపథ్యంలో కథ సాగుతుంది. ఇది అమెజాన్ ప్రైమ్‌లో సెప్టెంబర్ 06 నుంచి స్ట్రీమింగ్ అవనుంది. కొలిన్ డి కున్హా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం అనన్య కంట్రోల్, ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ సి శంకరన్ నాయర్ చిత్రాల్లో నటిస్తున్నారు.

ఓటీటీలో కీర్తి బావుటా

దక్షిణాది చిత్ర పరిశ్రమలో చక్కని స్టార్‌డమ్‌తో కొనసాగుతున్న కొద్దిమంది కథానాయికల్లో కీర్తిసురేశ్ ఒకరు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'బేబీ జాన్' చిత్రం చేస్తున్నారు. 'రివాల్వర్ రీటా, కన్నివేడి' అనే లేడీ ఓరియంటెడ్ చిత్రాలు సెట్స్‌పైన ఉన్నాయి. త్వరలోనే 'ఉప్పు కప్పురంబు' అనే ఒరిజినల్ మూవీతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు కీర్తి. సుహాస్ లీడ్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రాన్ని ఐవీ శశి తెరకెక్కిస్తున్నారు. రాధికా లావు నిర్మిస్తున్నారు. ఓ మారుమూల పల్లెలో ప్రజలు తమకు ఎదురైన ఆకస్మిక ప్రమాదాన్నుంచి ఎలా బయటపడ్డారు అనే నేపథ్యంలో కథ సాగుతుంది. నటనకు ఆస్కారమున్న పాత్ర కావడంతో కీర్తిసురేశ్ ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పారట. అమెజాన్ ప్రైమ్‌లో ఈ చిత్రం స్ట్రీమింగ్ అవనుంది.

దీంతో పాటు కీర్తి సురేశ్ హిందీలో 'అక్క' అనే వెబ్‌సిరీస్ కూడా చేస్తున్నారు. ధరమ్ రాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ పీరియాడిక్ రివేంజ్ థ్రిల్లర్‌లో రాధికా ఆప్టే కీలకపాత్ర పోషిస్తున్నారు. గతంలో కీర్తి ఎన్నడూ చేయని యాక్షన్ సన్నివేశాల్లో అలరించబోతున్నారని యూనిట్ తెలిపింది. ముఖ్యంగా ఇద్దరు హీరోయిన్ల మధ్య వచ్చే పోరాట ఘట్టాలు సిరీస్‌కు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని టాక్. యశ్‌రాజ్ ఫిలింస్ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది.

సీటాడెల్‌తో సమంత

వెండితెరపై అగ్ర కథానాయికగా ఎదిగిన సమంత 'ది ఫ్యామిలీ మాన్ 2' సిరీస్‌తో ఓటీటీ ఎంట్రీ ఇచ్చారు. నెగెటివ్ షేడ్స్ ఉన్న రాజీ అనే పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. త్వరలోనే మరోసారి ఓటీటీలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె నటించిన 'సీటాడెల్: హనీ బన్నీ' సిరీస్ త్వరలో అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఇందులో వరుణ్ ధావన్ కథానాయకుడు. హాలీవుడ్‌లో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సీటాడెల్'కు ఇది ఇండియన్ వెర్షన్. అక్కడ ప్రియాంక చోప్రా నటించగా, హిందీలో ఆ పాత్రను సమంత పోషిస్తున్నారు. ఆమె నటించిన 'ది ఫ్యామిలీ మాన్ 2' కు దర్శకత్వం వహించిన రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. ప్రస్తుతం సమంత లీడ్‌రోల్‌లో స్వీయ నిర్మాణంలో కొత్త చిత్రాన్ని ప్రకటించారు. దీనికి 'బంగారం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు.

బృందతో త్రిష

మధ్యలో హీరోయిన్‌గా కెరీర్ కాస్త మందగించినా 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంతో తిరిగి పుంజుకున్నారు త్రిష. ఇప్పుడు వరుస చిత్రాలతో యువ కథానాయికలకు ధీటుగా సినిమాలు చేస్తున్నారు. దక్షిణాది అగ్రహీరోల సరసన నటిస్తున్నారు. ఇప్పుడు ఆమె డిజిటల్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. ఆమె నటించిన తొలి తెలుగు వెబ్‌సిరీస్ 'బృంద' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ సిరీస్‌లో త్రిష పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. సూర్య వంగల ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించాడు. తొలి సీజన్ చిత్రీకరణ పూర్తి చేశారు. సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ అవనున్నట్లు తెలుస్తోంది. త్రిష తెలుగులో చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నారు.

పార్టనర్ తమన్నా

అతిథి పాత్రలు, ప్రత్యేక గీతాలతో ప్రేక్షకులను అలరిస్తున్న సీనియర్ భామ తమన్నా భాటియా. త్వరలో ఆమె మరో వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మద్యం వ్యాపారంలో అడుగుపెట్టి విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగించిన మహిళ కథతో 'డేరింగ్ పార్ట్‌నర్' సిరీస్ తెరకెక్కుతోంది. ఇందులో తమన్నా లీడ్‌రోల్ పోషిస్తున్నారు. అర్చిత్ కుమార్, నిషాంత్ నాయక్ తెరకెక్కిస్తున్న ఈ సిరీస్‌ను కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. తమన్నా ప్రస్తుతం తెలుగులో 'ఓదెల 2' చిత్రం చేస్తున్నారు.


మరో సిరీస్‌తో...

రణ్‌బీర్ కపూర్ నటించిన 'రాక్‌స్టార్' చిత్రంతో హీరోయిన్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు నర్గీస్ ఫక్రీ. ఆ తర్వాత పలు హిట్ చిత్రాల్లో నటించి హీరోయిన్‌గా నిలదొక్కుకున్నారు. పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రం ద్వారా త్వరలోనే తెలుగు ప్రేక్షకులను అలరించబోతున్నారు నర్గీస్. సినిమాలతో పాటు వెబ్‌సిరీస్‌లపైనా ఆమె దృష్టి సారించారు. గతేడాది 'టట్లూబాజ్' సిరీస్‌తో ఓటీటీ ప్రేక్షకులకు చేరువయ్యారు. తాజాగా ఆమె మరో సిరీస్‌కు ఎస్ చెప్పారని బాలీవుడ్ టాక్. ధర్మా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సిరీస్‌లో ఆమె లాయర్ పాత్రలో కనిపించనున్నారట.

ప్రయోగాలకు వేదికగా

మాధ్యమం ఏదైనా అభిమానులను అలరించడమే హీరో, హీరోయిన్ల లక్ష్యం. ఓటీటీ వేదికలు దేశ వ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువవుతున్నాయి. దీంతో భారీ సంఖ్యలో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి అవకాశం ఉండడంతో కథానాయికలు ఈ వైపు అడుగులు వేస్తున్నారు. ఓటీటీ దిగ్గజ సంస్థలు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ లాంటివి భారీ పారితోషికాలను సైతం ముట్ట చెబుతున్నాయి. అలాగే తమ నటలోని కొత్త కోణాలను పరిచయం చేసే అవకాశం నటీనటులకు ఓటీటీల్లో దక్కుతోంది. పెద్ద తెరపై సాధ్యంకాని ప్రయోగాలు, పాత్రలను చేసేందుకు ఓటీటీని వేదికగా మార్చుకున్నారు. కాజల్ అగర్వాల్, ఇలియానా, రెజీనా, అమలాపాల్, రాశీఖన్నా లాంటి సీనియర్ హీరోయిన్లు సైతం డిజిటల్ బాట పట్టి పలు వెబ్ ఫిల్మ్స్, సిరీస్‌లతో అలరిస్తున్నారు. ●

బాధను ఓర్చుకుంటూ షూటింగ్‌లో...



రవితేజ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఇండస్ట్రీలో అనేక కష్టాలు పడి పైకొచ్చిన వ్యక్తిగా రవితేజకు మంచి పేరుంది. పనిపట్ల రవితేజకు ఉన్న అంకిత భావాన్ని ప్రశంసిస్తూ హరీశ్ శంకర్ 'మిస్టర్ బచ్చన్' షూటింగ్‌లో తీసిన కొన్ని ఫొటోలను షేర్ చేశారు. ఓ ఫొటోలో రవితేజ తీవ్రమైన మెడనొప్పితో బాధపడుతుండగా, నొప్పి తగ్గడానికి రవితేజ మెడపై బ్యాండ్ పెట్టి పట్టుకున్నారు హరీశ్ శంకర్. ఆ ఫొటోపై హరీశ్ శంకర్ స్పందిస్తూ 'థాంక్యూ అన్నయ్యా, ప్రతి రోజూ నీ కష్టంతో మాలో స్ఫూర్తిని నింపుతున్నావు. తీవ్రమైన మెడనొప్పి ఇబ్బందిపెడుతున్నా ఆ బాధను ఓర్చుకుంటూ షూటింగ్‌లో పాల్గొంటున్నావు. మాస్ మహారాజా డెడికేషన్‌కు హ్యాట్సాఫ్' అని హరీశ్ శంకర్ పేర్కొన్నారు. హరీశ్ శంకర్, రవితేజ కలయికలో వస్తున్న మూడో చిత్రమిది. ఇందులో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈనెల 17న మేకర్స్ టీజర్‌ను విడుదల చేయనున్నారు.

ప్రైమ్‌లో ఫెదరర్ కథ



ప్రముఖ టెన్నిస్ ప్లేయర్ రోజర్ ఫెదరర్ జీవిత కథ ఆధారంగా అమెజాన్ ప్రైమ్ ఓ డాక్యుమెంటరీని రూపొందిస్తోంది. దీనికి 'ఫెదరర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ట్వెల్వ్ ఫైనల్ డేస్' అనేది ఉపశీర్షిక. ఈ డాక్యుమెంటరీ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. ఈ నెల 20 నుంచి 'ఫెదరర్' స్ట్రీమింగ్ అవ్వనున్నట్లు ఓటీటీ సంస్థ ప్రకటించింది. ఆసిఫ్ కపాడియా, జోసబియా దర్శకత్వం వహించారు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఫెదరర్ తన కెరీర్‌లో 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సాధించడంతో పాటు మరెన్నో ప్రతిష్ఠాత్మక పోటీల్లో విజేతగా నిలిచాడు. 2022లో ఆయన ఆట నుంచి రిటైర్‌మెంట్ ప్రకటించారు. లండన్‌లో ఇటీవలే ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ఫెదరర్ హాజరయ్యారు. తన జీవితాన్ని తెరమీద చూసుకుంటూ కంటతడి పెట్టారు ఫెదరర్. తను జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను తెరకెక్కించిన తీరును ప్రశంసించారు.

సన్నీ స్పెషల్



నటుడిగా, కొరియోగ్రాఫర్‌గా, దర్శకుడిగా మంచి విజయాలను దక్కించుకున్నారు ప్రభుదేవా. ఇప్పుడు ఆయన హీరోగా వరుస చిత్రాలను సెట్స్‌పైకి తీసుకెళుతున్నారు. ఆయన నటించిన 'భగీర' చిత్రం ఇటీవలే విడుదలైంది. 'జాలియో జింఖానా, పేటరాప్, గోట్' చిత్రాల్లో నటిస్తున్నారు. 'పేటరాప్' చిత్రంలో వేదిక కథానాయికగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటి సన్నీలియోన్ ఈ చిత్రంలో ప్రత్యేక గీతంలో అలరించనున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. గతంలో పలు తమిళ చిత్రాల్లో నటించారు సన్నీ. చిన్న బ్రేక్ తర్వాత ఆమె మళ్లీ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు.

ఈ నెల 23న సోనాక్షి సిన్హా వివాహం




మరో బాలీవుడ్ జంట పెళ్లి పీటలెక్కబోతోంది. హీరోయిన్ సోనాక్షి సిన్హా తన ప్రియుడు జహీర్ ఇక్బాల్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెడుతున్నారు. సోనాక్షి, జహీర్ పెళ్లి గురించి కొన్ని రోజులుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. వాటిని ఈ జంట అధికారికంగా ధృవీకరించింది. ఈ నెల 23న ముంబైలో వీరి వివాహం జరగనుంది. ఓ మ్యాగజైన్ కవర్ పేజీలా డిజైన్ చేసిన వీరి పెళ్లి పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దానిపైన సోనాక్షిని ముద్దుపెట్టుకుంటున్న జహీర్ ఫొటో ఉంది. 'మీరు వింటున్న వార్తలు నిజమే...అధికారికంగా మా పెళ్లి విషయాన్ని ప్రకటిస్తున్నాం' అని ఆహ్వాన పత్రికపై ముద్రించారు. దాంతో పాటు విడుదల చేసిన ఆడియో సందేశంలో 'గర్ల్‌ఫ్రెండ్, బాయ్‌ఫ్రెండ్ లాంటి పుకార్ల నుంచి భార్యా, భర్తలుగా మారే క్షణం కోసం ఎదురుచూస్తున్నాం. జూన్ 23న మీ పనులన్నీ పక్కనపెట్టి మాతో కలసి పార్టీ చేసుకోండి. ఏడేళ్లుగా మేం ఇద్దరం కలసి ఉన్నాం. మా ఇద్దరినీ ఒక్కటి చేసిన ఎన్నో అభిరుచులు మమ్మల్ని ఇక్కడి వరకూ తీసుకొచ్చాయి. మీ ఆశీస్సులు ఇవ్వండి' అని సోనాక్షి, జహీర్ కోరారు. వీరిద్దరూ ఏడేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు. 2022లో వచ్చిన 'డబుల్‌ఎక్స్‌ఎల్' మూవీలో వీరిద్దరూ కలసి నటించారు. అయితే నా కూతురు (సోనాక్షిసిన్హా) తన పెళ్లి గురించి నాకేం చెప్పలేదు అంటూ శత్రుఘ్నసిన్హా కొన్ని రోజుల క్రితం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

రవీనా రూ. వంద కోట్ల దావా



సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న వ్యక్తిపై రవీనాటాండన్ రూ. 100 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. రవీనాటాండన్ కొందరితో గొడవపడుతున్న వీడియో ఒకటి కొన్ని రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. జర్నలిస్ట్‌గా ప్రచారం చేసుకుంటున్న మొహ్సిన్ షేక్ అనే వ్యక్తి ఆ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రవీనా టాండన్ మద్యం మత్తులో ఉన్నారనీ, ర్యాష్ డ్రైవింగ్ చేయడం వల్ల ముగ్గురు గాయపడ్డారనీ, దాంతో వారి బంధువులు రవీనాటాండన్‌పై దాడి చేశారని మొహ్సిన్ ఆ వీడియోకు వివరణ ఇచ్చారు. దీంతో సోషల్ మీడియాలో చాలా మంది రవీనాను కించపరుస్తూ కామెంట్లు పెట్టారు. అయితే అక్కడ జరిగిన విషయం వేరు అని రవీనా లాయర్ సనాఖాన్ చెప్పారు. 'డ్రైవర్ కారును రివర్స్ చేసే క్రమంలో అక్కడున్న కొందరు వ్యక్తులకు దగ్గరగా వెళ్లడంతో గొడవ జరిగింది. వారు డ్రైవర్ పైన దాడి చేసేందుకు ప్రయత్నించగా రవీనా కాపాడేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆమె మద్యం తీసుకోలేదు అని ముంబై పోలీసులు తమ స్టేట్‌మెంట్‌లో తెలిపారు' అని చెప్పారు. దాంతో తనపై తప్పుగా ప్రచారం చేసిన మొహ్సిన్‌కు రూ. 100 కోట్లకు పరువు నష్టం నోటీసులు పంపారు.

జూలైలో ప్రేక్షకుల ముందుకు



బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సర్ఫిరా'. సూర్య హీరోగా నటించిన 'ఆకాశం నీ హద్దురా' చిత్రానికి ఇది రీమేక్. మాతృకకు దర్శకత్వం వహించిన సుధా కొంగర రీమేక్‌ను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రం విడుదల తేదీని యూనిట్ ప్రకటించింది. జూలై 12న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఆకాశం కేసి తదేకంగా చూస్తున్న లుక్‌లో అక్షయ్ ఆకట్టుకున్నారు. సినిమా టీజర్‌ను ఈ నెల 20న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అరుణ్ భాటియా, విక్రమ్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఏజెంట్స్ ఆఫ్ మిస్టరీ	కొరియన్ సిరీస్	జూన్ 18
అవుట్‌స్టాండింగ్	హాలీవుడ్ మూవీ	జూన్ 18
మహరాజ్	హిందీ సిరీస్	జూన్ 19
అమెరికాస్ స్వీట్‌హార్ట్స్	వెబ్ సిరీస్	జూన్ 20
కోటా ఫ్యాక్టరీ 3	హిందీ సిరీస్	జూన్ 20
నడికర్	మలయాళ చిత్రం	జూన్ 21
ట్రిగర్ వార్నింగ్	హాలీవుడ్ మూవీ	జూన్ 21
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
అరణ్మనై 4	తమిళ చిత్రం	జూన్ 21
బ్యాడ్ కాప్	హిందీ చిత్రం	జూన్ 21
జియో సినిమా		
ది హోల్డోవర్స్	ఆంగ్ల చిత్రం	జూన్ 16
హౌస్ ఆఫ్ ది డ్రాగన్ 2	వెబ్ సిరీస్	జూన్ 17
ఇండస్ట్రీ	వెబ్ సిరీస్	జూన్ 19
బిగ్‌బాస్ ఓటీటీ 3	రియాలిటీ షో	జూన్ 21







ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 16 జూన్ 2024

విలక్షణ కెరీర్‌కు వీలుకల్పించే లెదర్ టెక్నాలజీ

మనం పెట్టుకునే బెల్ట్, ఉపయోగించే బ్యాగ్, వేసుకునే చెప్పులు చాలావరకు తోలు ఉత్పత్తులు. జాగ్రత్తగా వినియోగించుకుంటే చాలా కాలం మన్నిక కలిగి ఉంటాయి. నిజానికి ఒక జంతువుకు సంబంధించిన తోలు లేదంటే చర్మం మూడు రోజులకే కుళ్ళిపోయి నాశనమవుతుంది, వాసన వస్తుంది. దాన్ని అలా కానివ్వకుండా రసాయనాలు/ వెజిటబుల్ మెటీరియల్‌తో సంరక్షించి, ఉత్పత్తికి అనువైనదిగా మార్చడం మొదలుకుని తుది ఉత్పత్తి వరకు యావత్తు వ్యవహారాలపై అవగాహన కలిగించేదే లెదర్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని 'గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ'లో మాత్రమే సంబంధిత కోర్సులు ఉన్నాయి.

ఫుట్‌వేర్(పాదరక్షలు), లెదర్ గార్మెంట్స్(తోలు వస్తువులు) ఉత్పత్తిలో మన దేశం రెండో స్థానంలో ఉంది. తోళ్ళు/చర్మాల ఉత్పత్తిలో ఇండియా వాటా పదమూడు శాతం. భారతదేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో వేలకొద్ది లెదర్ గూడ్స్, ఫుట్‌వేర్ పరిశ్రమలు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అమెరికా, యూరప్ తదితర పాశ్చాత్య దేశాల్లో లేబర్ వ్యయాలు అధికం. ఫలితంగా లెదర్, లెదర్ గూడ్స్, ఫుట్‌వేర్ రేట్లు కూడా అధికంగా ఉంటాయి. అదే ఇండియా విషయానికి వస్తే, లేబర్ ఖర్చులు తక్కువ. అత్యున్నత నైపుణ్యాలు ఉన్న లేబర్ చాలా ఎక్కువ. ఉత్పత్తి వ్యయం కూడా మనదేశంలోనే తక్కువ. ఫలితంగా క్లార్క్స్, బాలే, ఆడిడాస్, ఎక్కో, బుగతి, రీబాక్, టింబర్‌లాండ్, కొలెహన్, నైక్ వంటి అంతర్జాతీయ బ్రాండ్లు తమ ఉత్పత్తి కేంద్రాలను మనదేశానికి మార్చుకున్నాయి.

తెలంగాణలో ఏకైక కాలేజీ

తెలంగాణ - హైదరాబాద్‌లో మాత్రమే గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ఉంది. మెహదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లే దారిలోని రాయదర్గ వద్ద దీన్ని 1980లో ఏర్పాటు చేశారు. ఏఐసీటీఈ ఆమోదంతో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు అనుబంధంగా ఆరంభమైంది. ప్రస్తుతం ఈ కాలేజీ రెండు డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తోంది.

- లెదర్ గూడ్స్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ

ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా మూడు యూనివర్సిటీల కోటా అమలవుతుంది. ఎస్ఎస్‌సీ(టెన్త్) ఉత్తీర్ణులు ఇందులో చేసేందుకు అర్హులు. ఈ కోర్సులో చేరేందుకు గరిష్ఠ వయోపరిమితి అంటూ ఏమీ లేదు. 'టీఎస్ పాలిసెట్'లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీటు లభిస్తుంది. ఈ రెండు కోర్సుల బోధనకు అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఫుట్‌వేర్ ఫ్యాషన్ స్టూడియో, స్మార్ట్ తరగతి గదులు, అర్హతలకు తోడు అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, డిజిటల్ లైబ్రరీ, ఈ బుక్స్, ఈ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఆధునిక ల్యాబ్స్ - మెషినరీ, బాలురకు హాస్టల్ సదుపాయం కూడా ఉంది.

పాలిటెక్నిక్ డిప్లొమాలు

- కోర్సు కాలవ్యవధి ఆరు సెమిస్టర్లు/మూడేళ్ళు. మొదటి అయిదు సెమిస్టర్లూ కాలేజీలోనే థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ కోర్సులో లెదర్‌కు సంబంధించి డిజైన్, ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ కొత్తగా మెటీరియల్ టెక్నిక్‌ను బోధిస్తారు. ముడిపదార్థంగా తోలుతో మొదలు పెట్టి ఫినిషింగ్ ప్రొడక్ట్ వరకు ప్రతి అంశాన్నీ థియరీలో బాగంగా చెబుతారు. చర్మం లేదా తోలుకు రంగు, మందం అలాగే విలువ పెంచడానికి అవసరమైన అన్ని వ్యవహారాలను ఈ కోర్సులో చేరిన విద్యార్థులు చదువుకోవాలి. ఆరో సెమిస్టర్ అంటే చివరి ఆరునెలలూ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ కోసం ఈ ఆరు నెలలు కేటాయించారు. ఈ సమయంలోనే ప్రాక్టికల్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అలవడతాయి. ఇండస్ట్రీ రెడీగా విద్యార్థులు తయారవుతారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉచిత వసతికి తోడు విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలనుబట్టి నెలకు స్టయిపెండ్‌గా లభిస్తుంది.
- దేశీయంగా బాటా వంటి కంపెనీలకు తోడు టాటా ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్ట్ డివిజన్, ఆడిదాస్, రీబాక్, నైక్, హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్(ఎక్స్‌పోర్ట్ డివిజన్), ఫరీదా ఎక్స్‌పోర్ట్స్, ఫ్లోరెన్స్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఈ డిప్లొమా హోల్డర్లకు జాబ్స్ లభిస్తున్నాయి. ఫుట్‌వేర్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్, ప్రొడక్షన్ ఆఫ్ ఫుట్‌వేర్, ప్రొడక్షన్ ఆఫ్ లెదర్ గూడ్స్, ప్రొడక్షన్/టానింగ్ ఆఫ్ లెదర్, టెస్టింగ్ అండ్ క్వాలిటీ కంట్రోల్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఉపాధి లభిస్తుంది. మూడు నుంచి అయిదేళ్ళ అనుభవంతో ఆంత్రప్రెన్యూర్లుగానూ మారవచ్చు. సొంతంగా యూనిట్ పెట్టుకోవచ్చు. డిప్లొమాతోనే కొందరు విద్యార్థులు విదేశాల్లోని బహుళ జాతి సంస్థల్లో చేరుతున్నారు. ముఖ్యంగా చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఉపాధి పొందుతున్నారు.
- డిమాండ్ అధికంగా ఉండటంతో కొందరు డిప్లొమా పూర్తి చేయకున్నప్పటికీ, కేవలం వ్యక్తిగత సంబంధాలతో కొద్దిపాటి జ్ఞానంతోనే జాబ్స్ పొందుతుండటం విశేషం.

ఉన్నత చదువులు: లెదర్ టెక్నాలజీలో డిప్లొమాతోనే చదువు ఆపేయనవసరం లేదు. ఈసెట్ రాసి లేటరల్ ఎంట్రీ కింద బీఈ/బీటెక్ రెండో ఏడాది కోర్సులో చేరవచ్చు. లెదర్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఐటీ, సీఎస్ఈ చేయవచ్చు.



బీటెక్ అందించే కాలేజీలు

- హార్‌కోర్ట్ బట్లర్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాన్పూర్
- దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ఆగ్రా
- అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, అలీగఢ్
- ముజఫర్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ముజఫర్‌పూర్
- అలగప్పా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, చెన్నై
- సీఎస్ఆర్ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై
- గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ లెదర్ టెక్నాలజీ, కోల్‌కతా

నిట్ రూర్కెలాలో ఎంఏ



రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- ఎంఏ(డెవలప్‌మెంట్ స్టడీస్) ప్రోగ్రాములో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటరాక్షన్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

సీట్లు: మొత్తం 39 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 14, ఓబీసీలకు 10, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3, దివ్యాంగులకు 2, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 4 సీట్లు ప్రత్యేకించారు. రిజర్వుడు వర్గాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోని పక్షంలో ఆ సీట్లను జనరల్ అభ్యర్థులకు కేటాయిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో లేదా 10 పాయింట్ల మీద 5.5 సీజీపీఏ స్కోర్‌తో బీఈ/బీటెక్/బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులై ఉండాలి. బీఏ/బీకాం/బీఎస్సీ ఆనర్స్ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 25
- **రాత పరీక్ష, పర్సనల్ ఇంటరాక్షన్:** జూలై 5
- **ఫలితాలు విడుదల:** జూలై 10
- **కౌన్సెలింగ్, అడ్మిషన్:** జూలై 15
- **వెబ్‌సైట్:** nitrkl.ac.in

లిటిల్స్



చిన్నారి పిట్ట సంకల్పం


ఒక అడవిలో అనేక రకాల పక్షులు జంతువులు కలసి మెలసి నివసిస్తూ ఉండేవి. ఒక రోజు ఆ అడవిలో ఎక్కడినుండో నిప్పు అంటుకుంది. అది అంతకంతకూ పెరుగుతూ చెట్లను కాల్చివేయ సాగింది. చాలా జంతువులు తలో దిక్కుకు పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నాయి. చేతకాని జంతువులు అలాగే ఆ మంటల్లో పడి కాలిపోయాయి. అన్ని జంతువులు అలా కంగారు పడుతూ పరిగెడుతూ ఉంటే ఒక చిన్న పిట్ట మాత్రం తన చిన్న నోటిలో పట్టినన్ని నీళ్ల దగ్గర్లోని మడుగు నుంచి తెచ్చి ఆ మంట మీద చల్లసాగింది. అది చూసిన ఒక కొంగ ఆ పిట్టతో ఇలా అంది. 'ఓసి చిన్నారి పిట్టా..., నీవు పిడికెడంత కూడా లేవు అంత పెద్ద మంట ఆర్పడం నీ వల్ల ఏమవుతుంది? వెళ్లి నీ పిడికెడు ప్రాణం కాపాడుకో పో' అన్నది. దానికి ఆ పిట్ట నవ్వి 'నీవన్నది నిజమే, నా ఒక్కదాని వల్ల కాదు కానీ మనమంతా కలసి నీళ్లు చల్లితే మంటలు ఆర్పడం ఎంత పని చెప్పు' అన్నది. దానికి కొంగ నిజమే సుమా మన మిత్రులందరినీ పిలిచి అందరం ఇదే పని చేద్దాం అని తోటి పక్షులు జంతువులన్నిటికీ వినిపించేలా కేక వేసింది. కాసేపట్లోనే చాలా జంతువులు అక్కడికి వచ్చి, చేతనైనన్ని నీళ్ల తలా కొన్ని తెచ్చి మంటల మీద చల్లడంతో ఆ మంటలు ఆరిపోయి అక్కడి పక్షులు, జంతువులు తమ ప్రాణాలతో పాటు నివాసాలు కాపాడుకున్నాయి. అన్నీ ముందుగా పని మొదలు పెట్టిన చిన్నారి పిట్టను అభినందించాయి.




ఎన్ని ఎలుగుబంట్లు ఉన్నాయి?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 334

			6	7			1	3
				5			2	
					3	4		
	3				7			2
7		4				5		8
5			4				6	
		8	9					
	2			8				
6	9			3	1			

సుడోకు - 333 సమాధానం

7	8	3	1	9	6	5	4	2
1	5	6	4	2	7	3	8	9
4	2	9	5	3	8	7	1	6
5	3	1	8	4	9	6	2	7
8	6	2	7	5	1	4	9	3
9	7	4	2	6	3	1	5	8
6	4	5	9	7	2	8	3	1
3	9	8	6	1	5	2	7	4
2	1	7	3	8	4	9	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

జాబ్ కార్నర్

సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 272

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: 139
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్: 22
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: 22
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: 10
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: 10
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హైడ్రో- జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: 2
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: 18
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: 3
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: 30

- నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టిఅండ్ఎస్ గ్రేడ్-సి: 16

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ(ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 19

వెబ్‌సైట్: scclmines.com/scclnew/index.asp

కాటన్ కార్పొరేషన్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 214

నవీ ముంబయిలోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



1. అసిస్టెంట్ మేనేజర్(లీగల్): 1 పోస్టు
2. అసిస్టెంట్ మేనేజర్(అఫీషియల్ లాంగ్వేజ్): 1
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మార్కెటింగ్): 11
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(అకౌంట్స్): 20
5. జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్: 120
6. జూనియర్ అసిస్టెంట్(జనరల్): 20
7. జూనియర్ అసిస్టెంట్(అకౌంట్స్): 40
8. జూనియర్ అసిస్టెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్): 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఏ/సీఎంఏ, బీఎస్సీ, బీకాం, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పరీక్ష కేంద్రాలు: ముంబయి/నవీ ముంబయి, హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై, లఖ్‌నవూ, ఛండీగఢ్, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పట్నా, జయపుర.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2

వెబ్‌సైట్: cotcorp.org.in/

ఎడ్యుకేషనల్ ప్లానింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంఏఈడీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్(ఎన్ఐఈపీఏ)- 'మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్(ఎంఏఈడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగేళ్ల వ్యవధిగల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్‌టీఏ నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ)-పీజీ 2024(సీఓక్యూపీ11 పేపర్) అర్హత పొంది ఉండాలి. అడ్మిషన్ నాటికి అభ్యర్థుల వయసు 21 నుంచి 65 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఎంట్రెన్స్ టెస్ట్‌ను ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో సోషల్ సైన్స్ విభాగాలకు సంబంధించి డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 50 మార్కులు నిర్దేశించారు. ఇంటర్వ్యూ కమిటీ నిబంధనల ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ-సీఎల్ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ-ఎన్‌సీఎల్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 16
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 2
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూలై 9
- **ఫలితాలు విడుదల:** జూలై 16
- **అడ్మిషన్స్:** జూలై 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.niepa.ac.in



ఎన్‌పీటీఐలో ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- ఎంబీఏ ఇన్ పవర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. వీటిలో స్పాన్సర్డ్ అభ్యర్థులకు 15 సీట్లు కేటాయించారు. సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్/జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మహిళలకు ట్యూషన్ ఫీజులో పది శాతం వరకు రాయితీ లభిస్తుంది. ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి సంవత్సరం అభ్యర్థులు హ్యూమన్ రిసోర్సెస్, ఆపరేషన్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పవర్ సెక్టార్ విభాగాల నుంచి కోర్సులు ఎంచుకోవచ్చు. రెండో ఏడాది సస్టయినబిలిటీ, డేటాసైన్స్ అండ్ డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ క్లౌడ్ స్పెషలైజేషన్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ట్రెయినింగ్ ప్రాజెక్ట్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/జీమ్యాట్/సీయూఈటీ/ఎక్స్ఏటీ/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. స్పాన్సర్డ్ అభ్యర్థులకు ఎటువంటి స్కోర్ అవసరం లేదు. వీరికి నిర్దేశించిన మేరకు అనుభవం తప్పనిసరి.

ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్

- పరీక్ష సమయం గంటన్నర. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి మొత్తం 90 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 90. నెగెటివ్ మార్కులు లేవు.
- **వెయిటేజీ:** ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్ స్కోర్/జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- స్పాన్సర్డ్ అభ్యర్థుల ఎంపికలో అకడమిక్ ప్రతిభకు 60 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 10 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.npti.gov.in